
www.andhrajyothy.com srikakulam

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



16

శ్రీకాకుళం

ఆదివారం 6 ఆగస్టు 2017



జంబుతీర్థం... జన సంద్రం

శ్రీముఖలింగంలో జరుగుతున్న అష్టతీర్థరాజమహాయోగ స్నానాలకు భక్తులు పోటెత్తారు. జంబుతీర్థం జనసంద్రమైంది.

9లో

మదుములో మృత్యువు



14లో

వరిచేలకు నీరు పెట్టేందుకు వెళ్లిన బల్లి గోవిందరావు అలియాస్ గోపి ప్రమాదవశాత్తూ కాలుజారి పడి మదుములో కొట్టుకుపోయాడు. చుట్టుపక్కల ఉన్నవారు బయటకు తీసేసరికి మృత్యువాత పడ్డాడు. ఈ విషాదకర ఘటన హరిశ్చంద్రపురంలో శనివారం చోటుచేసుకుంది.

వంశధారతో సమగ్రాభివృద్ధి

16లో

కోట్లలో బకాయి... ఇచ్చేదెపుడోయి?



కూలికెళితేగానీ కడుపు నిండని జీవితాలు. రెక్కల కష్టంపై వచ్చే నాలుగు రూపాయలే ఆధారం. ఉపాధి హామీ పథకంతో కాస్తో కూస్తో ఊరట లభిస్తుందనుకుంటే...అక్కడా అంతే. ఇక్కడ పని ఉందనే ఆశతో వలస వెళ్లలేక...కూలి డబ్బులు చేతికి అందక... మూడు నెలలుగా కూలీలు అవస్థలు పడుతున్నారు. కేంద్రం కరుణ కోసం మూడు నెలలుగా ఎదురుచూస్తునారు.

- 'ఉపాధి'లో రూ.28.24 కోట్ల బకాయిలు
- మూడు నెలలుగా విడుదల కాని వేతనాలు
- గగ్గోలు పెడుతున్న వేతనదారులు
- పూట గడవక కష్టాలు

14లో

అమ్మ గుండె చెరువై... భార్య గుండె బరువై!



భార్యతో రమణ (ఫైల్)

పుణ్య స్నానాలు ఆచరించేందుకు భార్య, తల్లితో కలసి బయలుదేరిన ఆ వ్యక్తి...తనవారి కళ్ల ముందే వంశధార నదిలో గల్లంతయ్యాడు. పడవ వచ్చేసరికి ఆలస్యమవుతుందని...ఈలోగా ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు చేరుకోవచ్చని భావించిన ఆ వ్యక్తి నదిలో దిగాడు. కొంతదూరం వెళ్లాక...ఒక్కసారిగా సాయం కోసం ఆర్తనాదాలు చేశాడు. అప్పటికే సమయం మించిపోయింది. ఒడ్డున ఉన్నవారు అక్కడికి చేరుకునేలోపే ఆ వ్యక్తి కనుమరుగయ్యాడు. ఎల్.ఎన్.పేట మండలం వాడవలస రేవు వద్ద చోటుచేసుకున్న ఈ సంఘటనలో సరుబుజ్జిలి మండలం గోనెపాడుకు చెందిన గొండు రమణ(48) గల్లంతయ్యాడు.

- వంశధార నదిలో వ్యక్తి గల్లంతు
- అష్టతీర్థ రాజమహాయోగంలో అపశ్రుతి
- అందరూ చూస్తుండగానే ఘోరం
- సరుబుజ్జిలి మండలంలో విషాదం

వాడవలస (ఎల్ఎన్‌పేట), (సరుబుజ్జిలి)

శ్రీముఖలింగంలో అష్టతీర్థ రాజమహాయోగ స్నానాలకు బయలుదేరిన వ్యక్తి వంశధార నదిలో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు చూస్తుండ గానే కనిపించకుండాపోయాడు. సరుబుజ్జిలి మండలం గోనెపాడు గ్రామానికి చెందిన గొండు రమణ(58) తన తల్లి శార్వాణి, భార్య జ్యోతితో శనివారం తీర్థానికి బయలుదేరాడు. ఎల్ఎన్‌పేట మండలం వాడవలస రేవు - మిగతా 14లో



నదిలో గాలిస్తున్న ఈతగాళ్లు



ఇంటి వద్ద విలపిస్తున్న తల్లి, కుటుంబసభ్యులు



మినహాయింపు

- గ్రామీణ ప్రాంతాల్లో తప్పనున్న ఇంటి పన్ను బెడద
- దారిద్ర్యరేఖకు దిగువనున్న వారికి వర్తింపు
- జిల్లాలో 4 లక్షల కుటుంబాలకు ప్రయోజనం

శ్రీకాకుళం సిటీ

గ్రామీణ ప్రాంత పేద, మధ్య తరగతి ప్రజలకు శుభవార్త. వీరికి ఇంటి పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ - మిగతా 14లో

కళ తప్పింది..!

● వెలవెలబోతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ● భూ విలువ పెంపుతో నిలిచిన రిజిస్ట్రేషన్లు ●లక్ష్యాలపై నీలినీడలు ● తలలు పట్టుకుంటున్న అధికారులు

(పాలకొండ టౌన్)

భూములు, స్థలాల విలువలను ఆగస్టు ఒకటి నుంచి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ఒక్కసారిగా 25 శాతం వరకు విలువలను పెంచడంతో ఈపరిస్థితి దాపురించింది. జూలై 31న అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రిజిస్ట్రేషన్ల జాతర నెలకొంది. ఆగస్టు ఒకటి ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జిల్లాలో జరగలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. వీటి ప్రభావం జిల్లాలో రిజిస్ట్రేషన్‌శాఖకు విధించిన లక్ష్యాలపై ప్రభావం చూపుతుందని సంబంధితశాఖా ధికారుల నుంచి వినిపిస్తోంది. అలాగే ఇప్పటి వరకు పెంచిన రిజిస్ట్రేషన్ విలువల వివరాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రాకపోవడం కూడా కొన్ని చోట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగడం లేదు. జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయా లున్నాయి. ప్రతిరోజు ఒక కార్యాలయంలో పది నుంచి 20 వరకు వివిధ రకాలైన రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయి. అయితే గడిచిన ఐదు రోజుల్లో జిల్లాలో ఒకటి, రెండు రిజిస్ట్రేషన్‌ల మినహా ఎక్కడా అనుకున్న స్థాయిలో రిజిస్ట్రేషన్‌లు జరగలేదు. ఈ ఏడాది రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా అంతంతమాత్రంగా ఉంది. ఇక వ్యవసాయ పనులు సాగుతుండటంతో రిజిస్ట్రేషన్‌లు మందకొడిగా సాగుతున్నాయని అంతా భావిస్తున్నారు.



రిజిస్ట్రేషన్‌లు లేక ఖాళీగా ఉన్న పాలకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

జిల్లాలో అమలు కాని నూతన మార్కెట్ విలువ ..

రాష్ట్ర ప్రభుత్వం స్థలాలు, భూములు, అపార్టుమెంట్‌లు మార్కెట్ విలువలను ఆగస్టు ఒకటి నుంచి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా వాటి వివరాలను రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అందుబాటులో ఉంచాలి. ఆ దిశగా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో జిల్లాలో ప్రస్తుతం మార్కెట్ విలువకు సరిపడా విధంగా ధరలను నిర్ణయించి పది సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు జాబితాలను పంపించారు. మిగిలిన ఐదు కార్యాలయాలకు సోమవారం నాటికి పంపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈనెల ఒకటి నుంచి మాన్యువల్ పద్ధతిలో రిజిస్ట్రేషన్‌లు చేయాలని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ మార్కెట్ విలువలు అప్‌గ్రేడ్ కాకపోవడంతో అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టలేదు.

రూ. 111 కోట్లు లక్ష్యం ..

జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖకు ప్రభుత్వం రూ.111 కోట్ల ఆదాయం లక్ష్యంగా నిర్దేశించింది. జూలై 31 వరకు రూ.35 కోట్లు మేర ఆదాయం చేకూరినట్టు ఆ శాఖ జిల్లా అధికారుల ద్వారా తెలుస్తోంది. అయితే ఆగస్టు ఒకటి నుంచి రిజిస్ట్రేషన్ ఫీజులను 25 శాతం వరకు పెంచడంతో లక్ష్యాలు అనుకున్న స్థాయిలో జరిగుతాయా లేదా అనే విషయమై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా రిజిస్ట్రేషన్‌శాఖకు ఆదాయం సమకూర్చాల్సి ఉంది. ప్రభుత్వం పెంచిన ఫీజులను ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఉన్న భూములు, స్థలాలు, ఇతర సముదాయాల ధరల ఆధారంగా ఏడు నుంచి 25 శాతం వరకు పెంచారు. దీంతో భూములు, స్థలాలు, అపార్టుమెంట్‌లు మార్కెట్ విలువల అమలులోకి వచ్చాయి. ఇప్పటికే రిజిస్ట్రేషన్‌లు సక్రమంగా జరగక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ శాఖకు మార్కెట్ విలువ పెంపుతో మరింత ఆదాయం పడి పోయే అవకాశం ఉంది.

రేపు శ్రీముఖలింగేశ్వరాలయం మూసివేత

జలుమూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగం లోగల శ్రీముఖలింగేశ్వరాలయాన్ని సోమవారం మధ్యాహ్నం నుంచి మూసివేస్తున్నట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. ఈనెల ఏడో తేదీ రాత్రి చంద్ర గ్రహణం పడుతున్న సందరంగా మధ్యాహ్నం మూడు గంటలకు ఆల యాన్ని మూసివేసి మంగళ వారం ఉదయం సంప్రోక్షణం చేసి ఆలయా న్ని తెరిచి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. శ్రావణమాసం పౌర్ణమి శ్రవణ నక్షత్రం మకరరాశిలో సోమవారం పర్వదినం రాత్రి గం. 10-52లకు చంద్రగ్రహణం ప్రారంభమై గం.12-49లకు విడచిపెడుతుందని అర్చకుల సంఘం అధ్యక్షుడు పెద్దలింగన్న చెప్పారు.



శ్రీముఖలింగేశ్వర స్వామివారి ఆలయం

అష్టతీర్థ స్నానాలకు వచ్చే భక్తులు గమనించి 3 గంటలులోపు స్వామి వారిని దర్శించుకోవాలని సూచించారు. శ్రీముఖలింగేశ్వర ఆలయంతోపాటు సోమేశ్వర, భీమేశ్వరాలయాలను కూడా ఈ సందర్భంగా మూసివేస్తున్నట్టు తెలిపారు.

ఉపరాష్ట్రపతి వెంకయ్యకు అచ్చెన్న శుభాకాంక్షలు

శ్రీకాకుళం కలెక్టరేట్ : భారత కొత్త ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు మంత్రి అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో వెంకయ్య భారీ మెజార్టీతో గెలుపొందడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు వ్యక్తి దేశ అత్యున్నత స్థానంలో కూర్చోవడం తెలుగువారందరికి గర్వకారణమని కొనియాడారు. తెలుగు వ్యక్తిగా వెంకయ్య కేంద్ర మంత్రిగా ఉంటూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. రాష్ట్రంలో కేంద్రం నుంచి మంజూరైన పలు ప్రాజెక్టు వెనుక వెంకయ్య కృషి ఎంతగానో ఉందని పేర్కొన్నారు. సమున్నత వ్యక్తికి సముచిత స్థానం లభించడం తెలుగువారికి గర్వకారణంగా ఉంటుందని ఒక ప్రకటనలో పేర్నొన్నారు. రాష్ట్రమంత్రిగా వెంకయ్యను తన తరఫున మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టుపేర్కొన్నారు.

ప్రియమైన బాపూజీకి..


(శ్రీకాకుళం సిటీ)

ప్రియమైన బాపూ....

మీ పాదాలకు నమస్కరించి రాయునది ఏమనగా, మీరు నడయాడిన ఈ భూమిపై నేను కూడా నడవడం నాకు ఒక కలగా అనిపిస్తోంది. మీ స్ఫూర్తితో నాలో ఉన్న భావాలన్నీ అక్షరాలుగా మార్చి రాస్తున్న ఒక లేఖ. కర్కశత్వానికి మారుపేరైన బ్రిటీష్ వారికి శాంతి కపోతాన్ని అందించి శాంతిమార్గంలో భరతమాతకు విముక్తి కల్పించి ఆ సేతు హిమాచలానికి స్వేచ్ఛావాయువులు ప్రసాదించిన మీరు మా అందరికీ పూజ్యులు. దేశమే కాదు ప్రపంచ దేశాలు మిమ్మల్ని శ్లాఘిస్తూ ఉంటే ఒక్కొక్కసారి గాంధీ అనే బక్కపల్చని శరీరం భరత ఖండంలో నిజంగా పుట్టారా అనిపిస్తుంది. మీ సిద్ధాంతాలు, జీవన సూత్రాలు ఎప్పటికీ అనుసరణీయమే. తరాలు మారినా అహింసా సిద్ధాంతానికి మీరే ప్రేరణ.

ఇట్లు
మీ విధేయుడు

ఇది ఒక మోడల్ లేఖ. ఇలా విద్యార్థులు పూజ్య బాపూజీ గురించి తమకు తోచిన విధంగా లేఖలు రాయొచ్చు. చక్కగా రాసి జాతీయ స్థాయి విజేతగా నిల వొచ్చు. భారీ నగదు బహుమతి కైవసం చేసుకోవచ్చు.



తపాలాశాఖ ఆధ్వర్యంలో 'ప్రియమైన బాపూ... మీరు నాకు ప్రేరణ' అనే అంశంపై జాతీయ లేఖారచన పోటీలు నిర్వహి స్తోంది. ఇంగ్లీష్, హిందీ, స్థానిక భాషల్లో లేఖను రాసి పంపవచ్చు. ఉత్తమమైన వాటికి బహుమతులు అందజేస్తారు. అఖిల భారత స్థాయిలో ప్రథమ బహుమతిని రూ.50 వేలతోపాటు ప్యాట్రన్ ఆఫ్ పోస్టల్ బిరుదును అందజేస్తారు. ద్వితీయ బహుమతిగా రూ.25 వేలతో పాటు కంపానియన్ ఆఫ్ పోస్టల్ బిరుదును, తృతీయ బహుమతి గా రూ.10 వేల నగదు పాటు పోస్ట్‌పాల్ అనే బిరుదును అందజేస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతికి రూ.25 వేలు, ద్వితీయ బహుమతికి రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.ఐదు వేలు అందజేస్తారు.

● ఎక్కడికి పంపాలి..

బాపూ, లేదా మహాత్మాగాంధీ పేరుతో లేఖ రాసి చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్, డాక్ సదన్, అబిడ్స్, హైదరాబాద్-500001 తపాలా చిరునా మాకు పంపాలి. పోస్టాఫీస్‌లోనే ప్రత్యేకంగా బాక్స్ కూడా ఉంచారు. అందులో వేసినా సరిపోతుంది. ఈ నెల 15లోగా లేఖలను పంపించాల్సి ఉంటుందని శ్రీకాకుళం పోస్టల్ సూపరింటెండెంట్ డబ్ల్యు. నాగాదిత్యకుమార్ శనివారం ఆంధ్రజ్యోతికి చెప్పారు.

తపాలాశాఖ ఆధ్వర్యంలో లేఖల పోటీలు

మహాత్మా గాంధీ నాకు ప్రేరణ అంశంతో..

● ఎలా రాయాలి..

ఏ4 సైజ్ తెల్లకాగితంపై ఈ లేఖను రాయాలి. వెయ్యి పదాలకు మించకుండా పూర్తిచేయాలి. ఇన్‌లాండ్ లెటర్‌లో రాస్తే 500 పదాలకు మించకూడదు. 18 ఏళ్ల లోపు, ఆపై వయస్సు వారికి రెండు విభాగాల్లో పోటీలుంటాయి. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన లేఖల్లో కొన్ని ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి సబర్మతి ఆశ్రమానికి పంపుతారు. అక్కడ పరిశీలించిన అనంతరం జాతీయ స్థాయి విజేతలను ప్రకటిస్తారు. మిగిలిన వాటిని తిరిగి పంపిస్తారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఆశ్రమంలో నిర్వహించే కార్యక్రమంలో విజేతలకు పురస్కారాన్ని అందజేస్తారు. రాష్ట్రంలో ప్రతి కేటగిరీలో మూడు ఉత్తమ లేఖలను ఎంపిక చేసి గాంధీ జయంతి నాడు హైదరాబాద్‌లో నిర్వహించే స్టాంపు ప్రదర్శనలో పురస్కారాలు అందిస్తారు.

విద్యార్థుల వసతులకు ప్రణాళికలు సిద్ధం చేయండి

కలెక్టర్ ధనుంజయరెడ్డి

డేఅండ్‌నైట్ జంక్షన్ : జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కెజీబీవీలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ కె.ధనుంజయరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాల సంక్షేమ అధికారులు, సహాయ సంక్షేమ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గురుకుల పాఠశాలకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ, భవనానికి అవసరమైన మరమ్మతులు, పెయింటింగ్ తదితర అవసరాలను గుర్తించి వాటి అంచనాను అందజేయాలన్నారు. వాటి కయ్యే ఖర్చును ఆయా శాఖాలకు మంజూరు చేయబడే నిధులు నుంచి పొందాలని ఆదేశించారు. ఇంకా నిధులు అవసరమైతే మంజూరు చేస్తామని చెప్పారు. ప్రతి హస్టల్‌లోనూ పరిశుభ్రమైన నీరు లేని పక్షాన ఆర్వోప్లాంట్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి హస్టల్ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లాలో ప్రతి వసతి గృహానికి అవసరమైన ప్రతి సౌకర్యాన్ని కల్పించాలని ఏ ఒక్క పాఠశాల నుంచి ఫిర్యాదు అందకూడదన్నారు. గురుకుల పాఠశాలలంటే విద్యార్థుల తల్లి దండ్రుల్లో చిన్నచూపు ఉందని, దాన్ని రూపుమాపాలన్నారు. రానున్న కాలంలో పాఠశాలలను మరింత భలోపేతం చేస్తామని చెప్పారు. వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించాలని చెప్పారు. వారి బాగోగులు చూడాల్సిన బాధ్యత సంక్షేమాధికారులపై ఉందన్నారు. కేజీబీవీలో చదివే విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సర్వశిక్షాభియాన్ పీవోను అదేశించారు. ప్రతి కేజీబీవీకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కాంపౌండ్ లేనివాటికి ఏర్పాటు చేయాలన్నారు. ఆర్వోప్లాంట్‌తో పాటు డ్రైనేజీ సమస్య పరిష్కార మార్గాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతక ముందు వసతి గృహాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎస్టీ గురుకులాల పాఠశాలలకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఐటీడీఏ నుంచి నిధులు కేటాయిస్తున్నట్టు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్.శివశంకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో శివశంకర్‌తో పాటు సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకు ధనుంజయరావు, ఐటీడీఏ డిప్యూటీ డీవో జి.రామ్మోహనరావు, ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ రోజారాణి, పీఎంఆర్‌సీ సిబ్బంది సీహెచ్ జ్యోతి, నందేష్, ఎస్సీ, ఎస్సీ, బీసీ సంక్షేమశాఖ హస్టల్స్ వార్డిన్స్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సీడీపీవో మనోరమ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్
- విచారణ అధికారిగా జెడ్పీ సీఈవో

(శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి)

పాలకొండ స్త్రీశిశు సంక్షేమశాఖ సీడీపీవో మనోరమపై సస్పెన్షన్ వేటు పడింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, సహోద్యోగులపై వేధింపులు, ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులపై అలసత్వం, ప్రారంభమైన ప్రభుత్వ భవనంలోకి మారడంలో అలక్ష్యం వంటి పలు కారణా లతో కలెక్టర్ ధనుంజయరెడ్డి ఆమెను సస్పెండ్ చేస్తూ శనివారం నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మనోరమ వ్యవహారశైలిపై ప్రత్యేక విచారణ జరిపించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈవోను విచారణ అధికారిగా నియమించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి ఆమె నిర్లక్ష్యధోరణి, ఉద్యోగుల వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ నెల ఐదో తేదీన నిర్వహించిన జిల్లా పరిషత్ సమావేశంలోను మంత్రి అచ్చెన్నాయుడు దగ్గర నుంచి పాలకొండ మండల ప్రజాప్రతినిధులు వరకు మనోరమ వ్యవహారశైలిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ నిధుల వినియోగం, విడుదలలో నిర్లక్ష్యం ప్రదర్శిం చారని, విధుల్లో కూడా బాధ్యతారహితంగా ఉన్నారని పెద్ద ఎత్తున విమర్శించారు. దీంతో ఆమెను సస్పెండ్ చేయాలని సభా ముఖంగా మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. మరోపక్క మనోరమ తీరుపై ఈ నెల ఆరో తేదీన ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో "ఇదేమి తీరు" అంటూ ప్రత్యేక కథనం కూడా ప్రచురించింది. అటు ఐసీడీఎస్ పీడీ కూడా ఇప్పటికే మనోరమపై రెండుసార్లు తాను తయారుచేసిన నివేదికను ఏజేసీ రజనీకాంతరావుకు అందించారు. దీంతో ఆయన కూడా ఆమెను సస్పెండ్ చేయడమే సరైనదని భావిస్తూ ఫైల్‌పై సంతకం చేస్తూ కలెక్టర్‌కు నివేదిక పంపించారు. దీంతో సస్పెన్షన్ ఆర్డర్ ఇస్తూ కలెక్టర్ ఎట్టకేలకు ఆదేశాలు జారీచేశారు. కాగా తన తీరుపై పెద్ద ఎత్తున దుమారం చెలరేగిన నేపథ్యంలో ఇటీవల మనోరమ కలెక్టర్‌ను కలిసి వివరణ ఇచ్చేందుకు కలె క్టరేట్‌కు వచ్చారు. కాని ఈమెతో మాట్లాడేందుకు అధికారులు సుముఖత చూపకపోవడం విశేషం.

ప్రేమ వ్యవహారమై విద్యార్థుల కొట్లాట

టెక్కలి : ఇందిరాగాంధీ కూడలి సమీపంలో చాలాకాలంగా నడుస్తున్న ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం ప్రేమ వ్యవహారమై సమీపంలో గల రైలు పట్టాలపై వాగ్వివాదానికి దిగి చివరకు కొట్లాడుకున్నారు. ఇదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినికి మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి, రెండో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి ఇద్దరూ ప్రేమించామంటూ ఒకరికొకరు వాదులాడుకుంటూ తగాదాకు దిగారు. ఈ వ్యవహారమై మొదటి సంవత్సరం విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎవరికి వారే తమ తోటి విద్యార్థులను రప్పించి బలాలు పెంచుకొని ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. ఇదే సమయంలో పాత జాతీయరహదారి వెంబడి పోలీసు వాహనం సైరన్‌తో వెళ్తుండడం గమనించిన విద్యార్థులు తమ కోసమే పోలీసులు వస్తున్నారనే అనుమానంతో అక్కడ నుంచి పరుగు లంకించారు. కొంతసేపటి తరువాత మళ్లీ కొందరు విద్యార్థులు పోగవగా వారికి స్థానికులు కొందరు మద్దతు పలకడంతో వివాదం మరింత తీవ్రమైంది. సోమవారం కళాశాల తరగతులు తెరిచిన తర్వాత మళ్లీ విద్యార్థులు కొట్లాడుకునే అవకాశం ఉందని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణా రాహిత్యాన్ని కోల్పోవడం ఇటువంటి తగాదాలకు కారణమవుతున్నాయి. వీటిపై మఫ్తీల్లో పోలీస్ బృందాలు దృష్టిసారిస్తే ఇటువంటివి నివారించవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కిడ్నీ వ్యాధితో యువకుడి మృతి

కొఠారి (ఇచ్ఛాపురం రూరల్): కిడ్నీ వ్యాధితో కొఠారికి చెందిన పిట్ట లోకేష్ శనివారం మృతి చెందాడు. కొంతకాలంగా ఆయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. పేదరికం వల్ల సకాలంలో వైద్యం చేయించుకోలేకపోయడని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలోకి వచ్చిన చంద్రన్న సంచార వాహనం దగ్గర మందులు తీసుకునేవాడని అయినప్పటికీ ఫలితం లేకపోయిందని చెప్పారు. ఆయనికి ఇంకా పెళ్ళి కాలేదని, తల్లిదండ్రులు, చెల్లి ఉన్నారని తెలిపారు. ఆయన మృతికి ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం.లింగరాజు, ఏఎంసీ చైర్మన్ ఎస్.సహాదేవురెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

లారీ మాయం

- పోలీసు స్టేషన్లో ఫిర్యాదు

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల జాతీయ రహదారి సేఫ్టీరోడ్డులో నిలిపిన లారీ మాయమైనట్టు స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు అందింది. పోలాకికి చెందిన ఈ లారీకి డ్రైవర్‌గా ఎచ్చెర్లకు చెందిన జె.రామారావు పనిచేస్తున్నారు. శుక్రవారం సేఫ్టీరోడ్డుపై లారీ నిలిపి ఇంటికి వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి లారీ కనిపించలేదు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మత్తులోనే కానిస్టేబుల్‌పై దాడి!

- సాయంత్రం 6 గంటల వరకు కాశీబుగ్గలోనే మకాం
- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రోణుకేశ్వరరావు (ఫైల్)

పలాస: కాశీబుగ్గ పోలీస్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రోణుకేశ్వరరావుపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుల కోసం పోలీసులు గాలింపు ఉధృతం చేశారు. ఇచ్ఛాపురం, టెక్కలి సీఐలు అవతారం, భవానిప్రసాద్‌లతో కూడిన ప్రత్యేక బృందాలు విస్తృతంగా సోదాలు జరుపుతున్నారు. హత్యాయత్నానికి పాల్పడిన నిందితుల వ్యవహారంపై మరో కోణం బైటపడింది. గంజాయి సేవించి ఆ మత్తులోనే కానిస్టేబుల్‌పై కత్తితో దాడికి దిగారని పోలీసులు భావిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తుండడంతో ఒకొక్కటి బైటకు వస్తున్నాయి. రెండు రోజుల క్రితం నిందితులుగా అనుమానిస్తున్న కె.గణేష్‌తో పాటు ఆయన ఇద్దరు అనుచరులు గంజాయి సేవించి బైక్‌పై వెళ్తుండగా కానిస్టేబుల్ రోణుకేశ్వరరావు అడ్డుకొని వారికి దేహశుద్ధి చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో హత్యాయత్నానికి పాల్పడిన రోజున కూడా ఆ ముగ్గురూ బైక్‌పై తారాసపడడంతో వారి వాహనం తాళాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అస్వస్థతలో ఉన్న మాజీ ఎంపీ దివంగతనేత అప్పయ్యదొర కుమారుడు విజయ్‌కుమార్ దొరకు ఫిజియోథెరపీ సలహాలు ఇచ్చేందుకు కానిస్టేబుల్ రోణుకేశ్వరరావు వెళ్లగా ఆయన వాహనం బైట ఉండడం చూసి పథకం ప్రకారం నిందితులు కత్తులు తమ వెంట తీసుకుని వెళ్లి హత్యాయత్నం చేశారు. ఈ సంఘటనలో కానిస్టేబుల్ తిరగబడడంతో వారు పరారయ్యారు. అప్పటికే తీవ్ర గాయాలతో కానిస్టేబుల్ అపస్మారకస్థితిలోకి వెళ్లడం, ఈ క్రమంలో స్థానిక ప్రజలు రావడంతో నిందితులు పరారయ్యారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న కానిస్టేబుల్ రోణుకేశ్వరరావును బతికించాలని కాశీబుగ్గ డీఎస్పీ సీహెచ్.వివేకానంద, పోలీసులు ఆసుపత్రికి తరలించారు. నిందితుల కోసం వెంటనే గాలించి ఉంటే తక్షణమే పట్టుబడేవారనే ప్రజల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా మధ్యాహ్నం రెండు గంటలకు జరిగిన ఈ సంఘటన తర్వాత నిందితులంతా కాశీబుగ్గ సూదికొండ- నెమలికొండ ప్రాంతాల్లో సంచరించారని పోలీసులు భావిస్తున్నారు. వారి సెల్‌ఫోన్ నెంబర్లు ఆయా ప్రాంతాల్లో సాయంత్రం 6 గంటల వరకు సిగ్నల్స్ ఉండడంతో అక్కడే సంచరించారని పోలీసుల విచారణలో బైటపడింది. అనంతరం వారి సెల్‌ఫోన్లు స్విచ్ ఫ్ చేయడంతో లోకేషన్ పట్టుబడలేదు. ఈ లోగా నిందితులు పరారయ్యేందుకు అవకాశం లభించింది. ప్రస్తుతం ఆసుపత్రిలో తీవ్ర గాయాలతో ఉన్న రోణుకేశ్వరరావు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వైద్యుల నుంచి సమాచారం అందింది. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా కేవలం బైక్ కోసం దుండగులు ఏకంగా కానిస్టేబుల్‌పైనే హత్యాయత్నానికి పాల్పడడంతో పోలీసుల్లో కూడా ఆత్మస్థైర్యం సన్నగిల్లుతోంది.

వరుస సంఘటనలతో బెంబేలెత్తుతున్న కాశీబుగ్గ పోలీసులు

ఇప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న కాశీబుగ్గ పోలీస్టేషన్‌లో పోలీసులపై వరుస సంఘటనలు జరగడంతో బెంబేలెత్తుతున్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గాయనుకుంటే నేరాలు అధికంగా కావడంతో కంటిపై కునుకు లేకుండా పోయింది. మూడు నెలల్లో ఇంటిల్లో ఎవరూ లేని సమయం లో దొంగలు దూరి విలువైన సామగ్రి దోచుకుపోయిన సంఘటనలు వరుసగా జరిగాయి. దీనిపై దృష్టి సారిస్తున్న సమయంలో వారం రోజుల క్రితం చైన్‌స్నాచింగ్ పోలీసులకు సవాల్‌గా మారింది. దీని నుంచి ఉపసమనం పొందుతున్న సమయంలో ఏకంగా కానిస్టేబుల్ పైనే దాడికి దిగి దుండగులు పోలీసులకు సవాల్ విసిరారు. ఇదిలా ఉండగా కాశీబుగ్గ పోలీ స్టేషన్‌లో కూడా డొల్లతనం బైటపడింది. మొత్తం 54 మంది సిబ్బంది కాశీబుగ్గలో విధులు నిర్వహించాల్సి ఉంది. బదిలీల నేపథ్యంలో కేవలం 14 మంది సిబ్బందే విధులు నిర్వహిస్తున్నారు. అందులో సీఐతో సహా ఏడుగురు తూర్పుగోదావరి జిల్లాకు విధి నిర్వహణకు వెళ్లగా ఇద్దరు ఎస్ఐలతో సహా కేవలం ఏడుగురే విధులు నిర్వహిస్తుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జిల్లా కేంద్రం శ్రీకాకుళం తర్వాత కాశీబుగ్గ అతి పెద్ద పోలీస్టేషన్‌గా రికార్డు ఉన్నా సిబ్బందిని మాత్రం నియమించలేకపోయారు. లక్ష మంది జనాభా ఉన్న పలాస-కాశీబుగ్గ, మరో 60 వేల మంది జనాభా ఉన్న పలాస మండలానికి ప్రస్తుతం ఏడుగురు పోలీసులు విధులు నిర్వహిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసు బాసులు గుర్తించి సిబ్బందినైనా వెంటనే నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసులకు సవాల్‌గా మారిన దొంగతనాలు

- చెవిటమ్మతల్లి గుడిలో చోరీ
- నగలు, నగదు అపహరణ
- వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

ఆమదాలవలస: పట్టణం గత కొన్ని రోజులుగా జరుగుతున్న దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారింది. వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పట్టణంలో రోజుకో వీధిలో దొంగతనాలు జరగడంతో ప్రజలు కంటిమీద కునుకులేకుండా బాధపడుతున్నారు. స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న వెంగళరావు కాలనీ, పాత ఆమదాలవలస ప్రజల ఆరాధ్యదైవం చెవిటమ్మతల్లి ఆలయంలో శుక్రవారం రాత్రి దొంగలుపడ్డారు. శ్రావణ శుక్రవారం అమ్మ వారికి నగలు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. యథావిధిగా ఆలయ పురోహితురాలు జోల అన్నపూర్ణమ్మ గుడికి రాత్రి తాళాలు వేసి ఇంటికి వెళ్ళారు. శనివారం వెకువజామున గుడి తలుపులు తీసి అమ్మవారికి పూజలు చేపట్టేందుకు వచ్చిన ఆమెకు ఉత్తర భాగంలో ఉన్న ఆలయ తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించింది. ఆలయంలోకి ప్రవేశించగా అమ్మవారి మెడలలో ఉన్న శతమానం, హారంతోపాటు వెండి అభరణలు, హూండిలో ఉన్న నగదు అపరహరణకు గురైనట్లు గుర్తించింది. ఈ విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు తెలియజేయగా, వారు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ డి. నవీన్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ జి. వాసుదేవరావు చోరి జరిగిన తీరును పరిశీలించారు. దొంగలు ఉత్తర, దక్షిణ వైపు ఉన్న ఇనుప గ్రిల్స్‌ను ఇనుప రంపంతో కోసి ఆలయంలోకి ప్రవేశించినట్లు గుర్తించారు. క్లూటీమ్ తెప్పించి వేలి ముద్రలను సేకరించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజలు ఆలయం వద్దకు తరలివచ్చారు. డీఎస్పీ భార్గవనాయుడు విషయం తెలుసుకుని ఆలయాన్ని సందర్శించి స్థానిక పోలీసుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. అమ్మవారి మెడలో ఉన్న శతమానంతో పాటు హారం, ముక్కు పుడక ఇతర బంగారపు వస్తువలు ఆరు తులాలు ఉన్నాయని, శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశామని , గతంలో అమ్మ వారి మెడలో ఉన్న నగలను రాత్రి వేళలలో తీసివేసి భద్రపర్చేవారమని అయితే , శుక్రవారం వ్రతం సందర్భంగా రాత్రి నగలను తీయలేదని పోలీసులకు అన్నపూర్ణమ్మ తెలిపారు. హూండీ పగలు కొట్టిసరాసరీ రూ.30 వేలు నగదు, 15 తులాల వెండి అభరణాలు కూడా అపరహరించారని తెలిపారు.

పోలీసులు మాత్రం నగలు, నగదు పైన మాత్రమే అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. ఎస్ఐ వాసుదేవరావు మాట్లాడుతూ ఆ వ్మువారి హారంతో పాటు శతమానాలు మూడు పోయినట్టు గుర్తించామని , అలాగే రూ.5 వేలు విలువచేసే వెండి వస్తువులు, నగదు సుమారు రూ.5వేలు ఉంటుందని భావిస్తున్నామని తెలి పారు. వేలి ముద్రల ఆధారంగా దర్యాప్తు జరిపి నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. అమ్మవారి అభరణాలపై అబద్దం చెప్పాల్సిన పని ఎవరికీ ఉండదని స్థానిక కమిటీ సభ్యులు పోలీసులకు తెలిపారు.



ఆలయంలో తనిఖీ చేస్తున్న పోలీసులు.. వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

అంతర్రాష్ట్ర ముఠాలతోనే..

గత నెల 20న పట్టణంలో మూడు చోట్ల పట్టపగలు చోరీలు జరిగిన దొంగలను పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేసే సమయంలో అమ్మ వారి గుడిలో దొంగతనం పోలీసులకు సవాల్‌గా నిలిచింది. ఈ ప్రాంతంలో ఉన్న గత నేరచరిత్ర కలిగిన చత్తీస్‌ఘడ్, రాయిపూర్, బరంపురం, బెంగాల్‌కు చెందిన దొంగల ముఠాలతో పరిచయాలు ఉండటంతో రైల్వే స్టేషన్ అందుబాటులో ఉండటంతో దొంగతనాలు జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

'వనం-మనం' వినియోగించుకోండి

లోహరిబంద(హరిపురం): వనం-మనం కార్యక్రమాన్ని వినియోగించుకో వాలని ఎంపీపీ దాసరి జయలక్ష్మి పిలుపునిచ్చారు. మందస మండలంలోని సరియాపల్లి పంచాయతీ పరిధిలోగల పల్లిబాహాడపల్లిలో వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం లలిత, ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో శ్రీనివాసరావు, సర్పంచ్ నేరియా జ్యోతి, హరిబందు, ఎంపీటీసీ ఈశ్వరి, వెంకటరమణ, వెంకటరావు, దాసరి తాతారావు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎంపీపీ జయలక్ష్మి

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే

హరిపురం: నియోజకవర్గంలో ఏజెన్సీ మైదాన, ఉద్దాన ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే శివాజీ చెప్పారు. మందస మండలంలోని హరిపురం-మందస రోడ్డు నుంచి బీఎస్‌పురం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపనచేశారు.రూ.50లక్షలతో సుమారు 2.6 కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు దాసరి తాతారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో శివాజీ మాట్లాడుతూ టీడీపీప్రభుత్వం ప్రతి పని అంతర్జాతీయ ప్రమాణాలతో చేపట్టనుందని చెప్పారు.కార్యక్రమంలో ఎంపీపీ దాసరి జయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు సవరకు మారి, టీడీపీ నాయకులు రట్టి లింగరాజు, డొంకూరు తిరుపతిరావు, జుత్తు చిరంజీవులు, సార దూర్వాసులు, బేపల నరేష్, భావన దుర్యోధన, మహంతి, భీమారావు పాల్గొన్నారు.



బీఎస్‌పురం రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శివాజీ

ఎమ్మార్సీకి చేరిన స్టీల్‌ప్లేట్లు

మందస: మండలంలోని జడ్పీ, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి 7,077 స్టీల్‌ప్లేట్లు ఎమ్మార్సీకి చేరాయని ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు పంపిణీ చేస్తామని చెప్పారు.



ఎమ్మార్సీలో స్టీల్‌ప్లేట్లు

అద్దె భవనాలు...ఇరుకు గదులు

- 355 కేంద్రాలకు గాను 87 కేంద్రాలకే సొంత భవనాలు
- ఇదీ నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల దుస్థితి

వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు కరువయ్యాయి. అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో నిర్వహించాల్సి వస్తోంది. మొత్తం 355 కేంద్రాలకుగాను 87 కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. మిగిలిన కేంద్రాలు అద్దె భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాలు, ఇరుకైన గదుల్లో నిర్వహిస్తున్నారు. కొన్ని కేంద్రాలకు పక్కా భవనాలకోసం నిధులు మంజూరైనా స్థల, స్థానిక రాజకీయ సమస్య వల్ల భవనాల నిర్మాణం ముందుకుసాగడం లేదు. దీంతో ఇరుకైన అద్దెభవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తుండడంతో, పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. కొన్నిచోట్ల అనుకూలమైన భవనాలు లభించక సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు నర్సరీ పాఠశాలలుగా మారుస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో పక్కా భవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వజ్రపుకొత్తూరు మండలానికి సంబంధించి 84 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 19 కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. 20 కేంద్రాలు అద్దె భవనాలు, 45 కేంద్రాలు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నారు. పలాస మండలానికి సంబంధించి 102 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా,ఇందులో 24 కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. 55 కేంద్రాలు అద్దె భవనాలు, 23 కేంద్రాలు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నారు. మందస మండలానికి సంబంధించి 169 కేంద్రాలకు గాను 44 కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. 102 కేంద్రాలు అద్దె భవనాలు, మిగిలిన 22 కేంద్రాలు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగిస్తున్నారు.



చినవంకలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల సమస్యపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.నిధులు మంజూరైన వెంటనే భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. కొన్ని చోట్ల మంజూరైన నిధులు స్థల సమస్య ఉండడంతో భవనాల నిర్మాణం ఆలస్యం జరుగుతోంది.

-వి.తిరుమలరావు, ఎంపీడీవో, వజ్రపుకొత్తూరు

నిధులు కేటాయించాలి



అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కాకుండా అన్ని సదుపాయాలున్న పక్కా భవనాల్లో కొనసాగితే మరింత విద్యాభివృద్ధికి తోడ్పడుతుంది. ఆ దిశగా నిధుల కేటాయింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలి. అద్దె భవనాలతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సొంత భవనాలు సమకూర్చాలి.

-బి.జయకృష్ణ, గుల్లలపాడు

అధికారులు దృష్టిసారించాలి



అంగన్‌వాడీ కేంద్రాలను నర్సరీపాఠశాలలుగా మారుస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో కేంద్రాల నిర్వహణపై అధికారులు దృష్టిసారించాలి. సౌకర్యవంతమైన భవనాలు ఉన్నప్పుడే విద్యాభివృద్ధికి తోడ్పడుతుంది. అద్దె భవనాలతో కేంద్రాల నిర్వహణ సమస్యగా ఉంది.

-కోనేరు ఆదినారాయణ, రచయిత, తర్లాగడూరు


ప్రహరీలు లేక.. ప్రమాదం ..!

- కిచెన్ గార్డెన్ల పెంపకానికి అష్టకష్టాలు
- అసాంఘిక కార్యకలాపాలకు వేదికలుగా మారుతున్న వైనం
- ఇదీ పలాస నియోజకవర్గంలో పాఠశాలల దుస్థితి

హరిపురం: ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో ప్రమాదం పొంచిఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పాఠశాలల ఆవరణలో కిచెన్ గార్డెన్ల పెంపకానికి అష్టకష్టాలు పడుతున్నారు. మొక్కల పెంపకానికి విత్తనాలు పంపిణీ చేయడంతో నాటిన ఉపాధ్యాయులు సంరక్షించేందుకు ఇబ్బందిపడుతున్నారు. దీంతోపాటు పశువులు, విషజంతువులు సంచరిస్తున్నాయి. పాఠశాలల భూమి సైతంఆన్యాక్రాంతంకావడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతున్నాయి.

పలాస నియోజకవర్గం పరిధిలో 296 ప్రాథమిక, ఉన్నత,ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. కాగా వజ్రపుకొత్తూరులో 102, మందసలో 120, పలాసలో 92 వివిధ రకాల పాఠశాలలు ఉన్నాయి.పలాసలోఎనిమిది, వజ్రపుకొత్తూరు 14, మందసలో 12 ఉన్నతపాఠశాలలుండగా,మందస, రంగోయి వంటి ఆరు పాఠశాలలకు మాత్రమే పూర్తిస్థాయిలో ప్రహరీలు ఉన్నాయి. ఏ ఒక్క ప్రాథమిక పాఠశాలల ప్రహరీ నిర్మాణానికి నోచుకోలేదు. మఖరజోల, అంబుగాంబొడ్లూరు, రట్టి, బేతాళపురం, అక్కుపల్లి, రెంటికోట,బ్రాహ్మణతర్లా తదితర పాఠశాలల్లో ప్రహరీల ఉండడంతో తాత్కాలిక ఉపశమనం పొందుతున్నారు. కాగా ప్రభుత్వం ప్రహరీలు లేనిచోట కొత్తగా బయోఫెన్సింగ్ ఏర్పాటు ప్రతిపాదించినా కార్యరూపం దాల్చడంలేదు.





బిత్తరబందలో చుట్టూ అల్లుకున్న పొదలు, దున్నూరులో ప్రహరీలేక చీరలు కట్టిన దృశ్యం

పాముల సంచారం...



ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు ఇబ్బందిపడుతున్నారు. పాములు, కుక్కలు సంచారంతో ఎటువంటి ప్రమాదం సంభవించినా ఉపాధ్యాయులకే ముప్పు. దీంతో కనీసం పెద్ద జంతువులు రాకుండా కాపాడాల్సిన బాధ్యత ఉంది.

-రాజాన మహేష్, మందస

మొక్కల రక్షణ....



ప్రభుత్వం విత్తనాలు పంపిణీ చేయడంతో నాటించారు. కానీ ఇవి మొలకెత్తి పెద్దవి అవుతుంటే రక్షణ ఇబ్బందిగా మారింది. మొక్కలు పెరిగి ఫలసాయాన్ని ఇస్తుండడంతో ప్రహరీ అవసరం. దీంతోపాటు కొన్నిప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి.

-టి.హేమరాజు, హెచ్ఎం, జీఆర్‌పురంహైస్కూల్


బయోఫెన్సింగ్ ఏర్పాటు ...



ప్రభుత్వ పాఠశాలలకు బయోఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఉత్తర్వులిచ్చాం. చాలా పాఠశాలలు ప్రహరీలకు బదులుగా పెండిచెట్లు నాటి వెదురు కంపతో పటిష్టం చేస్తున్నాం. ఇంకా చేయాల్సిన వాటిపై దృష్టి పెట్టి శతశాతం పాఠశాలలకు కనీసం ఫెన్సింగ్ ఉండేలా చర్యలు చేపడతాం.

-శ్రీనివాసరావు, ఎంఈవో, మందస

ఆటలు ఆడే సమయంలో..



గ్రామ శివారులు, మారుమూల ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు ప్రహరీలు తప్పనిసరి. ఆటలుఆడే సమయంలో వివిధ రకాల జంతువులు సంచరిస్తుంటాయి. వీటితో విద్యార్థులు, చిన్నారులకు ఎటువంటి ముప్పులేకుండా ఉపయోగకరంగా ఉంటుంది.

-మురళీకృష్ణ చౌదరి, ఎంపీటీసీ, అంబుగాం



సీమంతం నిర్వహిస్తున్న పీవో

తల్లిపాలు బిడ్డలకు ఆరోగ్యకరం

మందస: జన్మించిన వెంటనే ముర్రిపాలు ఇవ్వడం వల్ల పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని రంగలక్ష్మి తెలిపారు. మందస మండల పరిషత్ కార్యాలయంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పసుపు,కుంకుమ అందజేశారు. సమావేశంలో సూపర్‌వైజర్లు యు.లత, నీలవేణి, శారదాబాయి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

14,15 తేదీల్లో ఆహ్వానిత షటిల్ టోర్నమెంట్

పలాస: పలాస రైల్వేఇనిస్టిట్యూట్‌లో వైట్‌గోల్డ్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్వితీయశ్రేణి డివిజన్‌స్థాయి ఆహ్వానిత షటిల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 14,15వతేదీల్లో నిర్వహించనున్నట్లు సంఘ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 9492265268, 9440106490, 7386086094 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

జంట పట్టణాల్లో కుండపోత వర్షం

పలాస:జంటపట్టణాల్లో శనివారంరాత్రి కుండపోత వర్షం కురవడంతో నీరు రోడ్డుపైకి చేరింది. సాయంత్రం 6.30 నుంచి ఎనిమిది గంటల వరకూ కురిసిన వర్షానికి కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్ వద్ద అడుగులోతులో నీరుచేరింది.ఆర్టీసీకాంప్లెక్స్, పోస్టాఫీసు రోడ్డు, కీర్తన ఇన్‌ప్రాంతాల్లో వర్షం నీరు రోడ్డుపై చేరడంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు.



కాశీబుగ్గలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

సందడిగా రాఖీపండగ

గాంధీనగర్(పలాస): స్థానిక టైమ్‌కిడ్స్ ప్రీస్కూల్,ఎస్ఆర్‌టైమ్‌స్కూల్‌లో శనివారం విద్యార్థులు రాఖీపండగ సందడిగా నిర్వహించారు.విద్యార్థులకు రాఖీలు కట్టి వాటి విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. పర్పుల్,పింక్ డే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుబ్బిరెడ్డి, డైరక్టర్ రఘురెడ్డి పాల్గొన్నారు.



తయారుచేసిన రాఖీలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పలాస రైల్వేస్టేషన్‌లో నాకాబందీ

పలాస:పలాస రైల్వేస్టేషన్‌లో రైల్వేఎస్ఐ కె.రవికుమార్, ఆర్పీఎఫ్ ఓసీ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం నాకాబందీ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీసుల తనిఖీల వల్ల ప్రయాణికులు అప్రమత్తంగా ఉంటారని, ఈ రైల్వే మార్గం గుండా అక్రమ రవాణా అరికట్టడానికి వీలుంటుందని చెప్పారు. తొలుత ప్లాట్‌ఫారంపై ప్రయాణికుల బ్యాగులు , అనంతరం రైలులో సోదాలు జరిపారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ పీసీ దాస్, హెచ్‌సీ సీఎస్.బెహరా, నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడు గెలుపుపై హర్షం



ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేస్తున్న పోలీసులు

పలాస:ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ నాయకుడు వెంకయ్యనాయుడు గెలుపొందడంపై ఆ పార్టీ పలాస నియోజకవర్గ నాయకులు పి.వైకుంఠరావు, కొర్రాయి బాలకృష్ణయాదవ్, సీరపు జోగారావు, మీల జోగారావు ఆత్రేయప్రసాద్, బూర్జిపేట హరికృష్ణ హర్షం వ్యక్తంచేశారు. ప్రజాపాలనలో ఒక మంచి వ్యక్తి ఉపరాష్ట్రపతిగా ఎంపిక కావడం దేశానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

ఉన్నత లక్ష్యంతో విద్యనభ్యసించాలి

పలాస: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యనభ్యసించాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజ్ఞ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ విద్యార్థులు ఫ్రెషర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగావిద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో వ్యవస్థాపకులు వీఎంరావు, శాస్త్రి, డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు మనోజ్‌కుమార్‌పాత్రో, ఈశ్వరరావు పాల్గొన్నారు.

రిమ్స్‌కు వెళ్లండి...

ప్రసవానికి వచ్చిన మహిళను పంపించిన వైద్యులు

పలాస: వజ్రపుకొత్తూరు మండలంలోని కంబాలరాయుడుపేటకు చెందిన డి.తులసి ప్రసవం కోసం పలాస ప్రభుత్వాసుపత్రికి శనివారం రాత్రి వెళ్లగా, పరిస్థితి విషమంగా ఉందని శ్రీకాకుళం రిమ్స్‌కు వెళ్లాలని సూచించారు. అయితే 108లో శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవం జరిగింది. గతంలో ఇటువంటి సంఘటనలు అనేకం జరిగినా పలాస ఆస్పత్రి వైద్యుల్లోమార్పు రాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం చేసుకుంటే ప్రోత్సాహకాలు అందిస్తామని ఓ వైపు ప్రకటిస్తుంటే వైద్యులు మాత్రం ఇక్కడ ప్రసవాలు వద్దని నిర్లక్ష్యంగా సాగనంపుతున్నారని పలువురు వాపోతున్నారు.

సుఖ ప్రసవం ..

రెండో కాన్పు కోసం తులసి 108లో ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. కాన్పు ఇక్కడ కావడం కష్టమని, సిబ్బంది కూడా అందుబాటులో లేరని చెప్పడంతో పాటు శ్రీకాకుళం తరలించాలని సూచించారు. 108వాహనంలోనే తరలిస్తుండగా నరసన్నపేట దాటిన తరువాత అందులోనే తులసి సుఖ ప్రసవం జరిగింది.

అభివృద్ధిపై విమర్శలు అర్థరహితం

పలాస ఎమ్మెల్యే గౌతు శివాజీ

సాయికాలనీ(పలాస):కొంతమంది ప్రతిపక్ష నాయకులు తాము మూడేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై విమర్శలు గుప్పించడం అర్థరహితమని పలాస ఎమ్మెల్యే గౌతుశివాజీ తెలిపారు. శనివారం పలాస మున్సిపాల్టీలోని సాయికాలనీ శ్రీశక్తి భవన్‌లో పలాస మండలం,పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో ఇటీవల మరణించిన కుటుంబాలకు చంద్రన్నబీమా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలవారీగా తాము చేసిన అభివృద్ధి ఏమిటో కరపత్రాలు ముద్రించి చూపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ సూర్యనారాయణ, టీడీపీ పట్టణాధ్యక్షుడు లొడగల కామేశ్వరరావుయాదవ్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు రవిశంకర్‌గుప్తా, దుర్గా ప్రసాద్ పాత్రో, చంద్రశేఖరత్యాడి, కొవ్వూరు సురేష్‌కుమార్, సైల చక్రధర్, జీకే నాయుడు పాల్గొన్నారు.

జగన్‌పై చర్య తీసుకోండి

పలాస: నంద్యాల బహిరంగ సభలో ప్రతిపక్ష నేత జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలుక్షమించరానివని, నేరపూరిత వ్యాఖ్యలు మానుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శివాజీ హితవు పలికారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏనాడూ ఇటువంటి ప్రతిపక్ష నేతను తాను చూడలేదన్నారు. అడ్డుఅదుపు లేని బహిరంగ ప్రకటనలను తన అనుచరులు సైతం సమర్థించడం దారుణమన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి అమానుషమైన పదజాలాన్ని వినియోగిస్తున్న జగన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ఆయనకు వ్యతిరేకంగా పోటీ చేస్తున్న అభ్యర్థులను బెదిరించే పద్ధతిలో ఓటర్లను భయభ్రాంతులను చేస్తుండడంతో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



శివాజీకి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ

వైసీపీతోనే సమస్యలు పరిష్కారం

సమన్వయకర్త సీదిరి అప్పలరాజు

చిన్నకొష్ట(హరిపురం): గ్రామాల్లో సమస్యలు వైసీపీతోనే పరిష్కారం అవుతాయని ఆ పార్టీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త సీదిరి అప్పలరాజు తెలిపారు. మందస మండలంలోని తాళ్లగురండి పంచాయతీ పరిధిలో గల చిన్నకొష్టలో శనివారం పర్యటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి షన్ముఖరావు, అశోక్‌పాణిగ్రాహి, సంతోష్, ఉపేంద్ర, రాపాక శేషగిరి, మట్ట ఆనంద్, దుర్యోధన, ఉదయశంకర్‌పట్నాయక్ పాల్గొన్నారు.

బూత్‌కమిటీ ఏర్పాటు

వజ్రపుకొత్తూరు:గుణుపల్లి పంచాయతీలో రెండు బూత్‌కమిటీలు ఏర్పాటుచేసినట్లు వైసీపీ మండలాధ్యక్షుడు మరడ భాస్కరరెడ్డి, కేంద్ర బ్యాంకు డైరెక్టర్ దువ్వాడ మధుకేశ్వరరావు తెలిపారు. శనివారం గుణుపల్లి పంచాయతీలో వైసీపీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో రెండు బూత్ కమిటీలకుగాను నిరంజన్, రాజారావు లను కమిటీ అధ్యక్షులుగా ఎంపికచేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కొర్రాయి గిరి, కిడిసింగి ఎంపీటీసీ మాజీసభ్యులు నర్తు ప్రేమ్‌కుమార్, మంచినీళ్లపేట మాజీ సర్పంచ్ వంకరాజు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

50 మంది వైసీపీలో చేరిక

పెదపల్లివూరు(పూండి): వజ్రపుకొత్తూరు మండలంలోని పెద్దపల్లివూరులో శనివారం వైసీపీ పోలింగ్ బూత్,గ్రామకమిటీలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో హుకుంపేటకి చెందిన టీడీపీ కార్యకర్తలు కొమర పెద్దయ్య,లండ గోపాల్,కొమర సింహాద్రితో పాటు మరో 50మంది వైసీపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పాలిన శ్రీనివాసరావు,పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు,వైసీపీ మండలాధ్యక్షుడు మరడభాస్కరరావు, నాయకులు మద్దిల హరినారాయణ, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కొర్రాయి గిరిబాబు, సీదిరి చిరంజీవి,దున్న ధర్మారావు, వంకరాజు, నర్తు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీదిరి అప్పలరాజు

300 కిలోల జీడిపప్పు చోరీ

పలాస:కాశీబుగ్గ సాయికాలనీలో జీడివ్యాపారం నిర్వహిస్తున్న ఓ ఇంట్లో 300 కిలోల జీడిపప్పు శుక్రవారం రాత్రి చోరీకి గురైందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. భాగస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తున్న జీడిపప్పు పరిశ్రమలో చోరీ జరగడం సం చలనం కలిగించింది. వీటివిలువ రెండు లక్షల వరకూ ఉంటుంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వజ్రపుకొత్తూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీపీ గొరకల వసంతరావు తెలిపారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా శనివారం వజ్రపుకొత్తూరు, కిడిసింగి పంచాయతీల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంపీటీసీ సభ్యుడు ఇరోతు హేమంతరాజు, ఏపీవో బి.ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు గోవిందుపాపారావు, కిడిసింగి సర్పంచ్ నర్తు లక్ష్మీనారాయణ, డోకులపాడు మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, పోతనపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరులో మొక్క నాటుతున్న ఎంపీపీ వసంతరావు

రిజర్వాయర్ పనులకు ఆటంకం కలిగించవద్దు

●ఎస్పీ త్రివిక్రమవర్మ

హిరమండలం:'రిజర్వాయర్ పనులకు ఆటంకం కలిగించవద్దు. ఏదైనా సమస్యలు ఉంటే అధికారులతో చర్చించి సామరస్యంగా పరిష్కరించుకోవాలి.. అలా కాదంటే కఠిన చర్యలు తీసుకుంటాం' అని ఎస్పీ త్రివిక్రమవర్మ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేష న్‌లో వంశధార నిర్వాసిత గ్రామాలకు చెందిన కొంత మంది ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ పనులు అడ్డుకోవద్దని సమస్యలు ఉంటే తమకు తెలియ జేయా లని వాటిని ప్రభుత్వం, కలెక్టర్ దృష్టికి తీ సుకువెళ్లి పరి ష్కారం అయ్యేలా చూస్తామన్నారు. పనులు అడ్డుకో వడానికి సిద్ధపడితే కఠిన చర్యలు తీసు కుంటామని తెలిపారు.నిర్వాసిత గ్రామాలు ఖాళీ చేయించమని ప్రభు త్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉ న్నాయని తెలిపారు. నిర్వాసితులు మాట్లాడుతూ ముందస్తు సమాచారం లేకుండా సమస్యలు పూర్తిస్థాయిలో పరి ష్కరించకుండా గ్రామాలు ఖాళీ చేయాలని పేర్కొ నడం సరికాదని తెలిపారు.చాలా కుటుంబాలకు పునరా వాసం కల్పించాల్సి ఉందని చెప్పారు.కొన్ని కుటుంబా లకు పునరావాసం కింద నష్టపరిహారం చెల్లించి నెలరోజులు కూడా కాలేదని, ఇంతలో స్థలం కొనుగోలు చేసి ఇళ్లు ఎలా కడతారని ఎస్పీ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో రెండు వర్గాలుగా ఉన్నారని వారందరితో కూడా చర్చించి అభిప్రాయం చెబుతామని నిర్వాసితులు చెప్పారు.ఎస్పీ స్పందిస్తూ ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు చొప్పున సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు శ్రీకాకుళంలో తన కార్యాలయంలో సమావేశానికి రావాలని చెప్పారు.అక్కడ సమస్యలపై చర్చించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు.

సినిమాలు

పలాస- కాశీబుగ్గ

హరిశంకర్--ఫిదా

రవిశంకర్-నక్షత్రం

భాస్కరరామా-నిన్నుకోరి

శ్రీవెంకటేశ్వర-దర్శకుడు

అన్నపూర్ణ-గౌతమ్‌నంద

మందస

మహేంద్ర...నక్షత్రం

సీఎంకు క్షమాపణ చెప్పండి

వైఎస్ జగన్ దిష్టిబొమ్మ దహనం

పాలకొండటౌన్: సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైఎస్ ప్రతిపక్ష నేత జగన్ క్షమాపణ చెప్పాలని పాలకొండ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ డిమాండ్ చేశారు. పాలకొండ శ్రీకోటదుర్గమ్మ ఆలయ జంక్షన్ వద్ద శనివారం జగన్ వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. తక్షణమే జగన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్‌చేశారు. ఈసందర్భంగా రాస్తారోకో నిర్వహించి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలుచేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో జగన్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చింత సంగంనాయుడు, టీడీపీ పట్టణాధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, టీడీపీ నాయకులు పల్లా కొండలరావు, దుప్పాడ పాపినాయుడు, కర్నేన అప్పలనాయుడు, వారాడ సుమంత్‌నాయుడు, వావిలపల్లి రాజారావు, సుంకరి అనీల్‌దత్, ఆనాపు జవరాజు, ముడిల సూర్యారావు, కిమిడి కాశీం నాయుడు, దుప్పాడ వాసు. వావిలపల్లి రమణారావు, అంపోలు శ్రీనివాసరావు, ఎన్ని ప్రసాద్, వెన్నపు శ్రీనివాసరావు, నల్లబారిక గాంధీ, అల్లు బుల్లి పాల్గొన్నారు.



వైఎస్ జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

గజరాజుల బీభత్సం

- చెరుకు, వరిపంట ధ్వంసం
- ఆందోళన చెందుతున్న గిరిపుత్రులు



కుంబిగాం వద్ద చెరకు పంట ధ్వంసంచేసిన ఏనుగులు

హరిపురం:మందసమండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోగల మహదేవిపురం, కుంబిగాం, హంసరాళి తదితర గ్రామాల్లో గజరాజులు శుక్రవారం రాత్రి బీభత్సం సృష్టించాయి. హంసరాళిసమీపంలోని రాజాన ఝాన్సీకి చెందిన సుమారు పదిఎకరాల చెరుకు తోట ధ్వంసం చేశాయి. ఏజెన్సీలోని చినరంగుమటియా, కుంబిగాం, బాతుపురంతోపాటు చత్రపురం, మహదేవిపురం తదితరగ్రామాల్లో వరినారు, పలు పంటలు ధ్వంసంచేసి కొండల్లోకి వెళ్లిపోతున్నాయి. ప్రస్తుతం సునాముది కాలువ పరివాహక ప్రాంతంలో సంచరిస్తు ఒడడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తుంబా అటవీ నుంచి....

మేనెలలో ఒడిశాలోని తుంబా అటవీ ప్రాంతం నుంచి ఏడు ఏనుగులగుంపు అంబటికంబారం, చిన్నకోష్ఠ, గౌడుగురండిలో సంచరించి చీపి, బొగాబంద నుంచి మళ్లీ ఒడిశాలోకి వెళ్లాయి. ఏడుఏనుగులు ఒడిశా-ఆంధ్రా సరిహద్దులో గల మహేంద్రగిరుల్లో తిష్ఠవేసి చీకటిపడిన తర్వాత ఆహారంకోసం మైదాన ప్రాంతాలకు వస్తున్నాయి. వారంరోజులుగా పలాస, మెళియాపుట్టి మండలాల్లో పంటలను ధ్వంసం చేయగా, మందస మండలంలో పంటలు పాడుచేస్తుండడంతో రక్షణ ల్పించాలని అటవీ శాఖ అధికారులను పలువురు కోరుతున్నారు.

డీఈవో వెబ్‌సైట్‌లో హెచ్‌ఎంల సీనియార్టీ జాబితా

శ్రీకాకుళం సిటీ: ప్రభుత్వ, జడ్పీ యాజమాన్యంలోని హెచ్‌ఎంల పదోన్నతి కోసం అర్హత గల స్కూల్ అసిస్టెంట్లు, సమాన కేటగిరీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను కాకినాడ ఆర్జేడీ ఉత్తర్వుల మేరకు శ్రీకాకుళం డీఈవో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈవో ఆబోతుల ప్రభాకరరావు శనివారం తెలిపారు. ఈ సీనియార్టీ జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా సోమవారం సాయంత్రం ఐదు గంటల్లోగా డీఈవో కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు.

హిరమండలంలో 144 సెక్షన్

హిరమండలం:వంశధార నిర్వాసిత గ్రామాల్లో పరిణామాలను దృష్టిలో ఉంచుకొని హిరమండలం, కొత్తూరు మండలాల్లో 144 సెక్షన్ 30 యాక్టు అమల్లో ఉందని పాలకొండ ఇన్‌చార్జి డీఎస్పీ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వంశధార నిర్వాసిత గ్రామాల్లో జరుగుతున్న ఆందోళన కార్యక్రమాలపై పాతపట్నం,కొత్తూరు సీఐలు ప్రకాశ్, శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటేశ్వరరావులో సమీక్షించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 144 సెక్షన్ అమలులో ఉండడంతో హిరమండలం, కొత్తూరు మండలాల్లో ర్యాలీలు,ఆందోళన లు నిర్వహించకూడదని తెలిపారు. నిర్వాసితులు తమ సమస్యలను అధికారులతో చర్చించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని చెప్పారు.నిర్వాసితులతో ఒకటి రెండురోజుల్లో సమీక్షించనున్నామని,అందుకు నిర్వాసిత గ్రామాలకు చెందిన ప్రతినిధులు ముందుకురావాలని తెలిపారు. వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని చెప్పారు.

ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల:జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన ఉన్న సీట్ల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్‌కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏ ప్రభుత్వ,ప్రైవేటు ఐటీఐల్లో సీటు కోరుకుంటున్నారో ఆయా ఐటీఐల్లోనే దరఖాస్తులు చేయాలని పేర్కొన్నారు. ఈనెల 15వతేదీ వరకు దరఖాస్తులు విక్రయం, స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఐటీఐల్లో సీట్ల భర్తీకి ఈనెల 17న, ప్రైవేటు ఐటీఐల్లో సీట్ల భర్తీ ఈనెల 18న అదే ఐటీఐల్లో కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ప్రత్యేకించి మెసేజ్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. ఏ ఐటీఐ లో దరఖాస్తు చేశారో అదే ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్ ఆయా తేదీల్లో హాజరుకావాలని కోరారు.

వారానికో పంచాయతీలో పారిశుధ్య పనులు

- జిల్లాస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పర్యవేక్షణ

టెక్కలి: పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. పంచాయతీ స్థాయిలో పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించింది. కాలువల్లో పూడికలు తీయకముందు,తీసిన తర్వాత జియోట్యాగింగ్ చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసిన పంచాయతీరాజ్ రూరల్ డవలప్‌మెంట్ యంత్రాంగం తాజాగా శనివారం మరోసారి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించింది. జిల్లాలో 1,100 పంచాయతీలు ఉండగా, వారానికి ఓ పంచాయతీని జిల్లాస్థాయి నుంచి మండలస్థాయి వరకు నిర్దేశించిన అధికారుల బృందం గుర్తించి పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకు జడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీఅధికారి, డివిజన్‌ల్ లెవల్ పంచాయతీ అధికారి, మండలపరిషత్ అభివృద్ధి అధికారి, ఈవోపీఆర్‌డీ స్థాయి అధికారి నిర్దేశించిన పంచాయతీకి చేరుకొని కాలువల్లో పూడికలు తొలగించిన తర్వాత జియోట్యాగింగ్ చేపట్టాలి. అధికారులు పర్యవేక్షణలో కాలువల్లో పూడికలు తీత పూర్తయిన తర్వాత పూర్తిసమాచారం అమరావతి స్థాయిలో ఉన్నతాధికారులకు తెలియజేయాలి. తరువాత అక్కడ నుంచి ఐవీఆర్‌ఎస్ విధానం ద్వారా నేరుగా ఏ పంచాయతీ పరిధి కాలువల్లో పూడికలు తొలగించారా లేదా, అక్కడ పనులు పూర్తిస్థాయిలో జరిగాయా, లేదా అని ఫోన్ ద్వారా ప్రజల నుంచి సమాచారం సేకరిస్తారు.

ఒడిశా



డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

డెంగ్యూపై అవగాహన

పర్లాకిమిడి:గుసాని సమితిలోని కెరండి యూపీ పాఠశాలలో హెచ్‌ఎం ఢిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో, అమర యూపీ స్కూల్‌లో హెచ్‌ఎం జయలలిత, దవిడిగాం యూపీ స్కూల్‌లో హెచ్‌ఎం సంధ్య ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం డెంగ్యూ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సీతాపురం యూపీ స్కూల్‌లో హెచ్‌ఎం ప్రశాంత్ పండా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు చైతన్యపరిచారు. డెంగ్యూ, మలేరియా వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

పరిసరాలుశుభ్రంగా ఉంచుకుంటే మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలవని పీఆర్‌సీసీ వెంకటరమణ తెలిపారు. కెరండి పంచాయతీ కార్యాలయంలో డెంగ్యూ, మలేరియా వ్యాధిపై అవగాహన సదస్సు జరిగింది.అనంతరం విద్యార్థులకు డెంగ్యూ,మలేరియాపై వ్యాసరచన, డిబెట్ నిర్వహించి బహుమతులు అందజేశారు.

ద్రోణి ప్రభావంతో వర్షాలు

పర్లాకిమిడి:ఉత్తరకోస్తా జిల్లాలో బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో రానున్న 24గంటల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారి శరత్‌చంద్ర చెప్పారు. బాలేశ్వర్, నయాగఢ్, కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, అనుగూల్, ఖుర్దా జిల్లాల్లో నింబస్ మేఘాలు ఏర్పడనుండడంతో పిడుగులు పడే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఘనంగా రాఖీ పండుగ

పర్లాకిమిడి:పర్లాకిమిడిలో ఓంశాంతి భక్తులు శనివారం రాఖీపండగను ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల కార్యాలయాలకు వెళ్లి రాఖీలను కట్టి ఆత్మీయతను చాటారు.

రోడ్డు పనులు ప్రారంభం



జయమహల్ జంక్షన్‌లో రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి:పర్లాకిమిడిలోని జయమహల్ జంక్షన్ వద్ద రోడ్డు వెడల్పు చేసే కార్యక్రమంలో భాగంగా ఇటీవల రూ.20లక్షలతో కల్వర్టు నిర్మించారు. దీనికి అనుబంధంగా రోడ్డు వెడల్పు చేసే పనులను మున్సిపల్ అధికారులు శని వారం ప్రారంభించారు.ఎనిమిదిమీటర్ల వెడల్పుతో నిర్మించే ఈ రోడ్డు పనులు పూర్తయితే వాహనాల రాకపోకలకు సుగుమమవుతుందని పలువురు చెబుతున్నారు.

నవగ్రహ ఆలయంలో పూజలు

పర్లాకిమిడి:పర్లాకిమిడి పొడుగు ఆలయంలో గల నవగ్రహ ఆలయంలో శనిత్రయోదశి పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాకుళంలో జిల్లాలోని పాతపట్నం, కొత్తూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు.




నవగ్రహ ఆలయంలో పూజలుచేస్తున్న భక్తులు

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి ఆదివారం క్లాసిఫైడ్స్

Available Categories List
AUTOMOTIVE | HOME NEEDS | BUSINESS SERVICES | PROFESSIONAL SERVICES | BUILDING & CONSSTRUCTION | PEOPLE CARE | BEUTY & PERSONAL CARE | REAL ESTATE | COMPUTERS | TO-LET | CELL POINTS | TOURS &TRAVELS | EDUCATION | JOBS | HEALTH CARE | COLOUR CLASSIFIEDS & MORE

AGRICULTURE



శ్రీరామకృష్ణ ఇంజనీరింగ్, చౌక్‌బజార్, శ్రీకాకుళం. మావద్ద టెక్స్‌మో,ఆక్వాటెక్స్ పంపుసెట్‌లు రక్షా CPUC,UPVC పైపులు,ఆక్వాటెక్ వాటర్ ట్యాంకులు లభించును మీ పేర్ల సూర్యనారాయణ (రవి), 9246631400.
AJS-345123

రైతుమిత్ర, ప్రో॥ దోని కొండలరావు(బుజ్జి), బన్నువాడ వెల్లేదారి టెక్కలి, మావద్ద ఎరువులు,పురుగు మందులు,విత్తనములు, స్ప్రేయర్స్, చెదల మందులు హోల్‌సేల్‌గా అమ్మబడును. సెల్:9440564232
AJS-

BUILDING MATERIALS



వెంకటపద్మ ఎంటర్‌ప్రైజెస్, చౌక్‌బజార్, శ్రీకాకుళం. మా వద్ద సిమెంట్, ఐరన్, బిర్లా వైట్, సిమెంట్ రేకులు హోల్‌సేల్ ధరలకే లభించును. 9440195080.
AJS-345124

మహేంద్ర స్టీల్ ఇండస్ట్రీస్, అన్ని రకముల S.S.పైపులు, TATA Steel Pipes తదితర సామాగ్రి సరసమైన ధరకే లభించును. రుప్ప చిన్న, సెల్: 9440001941, 9392119000.
AJS-345077

MARBLE & TILES

శ్రీ వినాయక టైల్‌మార్ట్, మావద్ద అన్ని కంపెనీల టైల్స్, మరియు శానిటరీ ఐటెమ్స్ అతి తక్కువ ధరలకే లభించును. ఫరీద్‌పేట గ్రామం, కొయిరాల జంక్షన్, దుర్గగుడి ప్రక్కన, ఎన్.హెచ్-5 రోడ్, శ్రీకాకుళం. ఫోన్: 9177705282, 9704715798.
AJS-305816

BUSINESS SERVICESS



పాన్‌కార్డ్ @ 120/- బ్యాంకు లావాదేవీలు, భూమి మరియు వాహనాల రిజిస్ట్రేషన్, ఉద్యోగ నిమిత్తం, ఆదాయ పన్ను చెల్లింపులు తదితర లావాదేవీలు కొరకు సంప్రదించండి... ప్రవీణ్ అసోసియేట్స్, కె.టి.రోడ్, పలాస. సెల్: 9989951999, 7842938938.
AJS-360611

శ్రీ సూర్య మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటి లిమిటెడ్ మా సొసైటి నందు రోజు వారి, నెలవారి,ఫిక్స్‌డ్ డిపోజిట్ మరియు నెలవారి వడ్డీ పొందే పథకాలు కలవు. శ్రీ సూర్య మేక్స్ లిమిటెడ్, నరసన్నపేట (శ్రీదేవి థియేటర్ దరి) సొసైటీనందు షేర్లు తీసుకున్నవారికి లాభాలు పంచడం సదుపాయం మరియు ఋణ సౌకర్యం కలదు.సెల్: 9154322733, 7659054394
AJS-360699

● **మీ ఇంట్లోనే ఉంటూ నెలకు రూ.** 1000/- నుండి 1500/- ఎల్.ఈ.డి, పేపర్ ప్లేట్స్, క్యాండిల్, సాక్స్ మిషన్స్ మొ॥వివరాల కొరకు మీ పేరు అడ్రస్ SMS చేయండి. కల్పన ఎంటర్‌ప్రైజెస్ ఫోన్: 8510998157/315
AJH-11692

CLOTH STORES



అంధవరపు సత్యనారాయణ సన్, నెహ్రూరోడ్, శ్రీకాకుళం. మా వద్ద ఉప్పాడ, కంచి, ఫ్యాన్సీ, చేనేత చీరలు మరియు సూటింగ్ & షర్టింగ్స్ లభించును. సెల్: 9390016937.
AJS-345078



EDUCATION



నవ్యమైన బోధన... నాణ్యమైన విద్య... అమ్మఒడి ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీ సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ, రిజిష్టర్డ్ నెం. 412/2006, రోటరీనగర్, ఆర్.టి.సి.కాంప్లెక్స్ దగ్గర, టెక్కలి.
AJS-305894

రాజాం "విజేత" C/o సత్యడిగ్రీ కాలేజ్,రాజాం DSc-Long టర్మ్ బ్యాచ్ 01-01-2017 ఉ॥ 9గం॥లకు పంచాయితీ సెక్రటరీస్ నూతన బ్యాచ్ 01-01-2017 ఉ॥9గం॥ ప్రా॥ VRO,VRA, పాలిటెక్నిక్, APRJC,కానిస్టేబుల్స్ శిక్షణసంస్థ. సెల్‌నెం.9948869900
AJS-360260

PLAY SCHOOL

మీ చిన్నారుల బంగారు భవిష్యత్తుకై... సంవత్సరం ఎనిమిది నెలల వయస్సు గల పసిపిల్లలకు ఆట పాటలతో లాలించి విద్యాబుద్ధులు నేర్పబడును. మీ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు ఇదొక చక్కటి పునాది... లవ్‌లీ కిడ్స్ ప్రీ స్కూల్, పి.ఎం.ఆర్.కాంప్లెక్స్, కె.టి.రోడ్, కాశీబుగ్గ, సెల్: 7386623343, 8790085670
AJS-360606

HINDI TUTION

హారిక హిందీ విద్యాలయం... హిందీ విద్వాన్, భూషణ్, విశారద పరీక్షల కొరకు సంప్రదించండి. ఎంతోమంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించిన సంస్థ. రోటరీనగర్, కాశీబుగ్గ. సెల్: 9553868818
AJS-360607


COACHING CENTER

జగన్ కోచింగ్ సెంటర్-కాశీబుగ్గ 10వ తరగతి అర్హతతో SSC కానిస్టేబుల్స్,RRB, బ్యాంక్స్ etc ఉద్యోగాల శిక్షణకు క్లాసులు ప్రారంభమైనవి. హాస్టల్ వసతి కలదు. సెల్: 9866596316, 8886098976
AJS-360608

MAGAZINES SHOP

రాజా పాన్‌షాప్, నెహ్రూరోడ్, శ్రీకాకుళం. బ్యాంక్,రైల్వే,SSC మరియు EAMCET,NEET,IIT అన్ని పోటీ పరీక్షలకు మ్యాగ్జైన్స్ అమ్మకమునకు కలదు.సంప్ర॥: 8500324114
AJS-345131

HOTELS



హోటల్ రాయల్‌వింగ్స్ & న్యూ రిలాక్స్ ఇన్, వెజ్ & నాన్‌వెజ్ రెస్టారెంట్. రామలక్ష్మణ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం. మా వద్ద రుచికరమైన వంటలు లభించును. మరియు కేటరింగ్ సదుపాయం కలదు. సెల్: 9440105589
AJS-305817

ఆకాంక్ష హోటల్ & కర్రీపాయింట్, కాస్మోపాలిటన్ క్లబ్ ప్రక్కన, కిన్నెర థియేటర్ రోడ్డు పాత బస్టాండ్, శ్రీకాకుళం. మా వద్ద రుచికరమైన వంటలు లభించును. మరియు కేటరింగ్ సదుపాయం కలదు. సెల్: 9912999556.
AJS-345080

శ్రీ విజయలక్ష్మి ఫ్యామిలీ రెస్టారెంట్.. మా వద్ద రుచి, శుచికరమైన శాఖాహార, మాంసాహార పదార్థములు లభించును. రామతీర్థం రోడ్, రణస్థలం. సెల్: 9963656662.
AJS-305819


HOME NEEDS



PROVISIONS

SVR DEPARTMENTAL STORES మావద్ద మీ గృహ అవసరాలకు మరియు శుభకార్యములకు కావలసిన నాణ్యమైన కిరాణా సరుకులు, జనరల్ స్టోర్స్ సరసమైన ధరలకు లభించును. విశాఖ డైరి ప్రక్కన, బజారువీధి,నరసన్నపేట.
AJS-360413

GREETINGS



గాయత్రి ప్రైవేట్ ఐ.టి.ఐ. అడ్మిషన్లు ప్రారంభమైనవి. సీట్లు పరిమితం.మేనేజ్‌మెంట్ & స్టాఫ్. గాయత్రి ప్రైవేట్ ఐటిఐ, శ్రీకాకుళం. ఫోన్: 9440828366,9440321654
AJS-360412

కె.నారాయణరావు, ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, పూతికవలస, సీతంపేట మండలం. 10వ తరగతి పరీక్షలు ఉత్తీర్ణులైన విద్యార్థినీ,విద్యార్థులకు ఇవియే మా శుభాకాంక్షలు.
AJS-360652

HEALTH



పచ్చకామెర్లకు మందు... దీర్ఘకాలిక ప్రాణాంతకమైన పచ్చకామెర్లు వ్యాధి నివారణకు పసరమందు ఇవ్వబడును. అపర్ణ దంతం నర్సింగ్ హోం, దంతంవీధి, కాశీబుగ్గ, సెల్: 9505141980
AJS-360609

డా॥ కమల్ విలేకర్స్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ ఇచ్చట డాక్టర్ ఎన్.టి.ఆర్.వైద్యసేవ, ఇ.హెచ్.ఎస్., డబ్ల్యు.జె.హెచ్.ఎస్. సేవలు ఉచితంగా అందించబడును. చిన్నబజార్, శ్రీకాకుళం. ఫోన్: 08942-222955.
AJS-305818

సుమిత్రా డాక్టర్స్ ప్లాజా, టెక్కలి,గైనిక్, జనరల్,ఆర్థో,న్యూరో,స్కిన్,ENT డెంటల్ డాక్టర్స్ అందుబాటులో ఉందురు. 08945-245066, సెల్: 8886347965.
AJS-305895

HOMEO

వివేకానంద కంప్యూటరైజ్డ్ హోమియో క్లినిక్. ఆస్థమా, బి.పి., షుగర్, ఆర్థరైటిస్, స్పాండిలైటిస్, స్త్రీల సమస్యలు, సంప్ర॥: డాక్టర్ కె.వివేకానంద, కొన్నావీధి, పి.ఎస్.ఎన్.ఎం. స్కూల్ ఎదురుగా, శ్రీకాకుళం. వి.ఎన్.రాజా కాంప్లెక్స్, ఆమదాలవలస. 9293763613
AJS-345132

JEWELLERY



ఆనందసాయి జ్యూయలర్స్, మావద్ద అన్ని రకముల బంగారు, వెండి ఆభరణములు లభించును. కిల్లాన కాంప్లెక్స్, పెట్రోమాక్స్‌వీధి, శ్రీకాకుళం. ఫోన్: 08942-227345. ప్రొ: కిల్లాన తిరుమలరావు.
AJS-305815

శ్రీ కృష్ణా గోల్డ్ 91.6 కెడిఎం బంగారు ఆభరణములు, వెండి మరియు జాతిరాళ్లు మా ప్రత్యేకత. పెట్రోమ్యాక్స్‌వీధి, శ్రీకాకుళం. మీ... సతీష్, సెల్: 99086 96372.
AJS-345079

REAL ESTATES



సత్యసాయి కనస్ట్రక్షన్స్, న్యూకాలనీ,నియర్ డైమాండ్‌పార్క్ B.M.P.S., మేడపైన SKLM. Satyanarayana.B., B.Tech Civil, B.L., Regd. కాంట్రాక్టర్ & కన్సల్టెంగ్ ఇంజనీర్ Building Plans,Approvals,Estimations 9849017375
AJS-345136

సాయిలోటస్ గార్డెన్స్, శ్రీకాకుళం. మా వద్ద అతి తక్కువ ధరలకే ప్లాట్స్ ఇన్‌స్టాల్‌మెంట్ బేసిస్‌లో లభించును. మరియు ప్రముఖ ప్రాంతాల్లో సరసమైన ధరలకు వాస్తుకు అనుకూలమైన స్థలాలు విక్రయించబడును. 8500487169
AJS-305820

ప్రకృతి ఎవెన్యూస్ వారి పైడిభీమవరం నందు బ్రహ్మపుత్ర మెగా వెంచర్‌లో (ఉడా ఎల్.పి.నెం: 126/2016) ప్లాట్లు తక్షణం రిజిస్ట్రేషన్ కలవు. మరియు ఇన్‌స్టాల్‌మెంట్స్ సౌకర్యం కలదు. కాంటాక్ట్: 7842585555.
AJS-305821

FLAT FOR SALE


శ్రీకాకుళం ఎన్.హెచ్-5 సాయి డెంటల్ కాలేజ్ ప్రక్కన, హైటెక్ ప్యారడైజ్ నందు ఉడా అప్రూవల్‌తో (1బి.ఆర్.- 7,82,000), (2బి.ఆర్. 10,88,000) ప్లాట్ అమ్మకమునకు కలవు. బ్యాంక్ లోన్ కలదు. 9959612342, 9848594947
AJS-345135

VIDEO & PHOTOGRAPHY



ప్రశాంత్ ఫోటో లామినేషన్.. ఫోటో ఫ్రేమింగ్ & లామినేషన్ ఫ్లెక్సీలు, ఫోటో వీడియోస్, శుభలేఖలు, ఫోటో ఆల్బమ్స్, హైపో లభించును. కె.టి.రోడ్, ఆంధ్రాబ్యాంకు జంక్షన్, కాశీబుగ్గ. సెల్: 9951155822, 8341171038
AJS-360610

WEDDING NEEDS



FUNCTION HALL

శ్రీ లక్ష్మీ శ్రీనివాస ఫంక్షన్‌హాల్ మీ వివాహాది శుభకార్యాలకు శ్రీకాకుళంలో అతిపెద్ద అనువైన ఎ/సి ఫంక్షన్‌హాల్. కిమ్స్ ఆసుపత్రి ఎదురుగా, న్యూ బ్రిడ్జి రోడ్, శ్రీకాకుళం. 9440196550.
AJS-345129

WANTED



విదేశాల్లో పని చేయుటకు వెల్డర్స్ & ఫిట్టర్స్ ,రిగ్గర్స్, హెల్పర్స్,మేషన్స్,కార్పెంటర్స్ మరియు హై కేటగిరి పనిచేయుటకు యువకులను లైసెన్సులు ఉన్న ఆఫీసుల ద్వారా పంపించబడును. శ్రీ అయ్యప్ప కన్సల్టెన్సీ, ప్రొ॥ రంగాల పుణ్యవాసులు,ఇచ్ఛాపురం(అరకభద్ర)సెల్:9704958604
AJS-360557

శ్రీ పంచముఖ టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నందు వెల్డింగ్ & ఫిట్టింగ్ నేర్పించి గవర్నమెంట్ వారిచే గుర్తింపు పొందిన మేన్‌పవర్ ఆఫీస్ ద్వారాగా పనిచేయుటకు విదేశాలకు పంపించబడును. కె.బాలరాజు. సెల్: 9848609561,08947-321555. ఇచ్ఛాపురం
AJS-360564

పాఠకులకు సూచన:
క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.
బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.
పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
- మేనేజర్

కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయండి

● శ్రీకాకుళం ఇన్‌చార్జి తుకారాం రంగేపటేల్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకలు

శ్రీకాకుళం సిటీ: రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహారాష్ట్ర మాజీ ఎంపీ, పార్టీ జిల్లా ఇన్‌చార్జి తుకారాం రంగేపటేల్ పిలుపునిచ్చారు. సోమవారం నుంచి నిర్వహించనున్న సంస్థాగత ఎన్నికలు కాంగ్రెస్ బలోపేతానికి పునాది కావాలన్నారు. జిల్లా పర్యటన సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఈ నెల 6 నుంచి మొదటి విడత సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. బూత్ కమిటీల నియామకం నెల 7 నుండి 18 వరకు చేపట్టనున్నట్టు చెప్పారు. అనంతరం సభ్యుల ఎంపికలు కూడా ఉంటాయన్నారు. సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్, డీసీసీ అధ్యక్షుడు డోల జగన్, కాంగ్రెస్ నేతలు చౌదరి సతీష్, పీరుకట్ల విశ్వప్రసాద్, కిల్లి రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

● వైద్య ఆరోగ్య సమీక్షలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు



హాజరైన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు

శ్రీకాకుళం సిటీ: సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కన్సల్టెంట్లు డాక్టర్ శాంత, డాక్టర్ చలమయ్య, డాక్టర్ నరేష్ సూచించారు. జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీజిల్స్, రుబెల్లా టీకా, సీజనల్ వ్యాధులు, హెచ్‌ఎంఐఎస్ పోర్టల్, తదితర కార్యక్రమాలపై వివరించారు. పారామెడికల్ సిబ్బందికి డైలీ రెజిమెన్ కార్యక్రమంపై అవగాహన కల్పించి ఈ నెల 20లోగా వివరాలను జిల్లా క్షయనివారణాధికారి కార్యాలయానికి పంపాలని డీఎంహెచ్‌వో తిరుపతిరావు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణాధికారి ధవళ భాస్కరరావు, అదనపు డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బి. జగన్నాథరావు, ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త ఎం.ప్రవీణ్, పీవోడీడీటీ అధికారి సీహెచ్ కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు రుణాలు నిలుపుదల

● జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీహరిరావు



హిరమండంలం: వంశధార రిజర్వాయర్ ముంపు గ్రామాల్లో నివాసముంటున్న నిర్వాసితులకు పీఏసీఎస్ ద్వారా వ్యయసాయ రుణాలను నిలిపివేస్తున్నట్టు జిల్లా కోఆపరేటివ్ అధికారి బి.శ్రీహరిరావు చెప్పారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. నిర్వాసితులు తమకు కేటాయించిన పునరావాస కాలనీల్లో నివాసం ఉంటున్నట్టు ధ్రువపత్రాలు అందజేస్తేనే రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. అంతవరకు పాత రుణాల రెన్యూవల్, కొత్తరుణాల మంజూరును ఆపేస్తున్నట్టు స్పష్టం చేశారు. అలాగే విత్తనాలు, ఎరువులు కుడా పంపిణీ చేయమన్నారు. ● జిల్లాలో అన్ని సొసైటీల్లో కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు మంజూరు చేస్తామని డీసీవో తెలిపారు. రూ.లక్ష వరకు రుణం అందజేస్తామని, నాబార్డు ఆదేశాల మేరకు ఐదుగురు సంఘంగా ఏర్పాటు కావాలని తెలిపారు.

ఆర్డీవోను నిలదీసిన వంశధార నిర్వాసితులు



ఆర్డీవో వాహనాన్ని అడ్డుకున్న మహిళలు

హిరమండలం: పాడలి, దుగ్గుపురం గ్రామాల్లో రేషన్ దుకాణం కొనసాగించాలని ఆయా గ్రామాలకు చెందిన వంశధార నిర్వాసితులు శనివారం ఆర్డీవో వాహనాన్ని అడ్డుకున్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించలేదని, ఇతర సమస్యలు సైతం పరిష్కరించకుండా గ్రామాలను ఖాళీ చేయమనడం దారుణమని ఆయన్ను నిలదీశారు. ఈ విషయాన్ని ఉన్నతాధిరులకు తెలియజేస్తానని ఆర్డీవో చెప్పారు.



స్నేహబంధం సుమగంధం

'స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం..' అంటూ స్నేహం గొప్పతనాన్ని చాటిచెప్పాడు ఓ సినీ కవి. గుండెల్లో బాధను దాచుకుని ప్రేమను అందించేది.. నిజమైన స్నేహం. కష్టాల్లో శక్తినిచ్చి .. అవసరమైనప్పుడు మనోధైర్యాన్ని అందించి.. కన్నతల్లిలా కాపాడేది స్నేహబంధం. అందుకే తల్లీతండ్రి, గురువు, దైవం తర్వాత నిజమైన స్నేహమే విలువకట్టలేనిదిగా నాటి పురాణాల నుంచి నేటి వరకు ఎన్నో సంఘటనలు నిరూపిస్తున్నాయి. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.





● ఎలా వచ్చిందంటే..

ఏటా ఆగస్టు మొదటి ఆదివారం ఫ్రెండ్ షిప్ డే జరుపుకోవాలని యూఎన్‌వో ప్రకటించింది. 1930లో అమెరికాలో ప్రారంభమైన ఈ స్నేహితుల దినోత్సవం 1940 నాటికి ప్రజాదరణ పొందింది. 1958, జూలై 20న ఆర్టిమియోప్రైజో అనే వ్యక్తి మొదటిసారిగా స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. క్రమేపీ ఆగస్టు మొదటి ఆదివారం జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

- నేడు స్నేహితుల దినోత్సవం

(శ్రీకాకుళం సిటీ/హిరమండలం/హరిపురం)

తల్లిదండ్రులను దేవుడే డిసైడ్ చేసేస్తాడు. భార్యభర్తల బంధం స్వర్గంలోనే నిర్ణయమవుతుందని అంటుంటారు. స్నేహితుడిని ఎంచుకునే అవకాశాన్ని మాత్రం దేవుడు మనకే వదిలేశాడు. మన ఇష్టాలు, అభిరుచులకు తగ్గట్లు మనమే స్నేహితులను ఎంచుకుంటాం. అందుకే స్నేహబంధం ఎంతో విశిష్టమైనది. తరాలు మారినా స్నేహానికి అర్థం, పరమార్థం మారదు. అందుకే స్నేహితుడు అన్నింటా మనవాడు. మనసెరిగినవాడు.

ఆన్‌లైన్ స్నేహాలు

ఇంటర్‌నెట్ వినియోగం గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడంతో పలువురు ఆన్‌లైన్ స్నేహాలపై మక్కువ చూపుతున్నారు. ఇంటర్‌నెట్‌లో రకరకాల వారధులు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో యువత, విద్యార్థులు చాలా మంది వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వినియోగిస్తున్నారు. ఉద్యోగులు, అధికారులు, రాజకీయ నాయకులు దాదాపు 25శాతం మంది ఆన్‌లైన్ స్నేహాలను కొనసాగిస్తున్నారు.



తల్లిదండ్రుల బాధ్యత

● తమ పిల్లల స్నేహితులు ఎలా ఉన్నారో నిశితంగా పరిశీలిస్తూ ఉండాలి.

● నేడు యువతీయువకుల్లో మొబైల్, నెట్ చాటింగ్ ఎక్కువగా ఉంటోంది. వారు ఎవరితో చాటింగ్ చేస్తున్నారో గమనించి జాగ్రత్తలు తీసుకోవాలి.

● చదువుకన్నా.. ఇతర వాటికి అధిక సమయం కేటాయిస్తుంటే పిల్లలకు చదువు, లక్ష్యాలు నిర్దేశించి ఆ దిశగా దృష్టి సారించేలా చూడాలి.

● పిల్లలు చెడ్డ వారితో స్నేహం చేస్తే వారించాలి

● ఫ్రెండ్స్‌తో పార్టీలకు డబ్బులిచ్చి ప్రోత్సహించొద్దు

తస్మాత్ జాగ్రత్త

● ఎలాంటి వారితో స్నేహం చేయాలో తెలుసుకోవాలి. ఎటువంటి వారిని స్నేహానికి దూరంగా ఉంచాలో కూడా తెలుసుకోవడం చాలా ముఖ్యం. కళాశాల జీవనంలో అలాంటి వారిని కేవలం పరిచయస్థులుగా పరిమితం చేయడం మంచిది.

● సమాజంలో, విద్యాసంస్థల్లో మంచి వ్యక్తిగా రాణింపు లేకపోయినా చెడ్డ వ్యక్తులుగా గుర్తింపు తెచ్చు కుంటున్న వారితో ప్రమాదం.

● వినోదాలను అలవాటుగా మార్చుకొని విలాసాలతో సంతోషంగా గడపాలనుకునే వారితో దూరంగా ఉండడం మేలు.

● అతిచొరవతో సన్నిహితంగా మెలిగేవరిని కొద్దికాలమైనా పరిశీలించాలి. లేకుంటే లేనిపోని ఇబ్బందులు తప్పవు.

● భౌతికమైన వేషభాషలతో అందర్నీ ఆకట్టుకునే ప్రయత్నం చేసేవారికి దూరంగా ఉండాలి. లేని నాయకత్వాన్ని మీదేసుకొని గుర్తింపుకోసం పాకులాడే వారిని వీలైనంత దూరంగా ఉంచడం అవసరం.

● అధికంగా ఖర్చు చేయడమో, ఖర్చు చేయించడమో చేసేవారు ఇబ్బందులపాలు చేస్తారు.

● నేరప్రవృత్తి, వ్యసనాలపై ఆసక్తి ఉన్నవారిని స్నేహితులుగా మార్చుకుంటే తప్పకుండా ఆ ప్రభావానికి లోనై ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు.

● రజతోత్సవ సంబరాల్లో..



హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1991-1993లో ఇంటర్మీడియట్ చదివిన వారంతా స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఒక చోట కలుసుకోవాలని నిర్ణయించారు. సుమారు 70 మందితో నేడు విశాఖలో రజతోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు వారణాసి రాజారెడ్డి చెప్పారు. వ్యాపారాలు, ఉద్యోగాల నిమిత్తం మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో స్థిరపడ్డ స్నేహితులను తిరిగి కలుసుకునేందుకు వాట్సప్, ఫేస్‌బుక్ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఇతర వివరాలకు ఈ సెల్ నెంబర్లకు 9437102487, 9440436527 కాల్ చేయాలని ఆయన కోరుతున్నారు.

చిన్ననాటి స్నేహితులు



స్నేహితులు కళ్యాణి, లావణ్య

హరిశ్చంద్రపురం(కోటబొమ్మాళి) : హరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన ఉప్పాడ కళ్యాణి, అదే పంచాయతీ చిన్నహరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన తిర్లంగి లావణ్య చిన్ననాటి స్నేహితులు. హరిశ్చంద్రపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి పదో తరగతిలో 9.8గ్రేడ్‌పాయింట్లు చొప్పున మార్కులు సాధించారు. వీరిద్దరు ఎగ్రికల్చర్ డిప్లమోకు దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సెలింగ్‌లో కూడా ఇద్దరికీ సాలూరు కళాశాలలోనే సీట్లు వచ్చాయి. దీంతో ఇద్దరు ఒకే గదిలో ఉంటూ చదువుకున్నారు. ఇద్దరూ అప్పుడప్పుడూ కీచులాడుకున్నప్పటికీ భోజనం దగ్గరకు వెళ్లేసరికి ఒక్కటయ్యేవారు. డిప్లమో పూర్తయిన తరువాత ఇద్దరికీ ఒకేసారి ఎంపీఈవో ఉద్యోగాలు వచ్చాయి. అయితే ఇంతలోనే వారిద్దరికీ వివాహాలు నిశ్చయమయ్యాయి. ఉద్యోగ కౌన్సెలింగ్‌లో బొడ్డేపల్లికి దగ్గరగా ఉన్న ఎచ్చెర్ల మండలాన్ని లావణ్య ఎంపిక చేసుకుంది. కళ్యాణి సంతబొమ్మాళి మండలాన్ని ఎంపికచేసుకుంది. ప్రస్తుతం వారు ఆయా మండలాల్లో ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ రోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటుంటారు.

మాటను గౌరవించి...



హిరమండలం గార్లపాడు గ్రామానికి చెందిన గవర గోవిందరావు, నారా శంకరరావు 27 ఏళ్లగా స్నేహబంధం కొనసాగిస్తున్నారు. శంకరరావు ఉపాధ్యాయుడుగా పనిచేస్తుండగా గోవిందరావు రాజకీయ నేపథ్యంలో కొనసాగుతున్నారు. ప్రతి పనిలోను, కుంటుంబ విషయాల్లోనూ ఇద్దరూ సలహాలు ఇచ్చి పుచ్చుకుంటారు. గోవిందరావు కోరడంతో రాజకీయాలు ఇష్టంలేకపోయినా తన భార్య అరుణను సర్పంచ్ పోటీలో నిలబెట్టి స్నేహితుని మాటకు శంకరరావు గౌరివించారు. ఇప్పుడు శంకరరావు భార్య సర్పంచ్‌గా కొనసాగుతోన్నారు.

అరమరికలు లేకుండా..



హిరమండలానికి చెందిన గురుగుబెల్లి వెంకటరమణ, జామ నాగరాజు. చదువుకునే సమయంలో మిత్రులుగా మారారు. ఒకే ఏడాదిలో ఉపాధ్యా శిక్షణకు ఎంపికయ్యారు. డీఎస్‌ఈలో ఉద్యోగాలు సాధించి 8 ఏళ్లు ఒకే పాఠశాలో పని చేశారు. ఒకరి తెలియకుండా ఒకరు ఏపని చేయరు. ఇప్పటికీ ఎలాంటి అరమరికలు లేకుండా వీరి స్నేహం కొనసాగుతోంది.

● పార్టీలే వేరు..



మందస మండలం సువర్ణాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సాలిన బీమారావు, రంగనాథపురం గ్రామానికి చెందిన గ్రామపెద్ద పందిరి బైరాగిలు చిన్ననాటి మిత్రు లు. వారిద్దరి దేహాలు వేరేనా.. హృదయం ఒకటే. 30 ఏళ్లగా వారి మధ్య స్నేహం కొనసాగుతూనే ఉంది. ఒకరు టీడీపీకి నమ్మిన బంటుకాగా.. మరొకరు వైసీపీలో ఉన్నారు. అయితే. ఇవేవీ వారి స్నేహానికి అడ్డురాలేదు.

అంధుడైన స్నేహితుడికి అన్నీ తానై...



చైతన్యతో నవీన్

కొర్లాం (సోంపేట) : కొర్లాం గ్రామానికి చెందిన చైతన్య, నవీన్‌ల స్నేహం ఎంతో ప్రత్యేకమైనది. పదేళ్లగా కొనసాగుతున్న వారి బంధం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోంది. వాస్తవంగా అంధుడైన చైతన్య గ్రామంలోని శివాలయంలో పూజలు చేస్తుంటాడు. కుమ్మరిపాడుకు చెందిన కె.నవీన్ ఆటలాడుకునేందుకు తరచూ ఆలయానికి వచ్చి చైతన్యతో పరిచయం పెంచుకున్నాడు. కాలక్రమంలో వారి స్నేహం మరింత బలపడింది. దీంతో అంధుడైన స్నేహితుడికి అన్నీ తానే అయ్యాడు నవీన్. రోజూ చైతన్యను ఆలయానికి తీసుకురావడంతో పాటు తిరిగి ఇంటికి తీసుకెళ్తుంటాడు. అంతేగాకుండా చైతన్య కుటుంబం నిర్వహించే షాపులో ఉంటూ తన సహాయ సహకారాలు అందిస్తున్నాడు.

50 ఏళ్ల స్నేహం..



మందస మండలం సొండిపూడి గ్రామానికి చెందిన నగిరి లక్ష్మీనారాయణ, సిద్ధాబత్తుల అప్పారావులు వృత్యరీత్యా ఉపాధ్యాయులు. చదువుకున్న సమయంలోనే ఇద్దరి మధ్య స్నేహబీజం పడింది. ఉపాధ్యాయులుగా ఇద్దరూ ఒకపాఠశాలలో పనిచేశారు. సుమారు 50ఏళ్లుగా వీరిద్దరి స్నేహం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగులుగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు.

అలుపెరగని నేస్తాలు..



మందస మండలం మఖరజోల గ్రామానికి చెందిన బమ్మిడి భూపతిరావు, కాలువ వెంకటరావులు చిన్ననాటి మిత్రులు.. ఇద్దరూ ప్రాథమిక విద్యలో ఒకే తరగతి అయినా.. 18వ ఏట ఆర్మీలో చేరాలనే పట్టుదలతో ఇద్దరూ సాధన చేశారు. ఒకరు ఇండియన్ ఆర్మీలో, మరొకరు మహారాష్ట్ర సెక్యూరిటీ ఫోర్స్‌లో జవాన్‌లుగా ఎంపికయ్యారు. వృత్తిరీత్యా సుదూర ప్రాంతాలకు వెళ్లినా.. ఇద్దరి మధ్య స్నేహం కొనసాగుతూనే ఉంది. ఇరవైఏళ్ల కిందట రంగోయి శివాలయంలో నేస్తాలుగా శాస్త్రోధికంగా మారారు. ప్రస్తుతం గ్రామంలో వారిద్దరూ వ్యవసాయం చేసుకుంటూ ఇద్దరి శేషజీవితాన్ని గడుపుతున్నారు.

కష్టాల్లో పాలుపంచుకుంటూ...



పలాస: పలాసకి చెందిన మల్లా యుగంధర్, పెంట రమేష్‌ల స్నేహం 30 ఏళ్లుగా కొనసాగుతోంది. యుగంధర్ పలాస ఇందిరాచౌక్ వద్ద బుక్‌స్టోర్ నిర్వహించేవారు. ప్రస్తుతం మీ-సేవ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. రమేష్ జీడి వ్యాపార సంస్థను నిర్వహిస్తు పలాసలోనే నివాసం ఉంటున్నారు. వీరి మధ్య స్నేహం 3వ తరగతిలోనే ప్రారంభమైంది. యుగంధర్ స్థానిక యూపీ స్కూల్‌లో చదువున్న క్రమంలో రమేష్ కుటుంబం పలాస వచ్చింది. ఆయన స్కూల్‌లో చేరగానే మొదట యుగంధర్‌తోనే కలిసి ఉండేవాడు. ఈ విధంగా వీరి స్నేహం చిగురించింది. ఇదిలా ఉండగా గతంలో యుగంధర్ వ్యాపారంలో నష్టపోయినప్పుడు రమేష్ అండగా నిలిచాడు. అధిక సమయాన్ని వెచ్చిచ్చడంతో పాటు ఆర్థికంగా ఆదుకున్నాడు. ప్రస్తుతం కష్టసుఖాల్లో ఒకొరికొకరు పాలుపంచుకుంటూ స్నేహ బంధాన్ని చాటిచెబుతున్నారు.

ఒకే మాట.. ఒకటే బాట



(నరసన్నపేట) వాళ్లిద్దరిదీ ఒకటే మాట.. ఒకటే బాట. 45 ఏళ్లుగా స్నేహబంధం కొనసాగిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు శాంతామణి డిస్ట్రిబ్యూటరీ ఏజెన్సీ నిర్వాహకులు ఎన్.ఆర్. శెట్టి, బోయన జనార్దనరావులు. హూమేక్స్ ఉత్పత్తులను రాష్ట్రంలో వివిధ దుకాణాలకు పంపిణీ చేస్తున్న వారిద్దరూ 1973లో నరసన్న పేటలో ఒక దుకాణంలో జీవనోపాధికోసం చేరారు. అక్కడ వారి మధ్య స్నేహం ఏర్పడింది. కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ.. అంచెలంచెలుగా ఎదిగారు. 1974లో అగరొత్తుల ఏజెన్సీని ఏర్పాటు చేసి విజయవంతమయ్యారు. అదే ఏడాది హూంబకార్ ఉత్పత్తుల పంపిణీ బాధ్యతను తీసుకున్నారు. వ్యాపారాల్లో ఎంత అభివృద్ధి చెందినా నేటికీ ఏనిర్ణయం తీసుకున్నా.. ఒకటిగా ముందుకు సాగుతున్నామని వారు చెప్పారు. మనస్పర్థలు వచ్చినా.. వెంటనే సర్దుకుపోతాం. కష్టసుఖాల్లో ఒకరిఒకరుగా నిలుస్తున్న వారు సేవా కార్యక్రమాలను కూడా కొనసాగిస్తున్నారు. పేదంటి మహిళల పెళ్లిళ్లకు సహాయం చేయడంతో పాటు.. వృద్ధాశ్రమాలు, దేవాలయాల్లో జరిగే శుభకార్యాలయాలకు తమవంతుగా వితరణ చేస్తూ.. మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

తండ్రుల స్నేహ బాటలో పిల్లలు..

నరసన్నపేటకు చెందిన ఎన్.చంద్రమౌళి, బోయన రామకృష్ణ తండ్రుల స్నేహ బాటలోనే నడుస్తున్నారు. గత పదేళ్లుగా రడీమేడ్ వస్త్ర వ్యాపారం నిర్వహిస్తున్నారు. చిన్నతనం నుంచి ఒకే పాఠశాలలో చదువుతూ.. తండ్రులు ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. అనుబంధాల కంటే స్నేహాబంధం గొప్పదని తమ తండ్రుల నుంచి నేర్చుకున్నామని వారు తెలిపారు.





జంబుతీర్థంలో స్నానాలకు దిగుతున్న భక్తులు



తీర్థం వద్ద ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జంబు తీర్థం జనసంద్రం

● అష్టతీర్థ స్నానాలకు పోటెత్తిన భక్తులు

● శివనామస్మరణతో మార్మోగిన శ్రీముఖలింగం

● అదనపు బలగాలను తెప్పించిన డీఎస్పీ

శ్రీముఖలింగం (జలుమూరు): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగం శనివారం శివనామస్మరణతో మార్మోగింది. శ్రావణమాసం, శనిత్రయోదశి కావడంతో అష్టతీర్థ రాజమహాయోగంలో భాగంగా ఆరో రోజు జంబు తీర్థంలో నిర్వహించే పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం 5 గంటలకు జంబుతీర్థం వద్ద అర్చకుడు పెద్దలింగన్న ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త పర్లాకిమిడి మహారాజు పేరున ప్రత్యేక పూజలు చేశారు. 9 గంటలకు జిల్లా నలు మూలల నుంచే గాకుండా ఇతర జిల్లాల భక్తులు భారీగా తరలి రావడంతో శ్రీముఖలింగం కిటకిటలాడింది. సాయంత్రం 4 గంటల వరకు భక్తజనం జంబుతీర్థంలో స్నానాలు ఆచరించారు. అంచనాలకు మించి ప్రజలు రావడంతో తీర్థం వద్ద అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేకపోయారు. కొంతమంది మిగతా తీర్థాలకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు. జంబుతీర్థంలో స్నానాలు చేసిన భక్తులు సమీపంలోగల జంబుకేశ్వర స్వామితో పాటు శ్రీముఖలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. టెక్కలి ఆర్డీవో ఎం.వేంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తీర్థం వద్ద పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం డీఎస్పీ కె.భార్గవరావునాయుడు అదనపు పోలీసులను తెప్పించి బందోబస్తు నిర్వహించారు. టీడీపీ నాయకులు బగ్గు గోవిందరావు, వెలమల రాజేంద్రనాయుడు, తర్ర బలరాం, పొన్నాడ దాలయ్య, ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ బైరి బలరాం, ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ, తహసీల్దార్ కె.ప్రవల్లిక ప్రియ పాల్గొన్నారు.



తీర్థానికి హారతి ఇస్తున్న అర్చకులు

● భక్తులకు జంబుతీర్థం వద్ద పండావీధి వారు అన్నదానం నిర్వహించారు. ప్రధాన ఆలయం, రాధాగోవిందస్వామి మఠం వద్ద భోజన వసతి కల్పించారు. శ్రీముఖలింగం గ్రామానికి చెందిన భాస్కరపట్నాయక్ పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు.

● ఆర్టీసీ అదనపు బస్సులు నడపలేదు.

● 30 మంది స్మార్ట్ విలేజీ గ్రామమిత్ర యువకులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా సేవలందించారు.

● కొమనాపల్లి సత్యసాయి భజనమండలి ఆధ్వర్యంలో రాధాగోవిందస్వామి మఠం వద్ద భజన కాలక్షేపం నిర్వహించారు.

● నరసన్నపేట సీటీవో అనసూయ శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించుకున్నారు.

● ఆలయం వద్ద దర్శనాలకు వేర్వేరు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

● సాయంత్రం జంబుతీర్థానికి అర్చకులు నక్షత్ర, కుంభ, నాగ హారతులిచ్చారు. ఈ పూజల్లో అర్చకుల సంఘం అధ్యక్షుడు పెద్దలింగన్న, అర్చకులు అప్పారావు, నారాయణమూర్తి, శ్రీకృష్ణ, సింహాచలం, భక్తులు పాల్గొన్నారు.

నేడు సూర్య తీర్థంలో ...

అష్టతీర్థ రాజమహాయోగంలో భాగంగా ఏడో రోజు శ్రావణమాసం చతుర్దశి ఆదివారం సూర్య తీర్థంలో భక్తులు స్నానాలాచరించనున్నారు. అనంతరం ఆదిత్యేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ప్రధాన ఆలయానికి కిలోమీటరు దూరంలో ఉన్న వంశధార నదిలో ఈ తీర్థం ఉంది. దేవాదాయశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

వంశధార నదిలో భక్తుడు గల్లంతు

సరుబుజ్జిలి మండలం గోనెపాడుకి చెందిన గొండు రమణ వాడవలస రేవువద్ద వంశధారనది దాటుతుండగా కొట్టుకుపోయాడు. సాయంత్రం వరకూ ఆచూకీ లభించలేదు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.





పొలాల గుండా జంబు తీర్థానికి చేరుకుంటున్న భక్తులు, ప్రధాన ఆలయం వద్ద భక్తజనం ఇలా...

2024 ఒలింపిక్స్‌కు పారిస్ ఆతిథ్యం

కరెంట్ అఫైర్స్



రామచంద్రారెడ్డి ఉప్పుల

అంతర్జాతీయం

పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా అబ్బాసీ

పాకిస్థాన్ ఆపద్ధర్మ ప్రధానిగా పెట్రోలియం, సహజ వనరుల శాఖ మాజీ మంత్రి షహీద్ ఖాకన్ అబ్బాసీ జూలై 29న నియమితులయ్యారు. ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ మోసం, అవినీతికి పాల్పడ్డారని ఆ దేశ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఫలితంగా అతడిపై అనర్హత వేటు పడింది. పనామా పత్రాల కుంభకోణం వ్యవహారంలో షరీఫ్‌తోపాటు కుటుంబ సభ్యులపై దాఖలైన వ్యాజ్యానికి సంబంధించి అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. తదుపరి ప్రధానిగా షరీఫ్ తమ్ముడు, పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రి షెహనాజ్ షరీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు. 45 రోజుల పాటు అబ్బాసీ తాత్కాలిక ప్రధానిగా పనిచేస్తారు.

టిబెట్‌లో ఎక్స్‌ప్రెస్ మార్గం ప్రారంభం

ప్రపంచంలోనే ఎత్తయిన పీఠభూమి టిబెట్‌లో చైనా ఎక్స్‌ప్రెస్ రహదారిని ప్రారంభించింది. కింఘై ప్రావిన్స్‌లోని గాంగ్హె కౌంటీని పుషు నగరంతో కలుపుతూ దీన్ని నిర్మించారు. 634.8 కి.మీ. పొడవైన ఈ మార్గం నిర్మాణానికి 25.6 వేల కోట్లను చైనా ఖర్చు చేసింది. సగటున 4 వేల మీటర్ల ఎత్తులో ఈ రహదారి ఉంటుంది. రహదారిలో 36 శాతం మంచునేల పెర్మాఫ్రాస్ట్‌పై నిర్మించారు. ఈ మార్గం ద్వారా యుషు, షినింగ్‌ల మధ్య ప్రయాణ సమయం 8 గంటలకు తగ్గింది.

చైనా గోడ కింద హైస్పీడ్ సొరంగ రైలు మార్గం

గ్రేట్ వాల్ ఆఫ్ చైనా కింద హైస్పీడ్ సొరంగ రైలు మార్గాన్ని చైనా నిర్మించనుంది. 2022 శీతాకాల ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనున్న బీజింగ్, ఝూంగ్ జియాకు నగరాలను అనుసంధానించేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఇందులో భాగంగా మహాకుడ్యానికి చెందిన బాడలింగ్ భాగం కింద 12 కి.మీ. పొడవైన సొరంగాన్ని తవ్వనున్నారు. గోడ కిందే 102 మీటర్ల లోతున 36 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో రైల్వే స్టేషన్‌ను నిర్మించనున్నారు. ఈ మార్గంలో గంటకు 350 కి.మీ. వేగంతో రైళ్లు ప్రయాణించనున్నాయి.

చైనా చేతికి శ్రీలంక రేవు

వ్యూహాత్మక హంబంటోటా రేవులో 70 శాతం వాటాను చైనాకు విక్రయిస్తూ శ్రీలంక నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు 110 కోట్ల డాలర్ల ఒప్పందంపై జూలై 29న శ్రీలంక నౌకాయాన మంత్రి మహింద సమరసింఘే, కొలంబోలో చైనా రాయబారి జియాన్ లియాంగ్‌లు సంతకం చేశారు. నష్టాల్లో ఉన్న ఈ రేవును చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని చైనా మర్చంట్ పోర్ట్ హోల్డింగ్స్‌కు అప్పగిస్తారు. 99 ఏళ్ల పాటు ఈ లీజు ఒప్పందం కొనసాగుతుంది. ఈ ఒప్పందంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఇరాన్ అధ్యక్షుడిగా రోహానీ ప్రమాణం



ఇరాన్ అధ్యక్షుడిగా హసన్ రోహానీ ఆగస్టు 3న ప్రమాణ స్వీకారం చేశారు. రోహానీ 2013లో మొదటిసారి అధ్యక్షుడయ్యారు. 2015 అణు ఒప్పందం విషయంలో, ప్రపంచ దేశాల ఆంక్షల తొలగింపులో ఈయన కీలక పాత్ర పోషించారు. 2017 మేలో జరిగిన ఎన్నికల్లో రోహానీ 57 శాతం ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

లష్కరే కమాండర్ దుజానా హతం

లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజానాను ఆగస్టు 1న భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్థాన్ జాతీయుడైన దుజానాను, అతని అనుచరుడు ఆరిఫ్ నబీదార్‌ను భద్రతా బలగాలు హతమార్చాయి. దుజానా దక్షిణ కశ్మీర్‌లో లష్కరే తోయిబా చీఫ్ కమాండర్, ఏ+++ హోదా ఉగ్రవాది. 2013లో అబు ఖాసీం మరణించాక దుజానా లష్కరే టాప్ కమాండర్‌గా ఉన్నాడు.

క్రీడలు

హంగేరియన్ గ్రాండ్‌ప్రి విజేత వెటెల్

ఫెరారీ డ్రైవర్ సెబాస్టియన్ వెటెల్ హంగేరియన్ గ్రాండ్‌ప్రి విజేతగా నిలిచాడు. ఈ విజయంతో వెటెల్ ఎఫ్ 1 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తన ఆధిక్యాన్ని 14 పాయింట్లకు పెంచుకున్నాడు. జూలై 30న బుడాపెస్ట్‌లో జరిగిన రేసులో వెటెల్ మొదటి స్థానంలో, ఫెరారీకే చెందిన రైకోనెన్ రెండో స్థానంలో నిలిచాడు.

2024 ఒలింపిక్స్‌కు పారిస్ ఆతిథ్యం

2024 ఒలింపిక్స్‌కు ఫ్రాన్స్ రాజధాని పారిస్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఏడాది సెప్టెంబరు 13న పెరూలోని లిమాలో జరిగే సమావేశంలో 2024కి పారిస్, 2028కి లాస్ ఏంజిల్స్‌ను ఎంపిక చేసినట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఒసి) ప్రకటిస్తుంది. 2020 ఒలింపిక్స్‌కు టోక్యో ఆతిథ్యం ఇవ్వనుంది. 2024 ఒలింపిక్స్‌కు పారిస్, లాస్ ఏంజిల్స్ పోటీ పడగా, 1924లో తొలిసారి ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చి వందేళ్లవుతున్న సందర్భంగా పారిస్‌కు అవకాశం ఇచ్చారు. వింటర్ ఒలింపిక్స్ 2022లో బీజింగ్‌లో జరుగుతాయి.


అవార్డులు

ఆచార్య కృష్ణకు జాతీయ ప్రతిభా అవార్డు

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 'సెంటర్ ఫర్ ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్'లో ఆచార్యుడిగా పనిచేస్తున్న కె.ఎస్.కృష్ణ ప్రతిష్ఠాత్మకమైన జాతీయ ప్రతిభా అవార్డును అందుకొన్నారు. భూశాస్త్ర మంత్రిత్వ శాఖ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జూలై 27న ఈ అవార్డును అందజేశారు. ఈ సంవత్సరం జియో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి డా.కె.ఎస్ కృష్ణ ఎంపికయ్యారు. 1984లో గోవాలోని సముద్ర అధ్యయన జాతీయ సంస్థలో శాస్త్రవేత్తగా చేరి, ముఖ్య శాస్త్రవేత్త స్థాయికి ఎదిగిన ఆయన హెచ్‌సియు ఆహ్వానం మేరకు ఇటీవలే ఆచార్యుడిగా చేరారు. ఎన్ఐఓలో చేసిన పరిశోధనలకు కృష్ణ ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ

ఉత్తర కొరియా క్షిపణి పరీక్ష



ఉత్తర కొరియా నెల రోజుల్లో రెండోసారి ఖండాంతర క్షిపణిని పరీక్షించింది. 2017 జూలై 28న 'హ్వాసాంగ్-14' అనే క్షిపణిని ప్రయోగించింది. ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ దీన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ క్షిపణి 3724.9 కిలోమీటర్ల ఎత్తుకు చేరి 998 కి.మీ. ప్రయాణించింది. తూర్పు తీరానికి చేరువలో సముద్రంలో పడిపోయింది. దీని పరిధి 10 వేల కి.మీ. ఉత్తర కొరియా, రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలు విధిస్తూ అమెరికా సెనెట్ ఒక తీర్మానం చేసిన మరుసటి రోజే కొరియా ఈ పరీక్షలను జరిపింది. 750 కిలోల వార్ హెడ్‌తో ఈ క్షిపణి న్యూయార్క్, వాషింగ్టన్ నగరాలను చేరగలదు.

తొలి మానవ రహిత యుద్ధ ట్యాంక్ 'మంత్ర'

భారత్ తొలి మానవ రహిత యుద్ధ ట్యాంక్ 'మంత్ర'ను రూపొందించింది. చెన్నై సమీపంలోని అవడిలోని ట్యాంక్ పరిశ్రమలో దీన్ని తయారు చేశారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా 'కంబాట్ వెహికిల్స్ రీసెర్చి అండ్ డెవలెప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్'లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీన్ని ప్రదర్శించారు. ఈ యుద్ధ ట్యాంక్‌లు మూడు రకాలు. నిఘా, మందుపాతరల గుర్తింపునకు వీటిని ఉపయోగించనున్నారు.

స్మృతి

ప్రొఫెసర్ పి.ఎం.భార్గవ

ప్రముఖ శాస్త్రవేత్త, సీసీఎంబీ వ్యవస్థాపక



డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్పమిత్ర భార్గవ ఆగస్టు 1న హైదరాబాద్‌లో మరణించారు. 1928లో రాజస్థాన్‌లోని ఆజ్మీర్‌లో జన్మించిన ఆయన లక్నో యూనివర్సిటీ నుంచి ఆర్గానిక్ కెమిస్ట్రీలో పట్టా పొందారు. సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేశారు. 1950-53 మధ్య ఐఐసీటీలో, 1953-56 మధ్య విస్కాన్సన్ వర్సిటీలో పనిచేశారు. 1986లో పద్మవిభూషణ్ అవార్డు పొందారు. సీసీఎంబీ వ్యవస్థాపక సంచాలకుడిగా 1977లో బాధ్యతలు స్వీకరించి 1990 వరకూ కొనసాగారు.

స్వయం ఉపాధి

మయోనైజ్



మైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

మయోనైజ్ అంటే క్రీమీగా చిక్కగా ఉండే సాస్ / డ్రెస్సింగ్ పదార్థమని అందరికీ తెలుసు. దీన్ని వెజిటబుల్ నూనెలు, కోడిగుడ్డు సొన, నిమ్మరసం లేదా వెనిగర్, సీజనింగ్ లేదా ప్రిజర్వేటివ్స్‌తో తయారు చేస్తారు. శాకాహారుల కోసం కోడిగుడ్డు లేకుండా కూడా తయారు చేస్తారు. ఈ సాస్ తెలుపు, పసుపు వర్ణాల మిశ్రమంగా కనిపిస్తుంది. రుచిలో కొంచెం తియ్యదనం ఉంటుంది.

వాడకం

మయోనైజ్‌ను ప్రధానంగా ఆహార పదార్థాల తయారీలో, వినియోగంలో విస్తృతంగా వాడతారు. సలాడ్స్, శాండ్‌విచ్‌లు బర్గర్స్ తయారీలో కూడా ఎక్కువగా ఉపయోగిస్తారు. మందుల తయారీ, పెయింట్స్, కోటింగ్స్, మేకప్ ఉత్పత్తులు, డిటర్జెంట్స్ తయారీలో కూడా వినియోగిస్తారు. బేకరీ ఉత్పత్తులు, కాన్ఫెక్షనరీ ఉత్పత్తుల తయారీలో విస్తృతంగా వాడుతున్నారు. ఆహార పదార్థాలకు పరిమళాన్ని అందించి ఆకర్షణీయంగా కనిపించేందుకు కూడా మయోనైజ్‌ను వినియోగిస్తారు.



చరిత్ర

ఈ సాస్‌ను 1756లో ఫ్రెంచ్ చెఫ్ Due de Richelieu కనుగొన్నారు. ఆ తరవాత ప్రపంచ వ్యాప్తంగా వివిధ ముడిపదార్థాలతో పలు రుచులతో దీన్ని తయారు చేస్తున్నారు. అమెరికాలో అత్యధిక పరిమాణంలో వినియోగించే కండిమెంట్‌గా ఇది గుర్తింపు పొందింది.

ఇండియన్ మార్కెట్

2014 నివేదిక ప్రకారం మన దేశంలో మయోనైజ్ మార్కెట్ పరిమాణం రూ.350 నుంచి 400 కోట్ల వరకు ఉందని తెలుస్తోంది. ఏటా 25 శాతం వరకు వృద్ధి పొందుతోంది.

దేశీయ మార్కెట్ వృద్ధికి కారణాలు

మారుతున్న పట్టణ ప్రజల జీవన విధానం, పట్టణాల నుంచి నగరాలకు పాకుతున్న ఆధునిక జీవన శైలీ, ఆన్‌లైన్ స్టోర్స్, సూపర్ మార్కెట్స్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉండటం, విదేశీ ప్రయాణాలు పెరగడం వంటి కారణాల వల్ల మయోనైజ్ సాస్‌కు డిమాండ్ పెరుగుతోంది.

తయారీకి కావల్సిన యంత్ర పరికరాలు

- హై స్పీడ్ మిక్సర్
- ట్రాన్స్‌ఫర్ పంపు
- హోమోజినైజర్
- న్యూమాటిక్ ఫిల్లర్.
- బ్యాండ్ సీలర్
- స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు
- టేబుల్

ముడి పదార్థాలు

మయోనైజ్ సాస్‌ను మూడు రకాలుగా తయారు చేస్తారు.

- గుడ్డు సొనతో తయారుచేసిన మయోనైజర్
- ఎగ్‌లెస్ లేదా వెజిటబుల్ మయోనైజర్
- హెర్బల్ మయోనైజర్.

వీటికి ప్రధానంగా సోయాబీన్ ఆయిల్, ఆవనూనె, వైట్ వెనిగర్, ఉప్పు, ఇంగువ, తులసి నూనె, కరివేపాకు నూనె, గుడ్లు, ప్రిజర్వేటివ్ వంటివి అవసరం.

తయారీ విధానం

సహజంగా కలిసే లక్షణాలు లేని రెండు లేదా అంత కంటే ఎక్కువ వంట నూనెలను హైస్పీడ్ మిక్సర్‌లో నిదానంగా కలుపుతారు. మధ్య మధ్యలో ఇతర ముడి పదార్థాలను నిర్ణీత పరిమాణంలో కలుపుతూ గట్టి పేస్ట్ లా తయారు చేస్తారు. ఈ పేస్ట్‌నే మయోనైజర్ లేదా మాయో అని పిలుస్తారు. దీన్ని పెట్ బాటిల్స్, ప్లాస్టిక్ పౌచ్‌ల్లో ప్యాక్ చేసి మార్కెట్‌కు తరలిస్తారు.

ఆరోగ్య ప్రాముఖ్యం

మయోనైజ్ అనేది ఒక సమతులాహార పదార్థం. ఇది పదార్థాలకు రంగు, రుచి, సువాసనలను అదించడమే కాకుండా ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ఇందులో ఉండే సోయాబీన్ ఆయిల్, ఆవ నూనెల్లోని ఆల్ఫా లినోలిక్ యాసిడ్, అత్యావశ్యక ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ బితోపాటు అనేక రకాల విటమిన్లు, ఖనిజాలు శరీరానికి అరోగ్యాన్ని అందిస్తాయి.

మార్కెటింగ్

చైనీస్ రెస్టారెంట్స్, పిజ్జా, బర్గర్ తయారీ సంస్థల్లో నేరుగా మార్కెట్ చేసుకోవచ్చు. గృహ వినియోగదారుల కోసం సూపర్ మార్కెట్లు, కిరాణా దుకాణాల ద్వారా మార్కెటింగ్ చేసుకోవాలి. ఇటీవల ఆన్‌లైన్ వ్యాపారం వృద్ధి చెందుతోంది. కాబట్టి సంబంధిత వ్యాపార సంస్థలతో ఒప్పందాలు చేసుకొన్నట్లయితే లాభదాయకంగా ఉంటుంది.

పరిశ్రమ వివరాలు: పరిశ్రమ సామర్థ్యం: గంటకు 100 కిలోలు

పరిశ్రమ వ్యయం: రూ. 25 లక్షలు

What was the time taken by car..


QUANTITATIVE APTITUDE

Direction (1-5) : What approximate value should come in place of the question mark (?) in the following questions? (You are not ex-pected to calculate the exact value.)

1. 34.95% of 499.99 – 20.24% of 1599 + ? = 59.99
(1) 415 (2) 435 (3) 485 (4) 205 (5) 465
2. 7839.03 ÷ 6.99% of 879.9 + 618.14 = ?
(1) 512 (2) 664 (3) 774 (4) 744 (5) 894
3. $\sqrt{2499} \times \sqrt{730} \div \sqrt{899} = ?$
(1) 55 (2) 56 (3) 48 (4) 52 (5) 45
4. $\frac{1}{7}(6785.2 \div 9.999 \times 9.5 + 8967.89 \div 9) = ?$
(1) 2015 (2) 1112 (3) 1965 (4) 1895 (5) 1785
5. $\sqrt[3]{5831} \times 39.86 + \sqrt{15129} + 22022.2 \div 11 = ?^2$
(1) 42 (2) 59 (3) 48 (4) 33 (5) 53

Direction (6-10): Study the following line graph and table carefully and answer the given questions.

Line graph shows the speed of two Cars P and Q in five different days and table shows the distance covered by two Cars in five different days.



Distance travelled in kms.		
Days	**P**	**Q**
Mon	100	200
Tues	140	120
Wed	150	160
Thur	120	180
Fri	90	180

6. How much time did Car P take to complete its journey on Friday?
(1) 1 hr (2) 3 hrs (3) 5 hrs (4) 2 hrs
(5) None of these
7. What was the time taken by Car Q on Wednesday?
(1) 16 hrs (2) 15 hrs (3) 19 hrs (4) 17 hrs
(5) None of these
8. What was the average time taken by Car P in all the five days?
(1) 10 hrs (2) 21 hrs (3) 15 hrs (4) 12 hrs
(5) None of these
9. What was the average distance travelled by Car P and Q on Thursday?
(1) 120 km (2) 180 km (3) 300 km (4) 150 km
(5) None of these
10. What was the difference between time taken by Car Q on Wednesday and Car P on Friday?
(1) 30 hrs (2) 11 hrs (3) 6 hrs (4) 12 hrs
(5) None of these

Direction (11-15) : What should come in place of the question mark (?) in the following number series ?

11. 16 37 75 140 ? 416
(1) 240 (2) 247 (3) 250 (4) 230 (5) 220
12. 50 44 52 80 134 220 ?
(1) 344 (2) 264 (3) 256 (4) 244 (5) 324
13. 1115 608 355 229 166.5 ?
(1) 134.50 (2) 135 (3) 135.30
(4) 135.75 (5) None of these
14. 220 219 223 196 212 (?)
(1) 138 (2) 87 (3) 127 (4) 327
(5) None of these
15. 62 74 98 134 182 ?
(1) 232 (2) 233 (3) 222 (4) 223
(5) None of these
16. Ramesh sells 56 litre milk and water mixture, where ratio between milk and water is 5 : 2. He replaces 21 litre milk and water are mixture with a milk, water and honey mixture in the ratio of 3 : 2 : 2, then he pours the newly formed mixture completely in a container that contains some water and honey mixture, where ratio between water and honey is $a : b$. If the final ratio between milk, water and honey is 17 : 9 : 4, then what is the value of $a : b$?
(1) 7 : 2 (2) 1 : 1 (3) 3 : 2 (4) 3 : 1
(5) None of these
17. Javed and Bipin started a business in partnership investing ₹ 30,000 and ₹ 25,000



B. Krishna Kishore
Senior Faculty
Dimensions Coaching
Centre, Guntur.

RRB, PO's Special

respectively. After five months, Deepak joined them with ₹ 12,000. If Bipin's share in total profit is ₹ 15,000 at the end of 10 months from the starting of the business, then find the share of Deepak in profit.
(1) ₹ 3500 (2) ₹ 3600 (3) ₹ 4200 (4) ₹ 4500
(5) None of these

18. A tank of capacity 60 litres has two inlets(of same capacity) and one outlet pipes . When all the three are opened together, it takes 8 min to fill the cistern. If the outlet flow rate is increased 1.5 times, the tank is never filled. Find the minimum flow rate of the outlet for this to happen.
(1) $\frac{45}{4}$ litres/min (2) 15 litres/min
(3) 12 litres/min (4) 16 litres/min
(5) $\frac{27}{2}$ litres/min

Hints & Solutions

(1-5) :

1. (4) 34.95% of 499.99 – 20.24% of 1599 + ? = 59.99
$\Rightarrow \frac{35}{100} \times 500 - \frac{20}{100} \times 1600 + ? \approx 60$
$\Rightarrow 175 - 320 + ? = 60$
$\Rightarrow ? = 320 + 60 - 175 = 205$

2. (4) 7839.03 ÷ 6.99% of 879.9 + 618.14 = ?
$\Rightarrow ? \approx 7839 \div \frac{7}{100} \times 880 + 618$
$= 7839 \times \frac{100}{880 \times 7} + 618$
$= 127.25 + 618 = 745.25 \approx 744$

3. (5) $\sqrt{2499} \times \sqrt{730} \div \sqrt{899}$
$\approx 50 \times 27 \div 30 = 45$

4. (2) $\frac{1}{7}(6785.2 \div 9.999 \times 9.5 + 8967.89 \div 9)$
$\approx \frac{1}{7}(6785 \div 10 \times 10 + 8968 \div 9)$
$= \frac{1}{7}(6785 + 996.44)$
$= \frac{1}{7} \times 7781.44 = 1111.63 \approx 1112$

5. (5) $\sqrt[3]{5831} \times 39.86 + \sqrt{15129} + 22022.2 \div 11 = ?^2$
$\Rightarrow ?^2 \approx 18 \times 40 + 123 + 22022 \div 11$
$\Rightarrow ?^2 = 720 + 123 + 2002$
$\Rightarrow ?^2 = 2845 = 53.33 \approx 53$

(6-10) :

6. (3) Required time = $\frac{90}{18}$ = 5 hrs.

7. (1) Required time = $\frac{160}{10}$ = 16 hrs.

8. (2) Required average
$= \frac{\frac{100}{5} + \frac{140}{7} + \frac{150}{3} + \frac{120}{12} + \frac{90}{18}}{5}$
$= \frac{20 + 20 + 50 + 10 + 5}{5} = \frac{105}{5}$ = 21 hrs.

9. (4) Required average
$= \frac{120 + 180}{2} = \frac{300}{2}$ = 150 km

10. (2) Required difference
$= \frac{160}{10} - \frac{90}{18}$ = 16 – 5 = 11 hrs.

(11-15) :

11. (2) The number series is :
16 37 75 140 **247** 416
+21 +38 +65 +107 +169
+17 +27 +42 +62
+10 +15 +20

12. (1) The number series is :
$1^3 + 7^2 = 50$
$2^3 + 6^2 = 44$
$3^3 + 5^2 = 52$
$4^3 + 4^2 = 80$
$5^3 + 3^2 = 134$
$6^3 + 2^2 = 220$
$7^3 + 1^2 =$ **344**

13. (4) The number series is :
1115 608 355 229 166.5 **135.75**
–507 –253 –126 –62.5 –30.75
+254 +127 +63.5 +31.75

14. (2) The number series is :
$220 + (1)^3 = 219$
$219 + (2)^3 = 223$
$223 + (-3)^3 = 196$
$196 + (4)^3 = 212$
$212 + (-5)^3 =$ **87**

15. (5) The number series is :
62 + 12 = 74
74 + (12 × 2) = 98
98 + (12 × 3) = 134
134 + (12 × 4) = 182
182 + (12 × 5) = **242**

16. (2) Ramesh sells 56 litre milk and water mixture, where milk: water = 5 : 2.
∴ Amount of milk = 40 litre & water = 16 litre
He replaces 21 litre milk and water mixture.
Amount of milk removed = 15 litre & water removed = 6 litre.
New amount of milk = (40 – 15) = 25 litre
New amount of water = (16 – 6) = 10 litre
He adds milk, water and honey mixture in the ratio of 3 : 2 : 2 (21 litre).
Amount of milk added = 9 litre
Amount of water added = 6 litre
Amount of honey added = 6 litre
New amount of milk, water and honey are respectively 34 litre, 16 litre, 6 litre.
It is poured in a container that contains some water honey mixture where water: honey = $a : b$.
Then we can say, the container initially contains ak litre & bk litre of water & honey respectively.
So, 34 : (16 + ak): (6 + bk) = 17: 9 : 4 = 34 : 18 : 8
$\Rightarrow ak$ = 2 litre & bk = 2 litre
$\Rightarrow a : b = 1 : 1$

17. (2) Ratio of share in profit = 3000 × 10 : 25000 × 10 : 12000 × 5
Total amount = $\frac{61}{25}$ × 15000 = ₹ 36600
Share of Deepak in profit = $\frac{6}{61}$ × 36600
= ₹ 3600

18. (2) Given, tank of capacity 60 litres has two inlets and one outlet.
Let the flow rate of inlet be 'a' litres/min and flow rate of outlet be 'b' litres/min
Now, when all the three are opened together, it takes 8 min to fill the cistern.
$\Rightarrow 8(2a - b) = 60$
$\Rightarrow 2a - b = \frac{15}{2}$ ....(i)
Given, if the outlet flow rate is increased 1.5 times, the tank is never filled.
Thus, the flow rate of outlet becomes greater than the inlet.
$\Rightarrow 1.5\,b \geq 2\,a$
$\Rightarrow b \geq \frac{4a}{3}$
Thus, minimum $b = \frac{4a}{3}$
Substituting in equation (i)
$\Rightarrow 2a - \frac{4a}{3} = \frac{15}{2}$
$\Rightarrow \frac{2a}{3} = \frac{15}{2}$
$\Rightarrow a = \frac{45}{4}$ litres/min
$= 4 \times \frac{45}{12}$ = 15 litres/min
Thus, $b = \frac{4a}{3}$

ఉద్యోగాలు

హెచ్ఏఎల్

బెంగళూరులోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)- **గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌షిప్ & డిప్లొమా టెక్నీషియన్స్ అప్రెంటిస్‌షిప్** కోసం దరఖాస్తులు కోరుతోంది.
గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్ విభాగాలు: ఏరోనాటికల్/ ఏరోస్పేస్ / కెమికల్/ సివిల్/ కంప్యూటర్ ఇంజనీరింగ్/ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ / ఇన్ఫర్మేషన్ & ఇంజనీరింగ్/ ఐటీ/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రికల్ & కమ్యూనికేషన్/ ఏవియానిక్స్/ ఎలక్ట్రానిక్స్& టెలి కమ్యూనికేషన్స్/ ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్/ టెలికమ్యూనికేషన్/ /మెకానికల్/ ఇండస్ట్రియల్/ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్/ ప్రొడక్షన్ / మెటలర్జీ & మెటీరియల్ సైన్స్/ ఫౌండ్రీ టెక్నాలజీ
అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉండాలి.
డిప్లొమా టెక్నీషియన్స్ అప్రెంటిస్ విభాగాలు: ఏరోనాటికల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్/సివిల్/ కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ /ఇన్ఫర్మేషన్ సైన్స్ & ఇంజనీరింగ్/ కమర్షియల్ ప్రాక్టీస్ / మెటలర్జీ ఇంజనీరింగ్
అర్హత: ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత + ప్రొవిజనల్ డిగ్రీ సర్టిఫికెట్ ఉండాలి
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 22, 2017
వెబ్‌సైట్: http://115.254.50.170/tti

ఎంజీఎన్ఆర్ఈజీఏ

మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ (ఎంజీఎన్ఆర్ఈజీఏ) పథకం కోసం కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు.
మొత్తం ఖాళీలు: 77
పోస్టుల వారీ ఖాళీలు: జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ 69, అకౌంట్ అసిస్టెంట్ 8
అర్హత: డిప్లొమా/ గ్రాడ్యుయేషన్/ ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి
వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతనం(నెలకు): జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.8,000, అకౌంట్ అసిస్టెంట్‌కు రూ.13,000
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
వెబ్‌సైట్: dungarpur.rajasthan.gov.in

రైల్‌టెల్ కార్పొరేషన్

రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 50
పోస్టులు: ప్రాజెక్ట్ డైరెక్టర్/ ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్ట్ 2, సీనియర్ ఆర్కిటెక్ట్(ఒఎస్/ సర్వర్/ హార్డ్‌వేర్) 2, సీనియర్ ఆర్కిటెక్ట్ 1 (డేటాబేస్ అడ్మిన్), సీనియర్ ఇఆర్‌పి టెక్నో ఫంక్షనల్ (ఒరాకిల్) 1, టెక్నికల్ లీడ్(శాప్/ డాట్‌నెట్/ ఆండ్రాయిడ్ అప్లికేషన్స్/ జావా డెవలపర్/ నెట్ వర్క్ బ్యాండ్ విడ్త్) 14, టెక్నికల్ కన్సల్టెంట్ 25, ఆఫీస్ అడ్మిన్ (కో ఆర్డినేటర్ /ట్రైనింగ్ మేనేజర్) 2
అర్హత: బీఈ/ బీటెక్/ ఎంసీఏ/ బీసీఏ
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 22, 2017
వెబ్‌సైట్: www.railtelindia.com

అడ్మిషన్స్

గీతం యూనివర్సిటీ

గీతం యూనివర్సిటీ-స్కూల్ ఆఫ్ నర్సింగ్ బీఎస్సీ (నర్సింగ్) కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించే **'గీతం నర్సింగ్ అడ్మిషన్ టెస్ట్ (జీనాట్)- 2017'**కు ప్రకటన విడుదల చేసింది. ఈ కోర్సుకు ఇటీవలే ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు లభించింది.
సీట్ల సంఖ్య: 100
అర్హత: 45 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ (బైపీసీ) లేదా ఇంటర్మీడియెట్ ఒకేషనల్ నర్సింగ్ కోర్సు.
జీనాట్-2017 పరీక్ష తేదీ: ఆగస్టు 28, 2017
దరఖాస్తు ఫీజు: రూ.300
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 14, 2017
వెబ్‌సైట్: www.gitam.edu

ఊరటనిచ్చిన వర్షం

ఇచ్ఛాపురం: ఉదయం పూట ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు శనివారం సాయంత్రం గంట పాటు కురిసిన వర్షంతో సేద తీరారు. 33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులతో మధ్యాహ్నం వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు వర్షం పడడంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షానికి రోడ్లు, కాలువలు జలమయమయ్యాయి.





చంద్రన్న బీమా అందిస్తున్న కమిషనర్ రవిబాబు

కాలువులను బాగు చేస్తాం

ఇచ్ఛాపురం : మున్సిపాలిలోని అన్ని వార్డుల్లో కాలువలు బాగు చేస్తామని మున్సిపల్ కమిషనర్ రవిబాబు అన్నారు. శనివారం ఆయన బెల్లుపడ కాలనీలో కాలువలను పరిశీలించా రు. కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయించామని, టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు చేపడతామని కమిషనర్ చెప్పారు.

చంద్రన్న బీమా పంపిణీ

● బెల్లుపడ కాలనీకి చెందిన గవలపు సుజాత అనారోగ్యంతో మృతి చెందడంతో నామినీగా ఉన్న ఆమె తల్లి నాగరత్నంకు చంద్రన్న బీమా ద్వారా రూ.5వేలు అందజేశారు. మిగతా రూ.25 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని కమిషనర్ రవిబాబు తెలిపారు. కౌన్సిలర్ పార్వతీశం, బీమామిత్ర సునీత, ఆర్పీ శ్రీదేవి, జాన్సీ, కుమారి పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



తిరుపతిని సన్మానిస్తున్న దృశ్యం

సోంపేట : అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని స్థానిక సంస్కారభారతి డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత దశావధాని మద్దు తిరుపతిరావును సన్మానించారు. ఘన మూలాలు, సమస్య పూరణం, పంచమమూలం, మనసంకలనం, మెమొరీ గేమ్, దత్తభిన్నాంశం, పారగణన, గణిత చదరంగం, సరస ప్రసంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ వై.దేవరాజు, కరస్పాండెంట్ నిమ్మన దాసు, డైరెక్టర్ బి.శ్రీనుబాబు, ప్రిన్సిపాళ్ల బి.కవిబాబు, బి.శ్రీరామమూర్తి, ఏవో పాపారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు 'ఉపాధి' కల్పించండి

కవిటి: పంచాయతీలోని అన్ని గ్రామాలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని సర్పంచ్ పి.శేఖర్ అన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం 8 గ్రామాలకు మాత్రమే పనులు కల్పించి మిగిలిన 10 గ్రామాలను పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. 63 గ్రూపులకు కేవలం 28 గ్రూపులకు మాత్రమే పనులు కల్పించారని తెలిపారు. డీఆర్పీ మధులత మాట్లాడుతూ, ఉపాధి రికార్డు నిర్వహణ సక్రమంగా లేదన్నారు. కొన్ని పనులకు సంబంధించిన ఫొటోలు అతికించలేదన్నారు. 2,151 జాబ్ కార్డులు ఉంటే కేవలం 125 కుటుంబాలకు మాత్రమే పనులు కల్పించారన్నారు. భర్త ఉండగా వితంతు పింఛన్లు పొందుతున్న వారు పది మంది, తక్కువ వయసుతో వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నవారు 14మంది ఉన్నట్టు ఆడిట్‌లో గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో డి.సుదర్శనరావు, ఎంపీటీసీ సభ్యుడు వై.దుర్యోధన, ఎస్ఆర్పీ తిరుమలరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ శేఖర్

జగన్ ఫ్యాక్షనిజం బయటపడింది



నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న ఎంపీపీ ఢిల్లీరావు

కంచిలి: వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నంద్యాలలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు ప్రతిపక్షనేత ఫ్యాక్షనిజాన్ని బయటపెట్టాయని స్థానిక టీడీపీ నాయకులు ఆరోపించారు. జగన్ తీరుకు నిరసనగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా తెలుగు యువత మండల అధ్యక్షుడు బి.కామేష్‌రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తిని నడిరోడ్డుపై కాల్చి చంపాలన్న జగన్ వ్యాఖ్యలు కిరాయి గూండాల మాదిరిగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్మాదిలా ప్రవర్తించడాన్ని జగన్ మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యులు మాదిన రామారావు, సనపల కామేశ్వరరావు, పి.పురుషోత్తంరెడ్డి, బి.లక్ష్మీనారాయణ, టి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: వైసీపీ అధినేత జగన్‌కి మతి భ్రమించిందని టీడీపీ నేత దక్కత ఢిల్లీరావు అన్నారు. శనివారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జన్మభూమి కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. రాబోయే ఎన్నికల్లో కూడా టీడీపీ విజయం సాధిస్తుందని తెలిసి జగన్ పిచ్చివాడిలా ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఎ.లింగరాజు, ఏఎంసీ ఛైర్మన్ ఎస్.సహదేవ్ రెడ్డి, వైస్ఎంపీపీ ఎం.నారాయణ, నాయకులు ఎల్.పద్మనాభం, ఎస్.ఢిల్లీరావు, డి.కామేష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని ఖండించారు. శనివారం విలేఖరులతో మాట్లాడుతూ, ప్రతిపక్ష నాయకుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. జగన్‌కు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని నాశనం చేస్తారని విమర్శించారు. ఇకనైనా మారాలని, లేదంటే ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు తులసీదాస్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, కొండా శంకర్‌రెడ్డి, లీలారాణి, డి.విశ్వనాథరెడ్డి, లోహిదాస్‌రెడ్డి, నాగరాజు పాత్రో, కె.ధర్మా, ఆర్.శ్రీను, బి.కృష్ణయ్య పాల్గొన్నారు.

అశోక్‌వి బూటకపు మాటలు: నర్తు

కవిటి : అసత్య ప్రకటనలు, బూటకపు మాటలతో ఎమ్మెల్యే అశోక్ నియోజక వర్గ ప్రజలను మోసం చేస్తున్నారని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నర్తు రామారావు ఆరోపించారు. శనివారం కవిటిలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన పనులకు ప్రారంభోత్సవాలు చేసి ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలోనే కళింగపట్నం బ్రిడ్జి, ఒంటూరు, మాణిక్యపురం బ్రిడ్జిలను నిర్మించిన విషయాన్ని మరిచిపోయారా? అని ప్రశ్నించారు. బొడ్డబడ బ్రిడ్జికి సైతం కాంగ్రెస్ ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే, తామే ఈ పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నారని నర్తు దుయ్యబట్టారు. 2014 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ఎంత వరకు నెరవేర్చారో నిజాయితీగా చెప్పాలన్నారు. మసిపూసి మారేడు కాయ చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు పి.శ్రీరాములు, బి.భాస్కర్, శ్రీనివాస్, వై.నీలయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్తు రామారావు

ప్రజా సమస్యలపై పోరాడే నేతలను కాపాడుకోవాలి

సోంపేట : ప్రజా సమస్యలపై పోరాడే నేతలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు వై.కృష్ణమూర్తి, బీన ఢిల్లీరావు అన్నారు. సోంపేటలో వారు శనివారం విలేఖరులతో మాట్లాడారు. నర్మదా నదిపై డ్యామ్ ఎత్తును పెంచడంతో 40 వేల మంది నిర్వాసితులు అవుతున్నారని, వీరికి న్యాయం చేయాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 11 మంది రైతులతో ప్రజా ఉద్యమ నేత మేధాపాట్కర్ పోరాటం సాగిస్తున్నారన్నారు. అయితే, మేధాపాట్కర్ ఆరోగ్యం క్షీణిస్తున్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ విషయంలో ప్రజలు, ప్రజా సంఘాలు, మేధావులు స్పందించాలని కోరారు. సమావేశంలో బార్ల సుందరరావు, తుంగాన గంగ, తెలుకుల తిరుపతి, వైశ్యరాజునాగు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీపీఎస్ నాయకులు

నాణ్యమైన విద్యుత్ సరఫరా

● డీఈఈ గిరీశ్వరరావు

టెక్కలి: వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ముందున్న కర్తవ్యమని విద్యుత్ శాఖ డీఈఈ ఇ.గిరీశ్వరరావు చెప్పారు. శనివారం ట్రాన్స్‌కో డీఈఈ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం కలిగితే 24 గంటలు పనిచేసే టోల్‌ఫ్రీ నెంబర్(1912)కు ఫోన్ చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో దీనదయాళ్ గ్రామీణ ఉపాధ్యాయ జ్యోతి యోజన కింద నాలుగు సబ్‌స్టేషన్ పనులు(నందిగాం మండలం కొత్తగ్రహారం, నరసన్నపేట మండలం దేవాది, సోంపేట మండలం బుసభద్ర, ఇచ్ఛాపురం మండలం ఈదుపురం) చురుకుగా సాగుతున్నాయని, 2018 మార్చి నాటికి పూర్తి కానున్నాయన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ పవర్ డవలప్‌మెంట్ స్కీం కింద కాశీబుగ్గలో సబ్‌స్టేషన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏ, బీ స్విచ్‌ల కొరత రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరాన్ని బట్టి కండక్టర్లు మారుస్తున్నామని తెలిపారు. ఏడు శాతం ఉన్న లైన్‌లాస్‌ను తగ్గించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఇళ్లకు విద్యుత్ సరఫరాకు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి అభ్యంతరాలు లేకపోతే 24 గంటల్లో కనెక్షన్ అందజేస్తామన్నారు. ఆయన వెంట ఏఈ పైల నారాయణరావు ఉన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడవద్దు

నందిగాం: ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలని టెక్కలి మున్సిఫ్ మెజిస్ట్రేట్ పి.శ్రీనివాస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన నందిగాం ఆదిత్య కళాశాల, బాలికల సాంఘిక సంక్షేమ గురుకులాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి మాట్లాడారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ నేర ప్రవృత్తితో కూడుకున్నవని, వీటి జోలికి పోకుండా బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు.

అధికారుల ఫోన్‌నెంబర్లు

తహసీల్దార్:	
ఎం.సురేష్	83398-87881
ఎంపీడీవో	
పి.రామకృష్ణ	8790007929
వ్యవసాయ అధికారి	
బి.నరసింహమూర్తి	8886612652
మండల విద్యాశాఖాధికారి	
ఎం.మురళీకృష్ణ	9441729951
మున్సిపల్ కమిషనర్	
పి.రవిబాబు	9849905782
ఏఈ (హౌసింగ్)	
కె.రాజగోపాల్	7093930228
మండల ఇంజనీరింగ్ అధికారి	
ఆర్. డొళాయ్	9553520599
ఏఈ (రూరల్ వాటర్ సప్లై)	
ఎ.మురళీకిషోర్	7702113335
పశువైద్యాధికారి	
టి.శిరీష	8790996646
వెలుగు ఏపీఎం	
ఎస్.ప్రసాద్	8008803897
ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో	
ప్రమీలా	8790007651
ఆర్అండ్‌బీ జేఈ	
రవికాంత్	9440459129
ఐసీడీఎస్ పీవో	
డి.నాగమణి	9618104943
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	
బి.మంగమ్మ	9980425792
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	
ఎం.రూపావతి	9441249767

ఇచ్ఛాపురం

సినిమాలు

సోంపేట
శ్రీనివాస.. నక్షత్రం
శివ...... మాయామాల్

ఇచ్ఛాపురం
పూర్ణ .... ఫిదా
శ్రీమణికంఠ.... నక్షత్రం

కవిటి
మహాలక్ష్మి.. నక్షత్రం
అశోక్..... ఫిదా

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఇచ్ఛాపురం : పట్టణంలోని గిలాయివీధి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. గులాబీలు, తులసి ఆకులతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అధిక సంఖ్యలో మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. స్థానిక కళాకారులు భజన చేపట్టారు.



తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



బెల్లుపడకాలనీలో గర్భిణులకు సీమంతాలు, ర్యాలీ చేస్తున్న అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మాణిక్యపురంలో సామూహిక సీమంతాలు

ఇచ్ఛాపురం: తల్లిపాలతో చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ పి.ర విబాబు అన్నారు. శనివారం రత్నకన్న సెక్టార్ పరిధిలోని బెల్లుపడకాలనీ అంగన్‌వాడీ ప్రీస్కూల్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కమిషనర్ రవిబాబు మాట్లాడుతూ, తల్లిపాలు పిల్లలకు అమృతంతో సమానం అన్నారు. దీనిపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు.అనంతరం బెల్లుపడకాలనీలో తల్లిపాల ఆవశ్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పార్వతీశం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉషారాణి, ఈశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి రూరల్ : తల్లిపాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని జల్లుపుట్టుగ, మాణిక్యపురం, ఇద్దివానిపాలెంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ, తల్లిపాలలో ఉన్న పోషకాలు మరెందులో కూడా ఉండవని, ఈపాలతోనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యం ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి: తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధన టీకాలా పని చేస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీవో డి.సుదర్శనరావు అన్నారు. శనివారం కవిటిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ చేపట్టారు. పుట్టిన 6 నెలల వరకూ తల్లిపాలే బిడ్డకు అందించాలని, ఇందులో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుం దని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.శేఖర్, ఎంపీటీసీ సభ్యుడు వై.దుర్యోధన, పి.నీలాచలం, రాజుబెహర, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: తల్లిపాలు అమృతంతో సమానం అని లొద్దపుట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి అన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ శనివారం లొద్దపుట్టిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిపాలతో శిశువులు ఆరోగ్యంగా తయారవుతారని, ఎదుగుదల కూడా ఉంటుందని తెలిపారు. తల్లిపాలలో అధిక మోతాదులో పోషకాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బాలామణి, డిల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయుడు అనంతాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



కవిటి, లొద్దపుట్టిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు



అధికారుల కోసం వేచి చూస్తున్న సర్పంచ్,వార్డుసభ్యులు

సోంపేట పంచాయతీ సమావేశం వాయిదా

● *అధికారులు రాకపోవడమే కారణం*

సోంపేట: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదాపడింది. అధికారులు రాకపోవడంతో ఈ నెల 9కి వాయిదా వేశారు. ఉదయం పది గంటలకు సర్పంచ్ చిత్రాడ నాగరత్నం అధ్యక్షతన సమావేశం ప్రారంభమయ్యింది. అయితే, అధికారుల కోసం వేచిచూసి వారు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ఈవో జ్యోతిరెడ్డి, వార్డు మెంబర్లు చిత్రాడ శేఖర్, జోగుపల్లి దానయ్య, జాక గోపి పాల్గొన్నారు.

వెయ్యిమంది రైతులకు ఈ పాస్ పుస్తకాలు



వీఆర్వోలకు ఈ పాస్ పుస్తకాలు అందిస్తున్న తహసీల్దార్

ఇచ్ఛాపురం: రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు మండలం, మున్సిపాల్టీలోని వెయ్యిమంది రైతులకు ఈపాస్ పుస్తకాలు అందజేసినట్టు తహసీల్దార్ సురేష్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో రెవెన్యూ సభలు నిర్వహించి భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. వీటిపై సకాలంలో విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఆదేశించారు. గ్రామాల్లోకి వెళ్లి రైతులకు నేరుగా ఈపాస్ పుస్తకాలు అందజేయాలని సూచించారు. అనంతరం పలువురు రైతులకు సంబంధించిన ఈపాస్ పుస్తకాలను వీఆర్వోలకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణప్రసాద్‌రావ్, వీఆర్వోల సంఘ ం అధ్యక్షుడు రాజారెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల రక్షాబంధన్

కంచిలి: స్థానిక బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శనివారం రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఇప్పిలి లోలాక్షి, వైసీపీ నాయకుడు ఇప్పిలి కృష్ణారావు, తెలుగు యువత అధ్యక్షుడు బి.కామేష్‌రెడ్డికు రాఖీలను కట్టి శుభాకాంక్షలు తెలిపారు.



రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

బిర్లాంగిలో 'వనం-మనం'

బిర్లాంగి(ఇచ్ఛాపురం రూరల్): మండలంలోని బిర్లాంగిలో ఎంపీపీ దక్కత డిల్లీరావు ఆధ్వర్యంలో వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు కురిసి పంటలు సుభిక్షంగా పండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీపీ డిల్లీరావు అన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఎస్.ప్రమీలా, టెక్నికల్ అసిస్టెంట్ డి.కామేష్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంపీపీ డిల్లీరావు

తీరిన తాగునీటి కష్టాలు

● **రూ.50వేలతో పాఠశాలలో బోరు ఏర్పాటు**



మోటార్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

లొద్దపుట్టి(ఇచ్ఛాపురం రూరల్): మండలంలోని లొద్దపుట్టి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తాగునీటి కష్టాలు తీరాయి. గ్రామస్థుల సహకా రంతో బోరు తవ్వి దానికి మోటార్‌ను అమర్చారు. రూ.50వేలను దీనికోసం ఖర్చు చేశారు. శనివారం సర్పంచ్ ప్రతినిధి ఆర్.దేవరాజు ఉపాధ్యాయులతో కలిసి మోటార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నిమ్మయ్య మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు సహకరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణపతి, నిరీక్షణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రాధాన్యం

ఇస్కలపాలెం (సోంపేట): ప్రభుత్వం బాలికావిద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్ అన్నారు. శనివారం ఇస్కలపాలెం ఉన్నతపాఠశాల బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.కుమారి, బి.బాబూరావు, వి.కామేష్, బి.పున్నయ్య, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ముచ్చింద్ర విద్యార్థులకు ఆట వస్తువులు

ఇచ్ఛాపురం : మండలంలోని ముచ్చింద్ర పాఠశాల విద్యార్థులకు పురుషోత్తపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు దుక్క లోకేశ్వరరెడ్డి ఆటవస్తువులను అందజేశారు. క్యారమ్ బోర్డ్, వాలీబాల్, టెన్నీస్ బాల్స్, క్రికెట్ బ్యాట్‌ను అందించారు. విద్యార్థులు ఆటలపై ఆసక్తి కనబరిచేందుకు వీటిని అందజేసినట్టు ఆయన చెప్పారు. సీఆర్‌పీ మోహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

రామయ్యపుట్టుగ(కవిటిరూరల్): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు మణి చంద్రప్రకాష్ అన్నారు. శనివారం రామయ్యపుట్టుగలో టీడీపీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. వీటిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి అర్హులకు అందేటట్టు చూడాలన్నారు. ప్రతినెల 9న గ్రామస్థాయి సమావేశం, 14న మండల స్థాయి సమావేశం నిర్వహించాలన్నారు. తద్వారా ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రమేష్, మాజీ ఎంపీపీ బెందాళం ప్రకాష్, సర్పంచ్‌లు శేఖర్, ఎం.కృష్ణ, టీడీపీ జనరల్ సెక్రటరీ గంటి శ్రీను, నాయకులు హత్తి భీమారావు, విజయ్, హేమాచలం, వెంకటరమణ, రంగారావ్, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ పంచాయతీ అధ్యక్షులకు మినిట్స్ బుక్స్ అందిస్తున్న దృశ్యం

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 6

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో సృజనాత్మకంగా వ్యవహరించి సత్ఫలితాలు సాధిస్తారు. ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ పదవులు లభిస్తాయి. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): విద్యాసంస్థల్లో ప్రవేశానికి ఏర్పాట్లు చేసుకుంటారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం. బదిలీలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. రియల్‌ఎస్టేట్, ఫర్నిచర్ రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి.

మిథునరాశి:(మే21-జూన్21): ఫీజులు, స్టేషనరీ కొనుగోలుకు నిధులు సర్దుబాటవుతాయి. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. సన్నిహితుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. పూర్వమిత్రులను కలుసుకుంటారు.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): ప్రియతములు విలువైన వస్తువులు సేకరిస్తారు. స్పెక్యులేషన్స్, పెట్టుబడుల్లో నిదానం అవసరం. భాగస్వామ్యాలు లాభిస్తాయి. పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు.

సింహరాశి:(జూలై24-ఆగస్టు23): కొత్త ప్రాజెక్టుల గురించి ఆలోచిస్తారు. వైద్యం, యోగ, ధ్యానాలు, ఆహార నియమాలపై దృష్టి పెడతారు. వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక నిర్ణయాలకు తగిన సమయం కాదు.

కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): విద్యార్థులకు శుభప్రదం. విదేశీ విద్య కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులపై దృష్టి సారిస్తారు. ప్రియతములకు సంబంధించిన ఒక సమాచారం కలవరం కలిగిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): భూమి లావాదేవీలకు అనుకూలం, నిర్మాణరంగం వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. బంధు మిత్రుల కలయికతో ఇంట్లో సందడి నెలకొంటుంది. సమావేశాలు, ప్రదర్శనలకు ఏర్పాట్లలో అసౌకర్యం కలగవచ్చు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ప్రముఖుల సహకారంతో విద్యాసంస్థలతో పనులు పూర్తి చేస్తారు. ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు, బోధనారంగానికి చెందిన వారికి ప్రోత్సాహకరం. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఒక వార్త కలవరపెడుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): విద్య, ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. వ్యూహాత్మకంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలు, ప్రదర్శనలకు ఏర్పాట్లు చేసుకుంటారు. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): నిర్ణయాలను సమీక్షించుకుంటారు. పెట్టుబడులు, బీమా, మ్యూచువల్ ఫండ్ వ్యవహారాలపై ఒక నిర్ణయానికి వస్తారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. విలువైన వస్తువులు కొనుగోలులో జాగ్రత్త అవసరం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): రాజకీయాలు, సినిమా, టెలివిజన్ రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వామి వ్యవహారశైలి ఆవేదన కలిగిస్తుంది. ఆధ్యాత్మిక, సాహితీ ప్రముఖుల్ని కలుసుకుంటారు.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు సత్ఫలితాలనిస్తాయి. హోటల్, ఆస్పత్రులు, బ్యాంకులు, సహకార సంఘాల ఉద్యోగులకు ఆర్థికంగా ప్రోత్సాహకరం. విందు వినోదాలకు ఖర్చులు అధికం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

కోట్లలో బకాయి...ఇచ్చేదెపుడోయి?

(శ్రీకాకుళం, కలెక్టరేట్)

ఉపాధి కూలీలు అర్ధాకలితో రోజులు నెట్టుకొస్తున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు నెలలుగా వారికి వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసిన పనికి ప్రతిఫలం రాకపోవడంతో చివరికి ప్రభుత్వం చేతులెత్తేస్తుందేమోనన్న భయం కూలీలను వెంటాడుతోంది. నిరుపేదలకు జీవనాధారం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకం ప్రవేశపెట్టింది. దీని ద్వారా కోట్ల మంది నిరుపేదలకు ఉపాధి అందేది. కష్టపడి పనిచేసి పొట్ట నింపుకుందామనుకునే కూలీలకు వారానికి ఒకసారి వేతనాలు చెల్లించేవారు. ఈ ఏడాది కూడా కూలీలు చెరువు, సాగునీటి కాలువల తదితర పనులు చేశారు. ప్రారంభదశలో వారానికి ఒకసారి వేతనాలు అందించినప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మే 20 నుంచి సుమారు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో పనిచేసి కూడా చేతికి కూలీ అందక వేతనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోట్లకు చేరిన బకాయిలు

జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 42 వేల సంఘాలున్నాయి. 5,60,638 మంది జాబ్‌కార్డులు పొందిన కూలీలున్నారు. జిల్లాలో మే 20 నుంచి ఇప్పటివరకు రూ. 28.24 కోట్లు వేతనాలు అందాలి. ప్రభుత్వం బకాయిలపై స్పందించకపోవడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఎండా, వాన తేడా లేకుండా కష్టపడి పనిచేసినా వేతనాలు ఎందుకు విడుదల చేయడం లేదో తెలియక అల్లాడుతున్నారు. అధికారులు మాత్రం బకాయిలపై నోరువిప్పడంలేదు.

జిల్లాలో అత్యధికంగా ఆమదాలవలస మండలంలో సుమారు రూ. 81 లక్షలు వేతన బకాయిలున్నాయి. భామిని రూ. 38 లక్షలు, బూర్జ రూ. 23 లక్షలు, జి.సిగడాం రూ. 21 లక్షలు బకాయిలున్నాయి. జిల్లాలో 38 మండలాల్లో రూ. 10 లక్ష నుంచి 20 లక్షల వరకు వేతన బకాయిలున్న మండలాలే అధికం. గ్రామాల్లో చాలా మంది వృద్ధాప్యంలో ఉన్న కూలీలున్నారు. వీరికి కుటుంబ సభ్యుల నుంచి ఆదరణ లేకపోవడంతో ఉపాధి పనులకు వెళ్లి వచ్చిన మొత్తంతో జీవనం సాగించేవారు.

సమస్యగా మారిన బకాయిలు

ఆన్‌లైన్ సమస్య, ఆధార్‌కార్డు అనుసంధానం కాకపోవడం, కొత్తగా ఉపాధి జాబ్‌కార్డు పొందడం తదితర సమస్యలకు సంబంధించి మే నెలకు ముందు వేతనాలు అందని కూలీలు కూడా ఉన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది చేసిన తప్పులతో వేతనాలు అందని ద్రాక్షగానే మారాయి. చాలా చోట్ల క్షేత్ర సహాయకులు లేక మేట్లతోనే ఆన్‌లైన్ విధానం చేయిస్తున్నారు.. వీరిలో కొందరికి అవగాహన లేక వేతనాలు అందని పరిస్థితి ఉంది.

ప్రభుత్వం నుంచి రావాలి

జిల్లాలో మూడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందని విషయాన్ని జిల్లా నీటియాజమాన్య సంస్థ సంచాలకుడు హెచ్.కూర్మారావు వద్ద ప్రస్తావించగా... బకాయిలున్న మాట వాస్తవమేనని, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు. వచ్చిన వెంటనే చెల్లిస్తామని బదులిచ్చారు.

అమ్మ గుండె చెరువై... భార్య గుండె బరువై!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి పడవలో అవతలి ఒడ్డుకు చేరుకోవాలని ఉదయాన్నే అక్కడకు చేరుకున్నాడు. అప్పటికే పడవ సగం దూరం వెళ్లిపోయింది. 'మీరు పడవ వచ్చిన తరువాత రండి...నేను ముందుగా వెళ్తా'నని తన దగ్గర ఉన్న వస్తువులను భార్య జ్యోతి చేతికి ఇచ్చి...నదిలోకి దిగాడు. సగం దూరం ఈదుకుంటూ వెళ్లిన తరువాత ఒక్కసారిగా 'నన్ను రక్షించండ'ంటూ కేకలు వేశాడు. ఒడ్డున ఉన్న వారు అతని మాటలను అర్థం చేసుకునే సరికే పరిస్థితి చేయి దాటిపోయింది. కొద్దిసేపటికే మునిగిపోయాడు. తీరంలో ఉన్నవారు రక్షించడానికి వీలు లేకపోయింది. కళ్లెదుటే రమణ గల్లంతవ్వడం చూసి భార్య జ్యోతి, తల్లి శార్వాణి షాక్‌కు గురయ్యారు. నోట మాట రాక కుప్పకూలిపోయారు. రమణకు ముగ్గురు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న గోనెపాడువాసులు పెద్దఎత్తున తీరానికి చేరుకున్నారు. కొత్తూరు అగ్నిమాపక సిబ్బందితో పాటు కుటుంబ సభ్యులు నదీ తీర గ్రామాల్లో ఆయన ఆచూకీ కోసం వెతుకుతున్నారు. సరుబుజ్జిలి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పర్యవేక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనీస సూచిక బోర్డులేవీ...

అష్టతీర్థ రాజమహాయోగ స్నానాలు ఐదురోజులుగా సాగుతున్నాయి. కానీ ఈ ఘటన యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తీర్థస్నానాలకుగాను చేసిన ప్రచారానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేయలేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాలకు చెందిన వారు తీర్థస్నానాలకు వెళ్తాలంటే ఎల్ఎన్‌పేట మండలం దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట రేవుల వద్ద వంశధార నదిని దాటి వెళ్లాలి. ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. రేవుల వద్ద కనీస హెచ్చరిక బోర్డులు... ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. దీంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్తీకమాసం, శివరాత్రి పర్వదినాల్లోనైనా ఇక్కడ సూచిక బోర్డులతో పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

గోనెపాడులో విషాదం

గోనెపాడులో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన రమణ వంశధార నది లో గల్లంతు కావడంతో కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రమణ గల్లంతైన కొద్దిసేపటికే విషయం గ్రామంలో తెలియడంతో వారంతా వాడవలస తీరానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బందితో పాటు వెతుకులాట ప్రారంభించారు. అందరితో కలివిడిగా ఉండే రమణ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ముగ్గురు కుమారులను కష్టపడి చదివిస్తున్నాడని గ్రామస్థులు చెప్పారు. ఇంతలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రమణ ఆచూకీ కోసం గ్రామస్థులు నది వద్ద ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

మిన'హాయి'ంపు

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు సంబంధించి కీలక ప్రకటన చేశారు. దీనికి విధివిధానాలు, మార్గదర్శకాలు త్వరలో రూపొందిస్తామని చెప్పారు. దీంతో పేదల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్ణయంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు పన్నుపోటు నుంచి ఊరట లభించనుంది. ఇది అమలైతే శ్రీకాకుళం జిల్లాలో దాదాపు 4 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలిగే అవకాశముంది.

● **జిల్లా స్థితిగతులు ఇవీ...**

పురపాలక సంఘాలను మినహాయిస్తే జిల్లాలో మొత్తం 38 మండలాల్లో 1100 పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 3వ550 ఆవాస ప్రాంతాలు (హేబిటేషన్లు) ఉన్నాయి. 2011 లెక్కల ప్రకారం జనాభా 27 లక్షల 3 వేల 114 మంది. కుటుంబాలు 5 లక్షల 45 వేలు. వీరిలో 70 శాతం దారిద్ర్యరేఖకు దిగువనున్నవారే. రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో దాదాపు 4 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. ఇప్పటివరకూ ఏటా రూ.45 కోట్లు ఇంటి పన్నుల రూపంలో వసూలు కావాల్సి ఉంది. కానీ పూర్తిస్థాయిలో వసూలైన దాఖలాలు లేవు. కిందిస్థాయి సిబ్బందికి లక్ష్యాలనిచ్చి ఏదోలా వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటిపన్ను పేద వర్గాలకు భారంగా మారుతోంది. మరో పక్క ఏటా ఐదు శాతం పెంచేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు పన్నులు చెల్లించేందుకు ముందుకురావడం లేదు. అధికారుల ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పన్నుల చెల్లింపు నుంచి పేదలకు మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం.

● **ఏటా పెంపుతో భారం....**

మేజర్, మైనర్ పంచాయతీల్లో పన్నుల విధానంలో 2002 నుంచి గణనీయమైన మార్పులు వచ్చాయి. అప్పట్లో గ్రామ కార్యదర్శి వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత 2003 నుంచి జీవో నెంబరు 85 ప్రకారం ఏటా పన్నులు పెంచే విధానాన్ని అమలుచేస్తున్నారు. దీనిలో భాగంగా ఇంటిపన్నుపై ఏటా ఐదు శాతం పెంచే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇది పేదలకు తలకుమించిన భారంగా మారింది. అంతకుముందు ఐదేళ్లకోసారి పన్ను పెంపు విధానం ఉండేది. ప్రతి పంచాయతీకి ప్రత్యేకాధికారి వెళ్లి అక్కడి పరిస్థితులను బట్టి పన్నులు విధించేవారు. ఆ తర్వాత అమలైన కొత్త విధానం కారణంగా ఏటా పన్నుపోటుతో ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పేదల ఇంటి పన్ను రద్దు ప్రకటన పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూర్చనుంది.

● **ప్రభుత్వ ఉత్తర్వులు రావాల్సి ఉంది**

పేదల పన్ను మినహాయింపునకు సంబంధించి ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు, ఉత్తర్వులు రావాల్సి ఉంది. దీనిపై విధి, విధానాలు వచ్చిన తరువాత ఎంత మంది పన్ను మినహాయింపు పరిధిలోకి వస్తారో మిగిలిన శాఖల సహకారంతో నిర్ణయిస్తాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ప్రక్రియలో ముందుకెళ్తాం.

-బి.కోటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి

పొలానికి నీరు కట్టేందుకు వెళ్లి...

● **మదుములో జారిపడి యువకుడు మృతి** ● **హరిశ్చంద్రపురంలో ఘటన**

హరిశ్చంద్రపురం(కోటబొమ్మాళి) : వరిచేనుకి నీరు పెట్టేందుకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తూ కాలుజారి పడి మదుములో కొట్టుకుపోయాడు. చుట్టుపక్కల ఉన్నవారు బయటకు తీసేసరికి మృత్యువాత పడ్డాడు. ఈ విషాదకర ఘటన హరిశ్చంద్రపురంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బల్లి గోవిందరావు, అలియాస్ గోపి (25) పొలానికి నీరు కట్టేందుకుగాను సమీపంలోని పెద్దచెరువు మదుము వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి పడడంతో మదుములోకి కొట్టుకుపోయాడు. అప్పటివరకూ అక్కడే ఉన్న గోపి కనిపించకపోయేసరికి స్థానికులు వెతుకులాట ప్రారంభించారు. అగ్నిమాపక సిబ్బంది, 108 సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు ఘటనాస్థలానికి చేరుకున్నారు. గోపిని బయటకు తీసేసరికి మృతిచెందాడు. అతనికి ఏడాది కిందటే సంతబొమ్మాళి మండలం బోరుభద్రకు చెందిన వరలక్ష్మితో వివాహమైంది. పదిహేను రోజుల కిందట కుమార్తె జన్మించింది. ఇంతలోనే ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో కుటుంబసభ్యుల రోదన అంతాఇంతా కాదు. అందరితో కలివిడిగా ఉండే గోపి అకాల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కోటబొమ్మాళి ఎస్ఐ జి.నారాయణస్వామి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ పూజారి శైలజ, ఎంపీటీసీ సభ్యుడు హనుమంతు అప్పలరాజు పరామర్శించారు.



గోపీ (ఫైల్‌ఫోటో)

సంఘటన స్థలం

బాధ ముంచుకొస్తుంది.. కన్నీళ్లు ఆగకుండా వచ్చేస్తుంటాయి. అంతలోనే ఓ ఆత్మీయ స్పర్శ భుజంపై మెల్లిగా తడుతుంది. ప్రేమతో మాట్లాడే ఆ నాలుగు మాటలతో.. బాధ సగం తగ్గిపోతుంది.

* * *

లంచ్ బెల్ మోగుతుంది. చెట్ల కింద అందరూ కూర్చొంటారు. గబగబా లంచ్‌బాక్సులు తెరుస్తారు. వాళ్లకు దూరంగా ఓ పిల్లోడు బాధ పడుతూ, ఒంటరిగా కూర్చొంటాడు. అటుగా చూసినా ఓ ఇద్దరు.. ఆ పిల్లోడిని గుంపులోకి తీసుకొస్తారు. ప్రేమగా గోరుముద్దలు పెడతారు. అంతే ఎక్కడలేని సంతోషం ఆ చిన్నోడి పెదాలపై వచ్చి చేరుతుంది.

* * *

జీవితం ఎటు పోతోందో తెలియదు. 'ఏం చేయాలనుకుంటున్నావు?' అని నాన్న రోజూ తిడుతుంటాడు. 'కెరీర్ సెట్ చేసుకో రా' అని అమ్మ మెల్లగా మందలిస్తుంది. ఆత్మీయులు 'నెక్స్ట్ ఏంటీ?' అని అడుగుతుంటారు. సరిగా అప్పుడే ఓ చేయి.. ఆ వ్యక్తిని పట్టుకుని.. 'ఇదే నీ దారి! ఇదే నీ జీవితం! కష్టపడు, ఇష్టపడు.. సాధించు' అంటూ దిశానిర్దేశం చేస్తుంది.

* * *



అల్లరి.. ఆనందం.. అనుబంధం

అవసరాల్లో, ఆనందంలో.. ఎప్పుడూ చేయి వీడని స్నేహితులారా! మీ కోసం మళ్లీ వచ్చేసింది.. ఓ పుట్టినరోజు! ఒక పండుగ రోజు! ఏ భేద భావం లేని మనసైన మిత్రుల 'మైత్రీ దినోత్సవం'... ఫ్రెండ్‌షిప్ డే!

జీవితంలో మిత్రులనూ, శత్రువులనూ గుర్తించడం నేర్చుకోవాలి. లేదంటే.. సమస్యల్లో చిక్కుకోవాల్సిందే. కొందరు పైకి గంభీరంగా కనిపించినా అవసరానికి ఆదుకుంటారు. ఇంకొందరు వెన్నంటే ఉంటారు, రాసుకు పూసుకు తిరుగుతారు. కానీ అవసరం వస్తే.. తప్పించుకు తిరుగుతారు. మరికొందరు.. ఆత్మీయ స్నేహితుల మధ్య చిచ్చు పెట్టి, వారిని విడదీయాలని చూస్తుంటారు. అందుకే 'స్నేహితులు తమ మధ్య అపార్థాలు రాకుండా చూసుకుంటూనే.. శత్రువుల వల్ల అనర్థాలు కలగకుండా జాగ్రత్త పడాలి'.


"కలిసిమెలిసి ఉండగలగడం, ఒకరి కోసం ఒకరు పోరాడగలగడం, అవసరమైనపుడు తీరిక లేదనో, అలసిపోయాననో అనకుండా, ఆపదలో ఆదుకోవడం - స్నేహంలో ముఖ్య లక్షణాలు."

ఐక్యరాజ్య సమితి మాజీ ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్ భార్య నానే అన్నన్ 1998లో 'ఫ్రెండిషిప్ డే'గౌరవార్థం 'విన్నీ ద పూ' అనే కార్టూన్ క్యారెక్టర్‌ని ప్రపంచపు స్నేహదూతగా (ఫ్రెండ్‌షిప్ డే అంబాసిడర్)గా ప్రకటించారు.

2011లో ఐక్యరాజ్య సమితి జూలై 30వ తేదీని 'అంతర్జాతీయ మైత్రీ దినోత్సవంగా అధికారకంగా ప్రకటించింది. అయినా, మన దేశంతో పాటు, మరికొన్ని దేశాలు మాత్రం ఆగస్టు మొదటి ఆదివారాన్ని 'ఫ్రెండ్‌షిప్ డే'గా జరుపుకొంటున్నాయి.

'స్నేహితుల దినోత్సవం' పుట్టింది అమెరికాలో.. 1935లో అయినా.. స్నేహం పుట్టుక మాత్రం మనిషి పుట్టుకంత ప్రాచీనమైంది.

'స్నేహమంటే పాత పరిచయం కాదు. ఎప్పుడూ వీడని అనుబంధం.'




"నేను మారినపుడు మారిపోతూ, నేను తలూపినపుడు తనూ తలూపుతూ ఉండే స్నేహితుడు నాకు అవసరం లేదు. నా నీడ ఆ పనిని ఇంకా మెరుగ్గా చేస్తుంది"
- ప్లుటార్క్, గ్రీకు తత్త్వవేత్త

"నా వెనక నడవకు - నేను నీకు దారి చూపించలేక పోవచ్చు. నా ముందు నడవకు - నేను నిన్ను అనుసరించకపోవచ్చు. నా జతగా నడు, నా స్నేహితుడిగా ఉండిపో"
- ఆల్బర్ట్ కేమస్, రచయిత, తత్త్వవేత్త

"నీ తప్పును, నీ తెలివితక్కువ పనులను నీ ముందుంచేవాడే నిజమైన స్నేహితుడు."
- బెంజిమిన్ ఫ్రాంక్లిన్

"నీవుంటే వేరే కనులెందుకు
నీకంటే వేరే బతుకెందుకు
నీ బాటలోని అడుగులు నావి
నా పాటలోని మాటలు నీవి"
- సి. నారాయణరెడ్డి

చుక్కలు కలపండి




టంగ్ ట్విస్టర్స్



1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.

నవ్వుల్ నవ్వుల్



సోని : నాన్నా! శిఖరాగ్ర సమావేశాల్లో అంతా శిఖరాలపై కూర్చొని మాట్లాడుకుంటారా? పడిపోరా మరి?
మిస్టర్ మేధావి : అప్పుడు అక్కడ చదును చేస్తారు రా!
సోని : అవునా!

* * *

పార్థు : నాకు వంద రూపాయలు దొరికాయోచ్!
సోము : ఆ వంద నాదే రా!
పార్థు : నాకు దొరికింది రెండు యాభై రూపాయల నోట్లు.
సోము : అవునా! నా వంద కింద పడినప్పుడు రెండు ముక్కలైనట్లు ఉంది.
పార్థు : !!!!!!!!!!!!!

సూక్తి

వందమంది స్నేహితులు ఉండక్కర్లేదు...
వంద సమస్యలు వచ్చినా అండగా ఉండే స్నేహితుడు ఒకరు ఉంటే చాలు!

చెప్పగలరా?

పాతికలో ఉన్నాను, కానీ రతికలో లేను
పావులో ఉన్నాను కానీ, పాకలో లేను
రంగంలో ఉన్నాను కానీ, గంగలో లేను
అయితే నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. హవానం ▸ ....
2. స్వాతంగ ▸ ....
3. కిపల్ల ▸ ....

పదాలు గుర్తించండి

buddy caring forever friends laughter
listen love share together trust

f	r	i	e	n	d	s	k	f	l	n	s
o	t	o	g	e	t	h	e	r	u	s	n
r	o	m	r	w	a	a	b	v	y	u	i
e	g	j	l	l	t	r	u	s	t	r	e
v	h	m	u	r	t	e	v	f	w	q	b
e	b	v	t	e	h	j	n	r	e	p	u
r	p	o	l	h	c	b	n	l	d	i	d
l	i	s	n	y	a	u	c	o	z	z	d
p	r	e	w	n	r	d	m	v	v	c	y
l	o	y	e	l	i	s	t	e	n	s	s
b	e	c	z	i	n	s	h	a	m	u	l
t	t	l	a	u	g	h	t	e	r	n	e


a cupcake for the teacher

జవాబులు

జంతర్‌మంతర్ : 1. వాహనం 2. స్వాగతం 3. పల్లకి
చెప్పగలరా? : పావురం

'వంశధార'కు సహకరించండి

● నిర్వాసితులకు సీఎం చంద్రబాబు పిలుపు
● మంత్రి అచ్చెన్న, ఎమ్మెల్యే కలమట, కలెక్టర్‌తో టెలీకాన్ఫరెన్స్
● జిల్లా అభివృద్ధికి ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని వ్యాఖ్య
● పనుల్లో వేగం పెంచాలని ఆదేశాలు



(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి)

వంశధార ప్రాజెక్టు అత్యంత కీలకమైనది. జిల్లా సమగ్రాభివృద్ధిలో దీని పాత్ర ఎనలేనది. గత పాలకులు ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక కష్టాలున్నా సరే ప్రాజెక్టు పూర్తిచేయడానికి నిర్వాసితులకు రూ.450కోట్లు మంజూరుచేశాం. ఇక నుంచి జిల్లా అధికారులు ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి. ప్రాజెక్టు పరిధిలోని స్థానికులు, నిర్వాసితులు ప్రాజెక్టు పూర్తికి సహకరించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మంత్రి అచ్చెన్నాయుడు, పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, కలెక్టర్ ధనుంజయరెడ్డి, డీఎస్పీ భార్గవరావునాయుడుతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి చెందాలంటే వంశధార ప్రాజెక్టు అత్యంత కీలకమని, ప్రాజెక్టును అత్యంత వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పుష్కలంగా నీటి వనరులు కలిగి ఉన్న శ్రీకాకుళం జిల్లా గత పాలకుల నిర్లక్ష్యం, అవినీతితో వెనకబడిన జిల్లాగానే మిగిలిపోయిందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరుతో ప్రజా ధనం దుర్వినియోగం చేశారని, తాము అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. తాను ఇచ్చిన గడువులోగా ప్రాజెక్టు రెండో దశ పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రూ.450 కోట్లు పరిహారం రూపంలో ఇచ్చి నిర్వాసితులకు న్యాయం చేశామని గుర్తు చేశారు. ఈనేపథ్యంలో ఇక నుంచి పనుల్లో వేగం పెంచి ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి జలాలు అందించాలని ఆదేశించారు. చిన్న, చిన్న సమస్యలు ఉంటే స్థానికంగా మాట్లాడుకోవాలని సూచించారు. అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని అధిగమించి ప్రాజెక్టు పూర్తికి అంతా నడుం బిగించాలన్నారు.



ఆనందంలో పదోన్నతులు పొందిన భాషా పండితులు

ప్రతిపక్ష నేత జగన్ సైకో

● ఆయనను రాజకీయాల నుంచి వెలివేయాలి
● మీడియా సమావేశంలో నిప్పులు చెరిగిన టీడీపీ నేతలు



విలేఖరులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, టీడీపీ నేతలు

(శ్రీకాకుళం సిటీ)

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ సైకో అని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీష, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి నిప్పులు చెరిగారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. నంద్యాల సభలో జగన్.. ముఖ్యమంత్రిని నడిరోడ్డు మీద కాల్చి చంపినా ఫర్వాలేదని వ్యాఖ్యానించి.. తన ఫ్యాక్షన్, రౌడీ మనస్తత్వాన్ని బయటపెట్టుకున్నారన్నారు. జగన్ రాజకీయాలకు తగడని, వెంటనే ఆయన్ను వెలివేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యక్తికి అధికారమిస్తే సాధారణ ప్రజలకు రక్షణ కూడా ఉండదని, రౌడీ రాజ్యం నడుస్తుందని మండిపడ్డారు. జగన్ లాంటి వ్యక్తి రాష్ట్రానికి ప్రతిపక్ష నేత కావడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. సమావేశంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నికృష్ణంనాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు మెట్ట సుజాత, టీడీపీ నేతలు ఎస్‌వీ రమణమాదిగ, గుమ్మా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై ఫిర్యాదు

కవిటి : నంద్యాల బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రతిపక్ష నేత జగన్‌పై కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే డా.బి.అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన కవిటి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పి.పారినాయుడుకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. జగన్ వ్యాఖ్యల్లోని చంపాలి, కొట్టాలి, కాల్చాలి పదాలు చట్ట విరుద్ధమని తెలిపారు. ప్రతిపక్ష నేత ఫ్యాక్షనిష్టులా, రౌడీలా మాట్లాడడం సరికాదన్నారు. ఆయన వెంట జడ్పీటీసీ సభ్యుడు బి.రమేష్, సర్పంచ్ పి.శేఖర్ తదితరులు ఉన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కల నిజమాయె..!

● భాషా పండితులను కరుణించిన ప్రభుత్వం
● 63 మందికి పదోన్నతులు
● ఏజెన్సీ ఉపాధ్యాయులకు పూర్తయిన బదిలీలు
● డీఈవోను సన్మానించిన భాషోపాధ్యాయులు

(శ్రీకాకుళం సిటీ)

భాషా పండితుల కల నెరవేరింది. సుదీర్ఘ కాలంగా వారు ఎదురుచూస్తున్న పదోన్నతులు ఎట్టకేలకు లభించాయి. 30 ఏళ్లు భాషా పండితునిగా పనిచేస్తూ అదే స్థాయిలో విరమణ చేస్తున్న వీరికి ఊరట లభించింది. న్యాయస్థానాలు అనుకూలంగా తీర్పునిచ్చినా అమలుకు వచ్చేసరికి ఎన్నో ఆటంకాలు ఎదురయ్యాయి. ఈ తరుణంలో స్కూల్ అసిస్టెంట్ (భాషలు)లకు భాషా పండితులు అర్హులని 14, 15 ఉత్తర్వులు ఇచ్చి ప్రభుత్వం న్యాయం చేసింది. ఈ ఉత్తర్వులతో జిల్లాలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న 30 మంది తెలుగు, 29 మంది హిందీ, నలుగురు ఒడియా భాషా పండితులకు పదోన్నతులు దక్కాయి. శనివారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదోన్నతుల కౌన్సెలింగ్‌లో వీరికి అవకాశం దక్కింది. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన పండితులు డీఈవో ఆబోతుల ప్రభాకరరావు, ఉపవిద్యాధికారి వి.సుబ్బారావును సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, ఆర్.శ్రీనివాసరావు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు ఉన్నారు.

● ముగిసిన 'ఐటీడీఏ' కౌన్సెలింగ్

ఇదిలా ఉండగా సీతంపేట ఐటీడీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ, మండల పరిషత్ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ పూర్తయింది. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎల్.శివశంకర్, జిల్లా రెవెన్యూ అధికారి నటుకుల సత్యనారాయణ, డీఈవో ఆబోతుల ప్రభాకరరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 56 మంది ఉపాధ్యాయులకు బదిలీ చేశారు.

● నేడు భాషా పండితులకు రీకౌన్సెలింగ్...

ఈ నెల 6న జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో భాషా పండితులకు రీకౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు డీఈవో తెలిపారు. అర్హులైన, దరఖాస్తు చేసుకున్న వారందరూ హాజరు కావాలని సూచించారు.



డీఈవోను సన్మానిస్తున్న భాషా పండితులు

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

● సింగూరు ర్యాంపును తక్షణమే ఆపండి
● కలెక్టర్ కె. ధనుంజయరెడ్డి

కలెక్టరేట్ : జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కలెక్టర్ కె.ధనుంజయరెడ్డి శనివారం సాయంత్రం తన చాంబర్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొందూరు మండలం సింగూరు ఇసుక ర్యాంపును పూర్తిగా నిలుపుదల చేయాలని ఆర్డీవో బి.దయానిధికి ఆదేశించారు. ఈ ర్యాంపునకు సంబంధించి ఆమదాలవలస మండలం దూసి మీదుగా అత్యధికంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని, ఎందుకు అడ్డుకట్ట వేయలేదని ఆర్డీవోను ప్రశ్నించారు. సింగూరు ర్యాంపు నుంచి ఇసుక రవాణా జరగకుండా అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో అనుమతి లేకుండా నడుపుతున్న ఇసుక ర్యాంపులను నిలిపేయాలని అధికారులకు సూచించారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలన్నారు. సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ అవసరాలకు వాడేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. పట్టుబడిన వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలించి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులకు ఆదేశించారు. ఇకపై జిల్లా నుంచి ఇసుక అక్రమ రవాణా జరగడానికి వీల్లేదని అధికారులకు స్పష్టం చేశారు. వాహనదారులపై చర్యలు తీసుకోవడమే కాకుండా అవసరమైతే కేసులు కూడా బనాయించాలని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేవీఎన్ చక్రధర బాబు, ఎస్పీ త్రివిక్రమ వర్మ, శ్రీకాకుళం, పాలకొండ ఆర్డీవో ఆర్.గున్నయ్య, జప్పీ సీఈఓ బి.నగేష్, జిల్లా పంచాయతీ అధికారి బి.కోటేశ్వరరావు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సీహెచ్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు



తాడివలసలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం

పొందూరు: మండలంలోని తాడివలస ప్రభుత్వ పాఠశాలల్లో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యులు ఆకాశం రాము ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎల్.హేమాచార్యులు, హెచ్‌వీ సుజాత, పాఠశాల ఉపాధ్యాయులు హరిప్రశన్న, కె.గోపాలం, పి.వెంకటరావు తదితరులు ఉన్నారు.


చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

ఎరువుల లెక్క తేల్చేశారు..!

● రికార్డుల్లో కంటే తక్కువే..!
● 13మంది వ్యవసాయ సిబ్బందితో పునఃపరిశీలన

ఆమదాలవలస: స్థానిక ఎరువుల వ్యాపారుల అభ్యర్థన మేరకు విజిలెన్స్ అధికారులు శనివారం ఎరువుల గోదాంలలో నిల్వలను పునఃపరిశీలన చేశారు. మండలంలోని తాళ్ళవలస వద్ద ఉన్న అవంతి వేర్ హౌసింగ్ గోదాంలపై గతనెల 15న విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి, ఎరువుల నిల్వలు అదనంగా ఉన్నాయని అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం పాఠకులకు విధితమే. వ్యాపారుల ఆందోళన మేరకు శనివారం విజిలెన్స్ అధికారులు గోదాంలను పునఃపరిశీలన చేశారు. ఏపీ మార్క్‌ఫెడ్‌తో పాటు జిల్లాలో పలువురు డీలర్లకు సంబంధించిన ఎరువుల రికార్డుల ప్రకారం 78,307 బస్తాల సామర్థ్యం గల గోదాంలలో గత లెక్కల ప్రకారం 78,915 బస్తాలు నిల్వలు ఉన్నాయని గుర్తించారు. యూరియా 3,700 టన్నులు మార్కెఫెడ్ ఎరువులతో పాటుగా వివిధ డీలర్లకు చెందిన నాగార్జున యూరియా 3,000 బస్తాలు, ఇఫ్కో 700 బస్తాలు.. గోదాంలలో నిల్వ చేశారని రికార్డుల్లో పొందుపర్చారు.


గోదాం తెరుస్తున్న అధికారులు

పొంతన కుదరలేదు..

విజిలెన్స్ అధికారులు గోదాంలను పరిశీలించగా రికార్డుల్లో ఉన్న లెక్కలకు గోదాంలలో ఉన్న ఎరువులకు పొంతన కుదరలేదు. జీఎస్టీ అమలైతే ఎరువులపై కొత్తగా ప్రకటించిన పన్నులు అమలవుతాయని గుర్తెరిగిన డీలర్లు స్టాక్ గోదాంల వద్ద ఎరువుల నిల్వలు ఉంచినట్టు విజిలెన్స్ అధికారుల దర్యాప్తులో తేటతెల్లమయ్యింది.

సరుకులు సీజ్..

రెండు రోజులపాటు విజిలెన్స్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఎరువుల గోదాంలు పరిశీలించిన అధికారులు.. లెక్కల్లో వ్యత్యాసం ఉందన్న ఉద్దేశంతో సరుకులు సీజ్ చేశారు.

అధికారులపై ఒత్తిడి..!

నిబంధనల ప్రకారం 21 రోజుల్లో గోదాంలలో ఉన్న నిల్వల లెక్క చూపించాలని వ్యవసాయాధికారులకు విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. అయితే కొంతమంది డీలర్లు తమ పలుకుబడిని ఉపయోగించి అంతా సక్రమమే అని అధికారులపై వత్తిడి తెచ్చినట్టు సమాచారం. వ్యవసాయాధికారులు గత రికార్డులు చూపించిన నిల్వ కంటే తక్కువగా చూపించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోదాంలలో మొదట ఎక్కువగా


ఎరువుల బస్తాలను లెక్కిస్తున్న వ్యావసాయాధికారులు

చూపి నేడు తక్కువ ఎరువులు ఉన్నట్టు చెప్పడం వెనుక ఉన్న అంతార్యమేమిటో అన్నది అధికారులకే ఎరుక. ఈ పరిశీలనలో విజిలెన్స్ సీఐ చంద్ర, జిల్లా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బీవీ తిరుమల రావు, డీడీ శివప్రసాద్, ఏవోలు దుంపల ఉషారాణి, పద్మావతి, అజయ్, నవీన్, సునీత, ఎంపీఈవోలు ఉన్నారు.

పలు అనుమానాలు..

ఎరువులు తక్కువగా ఉన్నాయని ఒక్క రోజులోనే లెక్కలు తేల్చేయడం వెనుక విజిలెన్స్ అధికారుల లెక్క తప్పా.. వ్యవసాయాధికారుల లెక్క తప్పా... డీలర్లు ఒత్తిడి గెలిచిందా అన్న అనుమానాలు తలెత్తున్నాయి. ఈ విషయంపై విజిలెన్స్ సీఐ చంద్ర వద్ద ప్రస్తావించగా 13 టన్నుల యూరియా తేడా వస్తుందని వీటితో పాటు మరి కొన్ని ఎరువులు కంపెనీల వారీగా తేడా ఉన్నాయని తెలిపారు.

అర్థంలేని ప్రకటనలు మానుకో...

● పరివర్తన్ ట్రస్టు అధ్యక్షుడిపై టీడీపీ నాయకుల ఫైర్

ఆమదాలవలస: పరివర్తన్ ట్రస్టు అధ్యక్షుడు చింతాడ రవికుమార్ అర్థంలేని ప్రకటనలు మానుకోవాలని టీడీపీ నాయకులు బోర గోవిందరావు, పొన్నాడ వరహనర్శింహులు, బి.లక్ష్మణరావు, బీవీరమణ, కె.శివ, జీడీ ప్రసాద్ అన్నారు. శనివారం ప్రతికా ప్రకటన విడుదల చేశారు. విప్ కూన రవికుమార్‌ను విమర్శించే అర్హత చింతాడ రవి కుమార్‌కు లేదని ప్రతి రోజు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రతికల్లో ప్రకటనలు గుప్పించడం అర్థ రహితమన్నారు. ట్రిపుల్ ఐటీకి 300 ఎకరాలు కావాల్సి వస్తే 100 ఎకరాలు సరిపోతుందని ప్రతికల్లో తప్పుడు ప్రచారం చేయడం చింతాడ పరిపక్వతలేమికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.

విప్‌ను విమర్శించే స్థాయి చింతాడకు లేదు..

పొందూరు: ప్రభుత్వ విప్ కూన రవికుమార్‌ను విమర్శించే స్థాయి, హక్కు చింతాడ రవికుమార్‌కు లేదని కేశవదాసుపురం సర్పంచ్, టీఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాడు నారాయణరావు అన్నారు. ఆమదాలవలస చక్కెర కర్మాగారం ఎవరివల్ల మూత పడిందో, దానిని తెరిపించేందుకు విప్ ఎంత కృషి చేశారో నియోజకవర్గం ప్రజలకు, జిల్లా వాసులకు తెలుసునని అన్నారు. నిబంధనల మేరకు ప్రభుత్వ భూమి లీజుకు దరఖాస్తు చేశామని విప్ రవి కుమార్ స్వచ్ఛందంగా తెలియజేశారని తెలిపారు.

.బూర్జ: నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజాప్రయోజనాలకు సలహాలు ఇవ్వాలు గాని ప్రభుత్వ విప్‌ను విమర్శించే అర్హత ప్రొఫెసర్ చింతాడ రవికుమార్‌కు లేదని మండల టీడీపీ కన్వీనర్ లంక జగన్నాథం నాయుడు సూచించారు. ఆయన శనివారం విలేఖరులతో మాట్లాడుతూ ప్రతి వ్యక్తి విమర్శించడమే తప్ప అభివృద్ధిని చూసి సరైన సలహాలు ఇచ్చే వ్యక్తులు లేరన్నారు. ఎటువంటి అర్హతలు లేని వ్యక్తులు విమర్శలు చేయడం సరికాదన్నారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు కడగల కృష్ణ, దాసిరెడ్డి మౌళి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించేందుకు కృషి


మొక్కలు నాటుతున్న దృశ్యం

బూర్జ: పచ్చదనం పరిరక్షణకు అంతా కృషి చేయాలని ఎంపీపీ బొడ్డేపల్లి సూర్యారావు అన్నారు. వనం మనం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణవేణి, ఏపీవో సాయిరాం, ఏపీఎం శివున్నాయుడు, సీసీలు స్వప్న, అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోండి

పొందూరు: విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాన్ని ముందుగానే నిర్దేశించుకోండని దానికి అనుగుణంగా చిత్తశుద్ధితో కృషి చేయాలని సిస్టం కళాశాల కరెస్పాండెంట్ ఎం.మోహనరావు అన్నారు. కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులకు ఒక లక్ష్యం ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుకాణాల వద్ద రాఖీ సందడి

పొందూరు: రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. మండల కేంద్రంలో ఎక్కడ చూసినా రాఖీల కొనుగోలుతో సందడి నెలకొంది. గుంపులు గుంపులుగా కళాశాల విద్యార్థినులు రాఖీల కోసం ఎగబడుతున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

సరుబుజ్జిలి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2016-17 సంవత్సరంలో ఏప్రిల్ వరకు రూ.3కోట్లు 35లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం నిర్వహించారు. ఈ ప్రజా వేదిక ఎస్ఆర్పీలు జె.తిరుపతి, పి.రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపాధి హామీ పీడీ హెచ్.కూర్మారావు హాజరై పంచాయతీ వారీగా డీఆర్పీలు 14 మంది గ్రామాల్లో జరిపిన తనిఖీలపై ప్రజావేదిక నిర్వహించారు. మండల కేంద్రంలోగల కళామందిర ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇసుకలపాలెం పంచాయతీ వివరాలను డీఆర్పీలు చదివి వివరించారు. అదే సమయంలో పెద్ద సవళాపురం గ్రామానికి చెందిన పీసీసీ కార్యదర్శి బద్రి రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులు గ్రామ స్థాయిలో సక్రమంగా అమలు జరగడం లేదన్నారు. జరిగినా సకాలంలో బిల్లు అందడం లేదని ఆరోపించారు. ఉపాధి హామీ పీడీ మాట్లాడుతూ తొమ్మిది పంచాయతీలకు రికవరీ రూ.57,547, పెనాల్టీ రూ.2,984గా విధించినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ కె.లోకేష్, డీవీవో వెంకట రమణ, పెన్షన్లు ఏపీవో మూర్తి, డీపీఎం శ్రీరామమూర్తి, ఎండీవోమ్‌డిఓ ఎం.పావని, ఉపాధి హామీ ఏపీవో ఎ.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం కమల కుమారి పాండ్యన్, ఈసీలు, జన్మభూమి కమిటీ సభ్యులు శివ్వాల సూర్యనారాయణ పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు హాజరయ్యారు.


మాట్లాడుతున్న ఉపాధి హామీ పీడీ కూర్మారావు

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

ఆమదాలవలస: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న కుమారి అన్నారు. 7వ వార్డు చింతాడ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాజులమ్మ, భారతి ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


తల్లి పాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్నకుమారి

'జగన్ వ్యాఖ్యలు ఫ్యాక్షన్ నైజానికి నిదర్శనం'

పొందూరు: నంద్యాల ఎన్నికల ప్రచార సభలో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ వ్యాఖ్యలు అతనిలోని ఫ్యాక్షన్ నైజానికి నిదర్శనమని జడ్పీటీసీ సభ్యుడు లోలుగు శ్రీరాముల నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కూన సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అన్నెపు రాము తదితరులు జగన్‌పై ధ్వజమెత్తారు. వారు మండల కేంద్రంలో శనివారం విలేఖరులతో మాట్లాడారు. తండ్రి ప్రభుత్వంలో లక్షల కోట్లు అక్రమ సంపాదన చేసిన జగన్.. ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే అర్హత ఏమాత్రం లేదన్నారు. నడిరోడ్డుపై ముఖ్యమంత్రిని చంపమని పిలుపునిచ్చిన జగన్‌పై హత్యను ప్రేరేపించిన నేరంపై కఠినమైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అనకాపల్లి రంగారావు, గుడ్ల మోహన రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు చింతాడ కృష్ణ వాసుదేవరావు, గీడు నారాయణ రావు, వండాన సత్యం, శంకర భాస్కర్, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


విలేఖరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పశుగ్రాస క్షేత్రాల ఆవశ్యకతను గుర్తించండి


చెక్కు అందిస్తున్న మొదలవలస సర్పంచ్ ధనలక్ష్మి

పొందూరు: పశుగ్రాస క్షేత్రాల ఆవశ్యకతను తెలియజేసి ఈ పథకం నిర్వహణకు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మొదలవలస సర్పంచ్ ఎం.ధనలక్ష్మి, కింతలి పశువైద్యాధికారి ఆశాలత అన్నారు. మొదలవలసలో పశుగ్రాసాన్ని సాగు చేస్తున్న బొడ్డేపల్లి సత్తిమమ్మకు మొదటి విడతలో రూ.9,000 చెక్కును శనివారం అందించారు. సాగు చేయడానికి, పొలం లీజు కింద రైతుకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని తెలిపారు. రైతుల వద్ద గడ్డిని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.సీతారామరాజు తదితరులు ఉన్నారు.

వెంకయ్యనాయుడి గెలుపుపై హర్షం

ఆమదాలవలస రూరల్: ఉపరాష్ట్రపతిగా ఎం.వెంకయ్యనాయుడి గెలుపు తెలుగు రాష్ట్రాల విజయమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాతిన గడ్డెయ్య శనివారం తెలిపారు. వెంకయ్య నాయుడి గెలుపుపై ఆ పార్టీ నాయకులు పేడాడ సన్యాసప్పారావు, బొడ్డేపల్లి చినబాబు, పేడాడ సూరపునాయుడు, బెండి రవికాంత్, చింతాడ అప్పారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కిటకిటలాడిన శనీశ్వరాలయం

ఆనందపురం(జి.సిగడాం): మండలం ఆనందపురం శనీశ్వరాలయం భక్తులతో శనివారం కిటకిటలాడింది. శనిత్రయోదశి సందర్భంగా వందలాది మంది భక్తులు శనీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్నానమాచరించి పార్వతీసమేత విశ్వేశ్వరాలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు.


శనీశ్వరాలయం వద్ద బారులతీరిన భక్తులు

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం

జి.సిగడాం: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటరత్నం అన్నారు. మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించవచ్చన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్ఠికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, రాధికలు పాల్గొన్నారు.

వర్సిటీలో స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. అకడమిక్ బ్లాక్ పరిస రాల్లో పేరుకుపోయిన చెత్తచెదారాలను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.సంజీవయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్‌తో రైతుకు లాభదాయకం


డ్రమ్‌సీడర్‌తో వరి విత్తనాలు వేస్తున్న దృశ్యం

కంబాలపేట (రణస్థలం) : డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా వరిసాగు చేయడం వల్ల రైతులకు లాభదాయకమని ఏవో మహేష్‌నాయుడు అన్నారు. మండలం కంబాలపేటలో పాసెపు శ్రీను పొలంలో డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిసాగు కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ పద్ధతి ద్వారా 100 ఎకరాల్లో వరిసాగుచేస్తున్నామన్నారు. దీని వల్ల రైతుకు తక్కువపెట్టుబడితో ఎక్కువగా దిగుబడి వస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో లీలాకుమార్, పాసెపు శ్రీను, రైతులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోండి

రణస్థలం : కళాశాల దశలోనే ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించు కోవాలని, తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని శ్రీసాయి డిగ్రీ కళాశాల చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు, ప్రిన్సిపల్ ఎస్ సతీష్, అన్నారు. స్థానిక శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ప్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ కృషి, పట్టుదలతో అసాధ్యాన్ని సుసాధ్యం చేసుకోవచ్చన్నారు. విద్యార్థుల మధ్య స్నేహపూర్వకమైన పోటీతత్వం ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల ఆధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థినుల నృత్యప్రదర్శన

కానరాని తల్లిపాల వారోత్సవాలు

రణస్థలం : అమ్మపాలు అమృతం వంటివని ప్రజల్లో చైతన్య పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఆగస్టులో ప్రతిష్టాత్మకంగా తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమాన్ని చేపడుతోంది. మండలంలో అంగన్‌వాడీ సీడీపీవో, సూపర్‌వైజర్లు స్థానికంగా లేకపోవడంతో ఈ కార్యక్రమాలు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆశయానికి గండికొడుతున్నారు. వేల రూపాయల నిధులు దుర్వినియోగం అవుతున్నాయని పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. తల్లిపాల విశిష్టతను ప్రజలకు తెలియజేయాల్సిన అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ పలువురు వాపోతున్నారు.


ముద్దాడ సమీపంలో షర్టర్ల దుస్థితి

ఉభాలకు ఎదురుదెబ్బ!

● సాగునీరందక అవస్థలు ● ఎండుతున్న వరినారు
● బీడుగా మారుతున్న పొలాలు ● ఆందోళనలో రైతులు


రామజోగిపేట వద్ద చుక్క నీరు రాని కాలువ

ఎచ్చెర్ల: నారాయణపురం కుడి కాలువ ద్వారా సాగునీరందకపోవడంతో ఉభాలు వేయలేని పరిస్థితి నెలకొంది. గత నెల 7న ప్రాజెక్ట్ నుంచి సాగునీరు విడుదల చేశారు. సుమారు నెల రోజులు గడుస్తున్నా కాలువల ద్వారా చుక్కనీరు కూడా అందకపోవడంతో ఆయకట్టురైతుల్లో ఆందోళన మొదలవుతోంది. ఒకవైపు ప్రకృతి కన్నెర్రజేస్తుంటే... మరోవైపు సకాలంలో సాగునీరు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో వేలాది హెక్టార్లలో వేసిన వరినారు ఎండిపోతోంది. పంట పొలాలు బీడుభూములుగా మారుతున్నాయి. అరకొర వర్షాలే తప్ప.. పూర్తిస్థాయిలో వర్షాలు లేకపోవడంతో ఖరీఫ్‌పై రైతులు ఆశలు చాలిస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని ముద్దాడ, ధర్మవరం, పొన్నాడ, రామజోగిపేట, భగిరధీపురం తదితర గ్రామాల రైతులు సాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏటా ఈ కష్టాలు ఎదురవుతున్నా.. సరైన వ్యూహంతో అధికారులు ముందుకు వెళ్లడంలేదని విమర్శలు వస్తున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న షర్టర్లు, కాలువల్లో పేరుకు పోయిన పూడికల వల్ల శివారు ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితి ఎదురవుతోంది. ప్రధానంగా సంతకవిటి మండలం రంగరాయపురం వద్ద కాలువలో ఇసుక మేటలు వేయడంతో సాగునీరు సరఫరా కాని పరిస్థితి ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు, ఆయకట్టదారులు సమిష్టిగా కదిలితే తప్ప ఈ ఏడాది ఉభాలు వేసే పరిస్థితి కన్పించడంలేదు.


ఎండుతున్న వరినారు

నేటి నుంచి శివానీలో శిక్షణ తరగతులు

ఎచ్చెర్ల: స్థానిక శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం వలంటీర్లకు ఈ నెల 6 నుంచి 20వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ కేవీ రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన వలంటీర్లు ఇందులో పాల్గొంటారని ఆయన అన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ


కొత్తకోటలో మొక్కలు నాటుతున్న ఈసీ


పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కొత్తకోట(లావేరు) : మొక్కలు నాటి.. కాలుష్యాన్ని నివారించాలని లావేరు మండల ఉపాధిహామీ ఈసీ ఎస్.గౌరీశంకర్ అన్నారు. మండలం కొత్తకోట, గోవిందపురం గ్రామాల్లో వనం-మనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏ రవికుమార్, క్షేత్రసహాయకులు అనీల్, అప్పలనాయుడులు తదితరులు పాల్గొన్నారు.

బంటుపల్లి (రణస్థలం) : మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని సంఘసేవకుడు నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలం బండుపల్లి పాఠశాలలో వనం-మనం కార్యక్రమం శనివారం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మొక్కలు పెంపకం అలవర్చుకోవాలన్నారు. మొక్కల వల్ల వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. ఏపీవో సత్యవతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఏఎంసీ కార్యాలయం ప్రారంభం

అదపాక(లావేరు) : మండలం అదపాక జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన ఏఎంసీ కార్యాలయాన్ని మంత్రి కిమిడి కళావెంకటరావు ఆదివారం ప్రారంభించనున్నట్టు మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎం.సురేష్ శనివారం ఒక ప్రటకలనో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులతో పాటు నియోజవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

చినుకు పడితే.. చిత్తడే

● గోతులమయమైన వెంకటాపురం రోడ్డు

వెంకటాపురం(లావేరు) : మండలంలోని వెంకటాపురం-అదపాక గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా మారింది. రోడ్డు గోతులమయం కావడంతో చిన్నపాటి జల్లులకే నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఆ సమయంలో ఈ రహదారి గుండా వెళ్లే వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు మధ్యలో గోతులు ఏర్పడడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. సుమారు 5 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రహదారిపై వెంకటాపురం, ముద్దాడపాలేం, గోవిందపురం, బరణికాం, కొత్తకోట తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు శిథిలావస్థకు చేరిపోవడంతో రాత్రి సమయాల్లో తీవ్ర అవస్థలు పడుతున్నామని వాహనచోదులకు అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారి మరమ్మత్తులు చేపట్టాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా అదపాక-వెంకటాపురం రోడ్డు

నేడు అణుపార్కుకు వ్యతిరేకంగా ర్యాలీ

రణస్థలం : కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా ఆదివారం మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టనున్నట్టు సీఐటీయూ నాయకులు పి.తేజేశ్వరరావు శనివారం తెలిపారు. హిరోషిమా-డే సందర్భంగా అణువిద్యుత్ కేంద్రం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు చైతన్య పరుస్తామన్నారు. ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

నరసన్నపేట: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జ్ఞానజ్యోతి కళాశాలలో శనివారం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గొండు రంగరావు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో పలు కళాశాలలో చదివే విద్యార్థులు ఒకరికి ఒకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


ఫ్రెండ్‌షిప్ వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు

నిబంధనలకు నీళ్లు

- పేరుకే.. మినరల్ ● పంప్ నీరు నేరుగా ఫిల్లింగ్ ..!
- పట్టణంలో వాటర్ ప్లాంట్ల దుస్థితి ఇది..

నరసన్నపేట: పట్టణంలో కొన్ని మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచినీటిని శుద్ధి చేయకుండా యథాతథంగా వినియోగదారులకు పంపిణీ చేయడం ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడయ్యింది. పట్టణంలో రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రైవేటు వ్యక్తులకు చెందినవి కాగా మరొకటి అమెరికన్ వాటర్ ఫౌండేషన్ సంస్థ నిర్వహణలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తోంది. ఇవే కాకుండా జిల్లాలో ఇతర ప్రాంతాలు నుంచి రోజుకు 200 వరకు వాటర్ క్యాన్‌లు పట్టణానికి వస్తుంటాయి. అయితే గత కొద్దిరోజులుగా నీటిని శుద్ధిచేయికుండా నేరుగా క్యాన్‌లకు ఫిల్ చేస్తూ విక్రయాలు సాగిస్తున్నారని వినియోగదారులు గగ్గోలు చెందుతున్నారు. 25 లీటర్ల క్యాన్‌లకు ఆయా ప్లాంట్‌లలో నేరుగా పంప్‌నీరు ఫిల్లింగ్ చేస్తూ.. ఒక్కొక్క క్యాన్‌కు రూ.20 తీసుకుంటున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాటర్ ప్లాంట్‌నుంచి పంపిణీ చేసే వాటర్ క్యాన్‌కు రూ.10 తీసుకుంటున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా వాటర్‌ప్లాంట్ నుంచి మినరల్ పేరుతో పంపిణీ చేయడంతో ఈ నీరు ఉపయోగించే వినియోగదారులు జబ్బులు పడుతున్నామని కొన్ని వాటర్ ప్లాంట్‌ల మినరల్ నీరును వినియోగిస్తున్న వారు గగ్గోలు చెందుతున్నారు.

నిబంధనలు తుస్..

పట్టణంలో కొన్ని వాటర్ ప్లాంట్‌లలో నిబంధనలు పాటించడం లేదు. బోరుబావి నుంచి నీటి శుద్ధి ట్యాంకులకు చేర్చి అక్కడ నుంచి ఎటువంటి క్లోరినేషన్, ఫ్లోరైడ్ విధానం చేపట్టకుండా నేరుగా క్యాన్‌లకు పంప్ చేస్తున్నారు. వాటర్ ప్యాకెట్లకు వినియోగించే కవర్లు నాణ్యత తక్కువగా ఉండటంతో వాటర్ ప్యాకెట్లలో ఉండే నీరు మూడు రోజులకు ప్లాస్టిక్ వాసన వస్తుంది. క్యాన్‌లను శుభ్రం చేసి ఒక రోజు ఎండలో అరబెట్టిన తరువాత మాత్రమే ఫిల్లింగ్ చేయాలి. కానీ నరసన్నపేటలో అలా కాకుండా పాతక్యాన్‌లో నీటిని పడుతున్నారు.

పత్తాలేని అధికారులు:

నీటి కాలుష్యంతో ప్రజలు పలు వ్యాధులకు గురవుతున్నా పర్యవేక్షించే అధికారులు పత్తా లేకపోవడంతో వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆహార నియంత్రణ అధికారులు, పరిశ్రమల శాఖ అధికారుల పర్యవేక్షిం చాల్సి ఉంటుంది.


పట్టణంలో పరిశుభ్రత లేని వాటర్ ప్లాంట్

చెడు వాసన వస్తోంది



వారంరోజులుగా పట్టణంలో వాటర్ క్యాన్ల నుంచి తీసుకుంటున్న నీరు చెడు వాసన వస్తోంది. డబ్బులు ఇచ్చి నీటిని కొనుగోలు చేసినా నాణ్యత లేదు.

- దుబ్బ శ్రీనివాసరావు, మారుతీనగర్

పట్టించుకోని అధికారులు



పట్టణంలోని మినరల్ ప్లాంట్‌లపై ఎన్ని ఫిర్యాదులు చేసినా అధి కారులు పట్టించుకోవడంలేదు. వాటర్ క్యాన్‌లలో చిన్నచిన్న రేణువులు వంటివి కనిపిస్తున్నాయి.

- జామి వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు, నరసన్నపేట

అభివృద్ధి బాటలో పేట


శ్రీరామనగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మేజర్ పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని సర్పంచ్ గొద్దు చిట్టిబాబు అన్నారు. డంపింగ్ యార్డు, శ్రీరామనగర్‌లో సీసీ రోడ్డు పనులను ఆయన శనివారం ప్రారంభించారు. సీసీ రోడ్లతో పాటు భూగర్భ మురుగునీటి కాలువలను ఏర్పాటు చేసి నరసన్నపేటను జిల్లాలో ఆదర్శ పట్టణంగా నిలుపుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు జామి వెంకట్రావు, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బెవర రాము, వార్డు సభ్యులు పి.శేషగోవిందరావు, యాగళ్ల చిన్న నర్సునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

కోమర్తి(నరసన్నపేట): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ఒక్కొక్క మొక్కనాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలని మండల ప్రత్యేకాహ్వానితుడు శిమ్మ పాపినాయుడు అన్నారు. వనం- మనం కార్యక్రమంలో భాగంగా కోమర్తి గ్రామంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ శిమ్మ జగన్నాథం, ఎంపీటీసీ సభ్యుడు కింజరాపు సూర్యనారాయణ, ఎంపీడీవో విద్యాసాగర్, డ్వామా ఏపీవో త్రినాథరావు, నీటి సంఘం అధ్యక్షుడు ముద్దాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే బొరిగవలస, సుందరాపురం గ్రామాల్లో వనం-మనం కార్యక్రమం నిర్వహించారు.

వంద శాతం సబ్సిడీపై జింకు సరఫరా


ఏవో మురళీధర్

సారవకోట: వంద శాతం సబ్సిడీపై ఇంత వరకు 20టన్నుల జింక్‌సల్ఫేటు సరఫరా చేశామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.మురళీధర్ తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడారు. మరో 15టన్నుల జింకు కోసం ఇండెంట్ ఇచ్చామని అన్నారు. 130 వరకు స్ప్రేయర్లు సరఫరా చేశామన్నారు. రూ.5,200 ముందుగా ప్రభుత్వానికి చెల్లిస్తే స్పేయర్ తీసుకున్న వారి ఖాతా ఏభై శాతం పైకం జమ అవుతుందని చెప్పారు. మండలంలో బుడితి, చీడిపూడి, అవలంగి, లక్ష్మీపురం, గుమ్మపాడు, గోపాలపురం గ్రామాల్లో 110మంది వరకు రైతులు పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని వివరించారు. సారవకోట పీఏసీఎస్‌కు 10టన్నుల డీఏపీ, 5టన్నుల యూరియా సరఫరా చేశారని, అలాగే బుడితి పీఏసీఎస్‌కు 28-28-0ఎరువు ఐదు టన్నులు, 25 20 2 0013 ఎరువు ఐదు టన్నులు, పొటాష్ పన్నెండున్నర టన్నులు సరఫరా అయినట్టు ఆయన వివరించారు. 292 మంది కౌలుదారుల పత్రాలు ఇచ్చామని తెలిపారు. నలుగురు కౌలు రైతులు గ్రూపుగా తయారైతే బాంకుల ద్వారా రుణాలు మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. మండలంలో 6,547హెక్టార్లలో వరి పండిస్తున్నారని ఆయన తెలిపారు.

డ్వామా ఏపీడీగా వాసుదేవరావు



జలుమూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా పనిచేస్తున్న పి.వాసుదేవరావుకు డ్వామా సహాయక ప్రాజెక్టు డైరెక్టరుగా పదోన్నతి లభించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే పంచాయతీరాజ్‌శాఖ 517 జీవోను విడుదల చేసినట్లు ఈవోపీఆర్డీ అప్పలనాయుడు తెలిపారు. ఈమేరకు పి.వాసుదేవరావును ఈవోపీఆర్డీ, సిబ్బంది శనివారం అభినందించారు.

'ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేయొద్దు'

ఉరజాం(పోలాకి): ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ అసహనంతో ఇష్టారాజ్యంగా సీఎంపై ఆరోపణలు, వ్యాఖ్యలు చేయొద్దని, ప్రజాస్వామ్య వ్యవస్థను గుర్తెరగాలని టీడీపీ పోలాకి మండల శాఖ నాయకులు సూచించారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రాజరిక వ్యవస్థ అమలులో లేదని, జగన్ గుర్తెరగాలని లేకుంటే రానున్న ఎన్నికల్లో ఓటర్లంతా తగిన బుద్ధి చెబుతారని టీడీపీ నాయకులు కిల్లివేణు, మిరియప్పల్లి వెంకటప్పలనాయుడు, బైరి భాస్కరరావు, చిట్టిసింహాచలం, తర్ర లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో ఎంవీ నాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠం


తల్లి పాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సంగమయ్య పాఠశాల హెచ్‌ఎం

నరసన్నపేట: తల్లిపాలతోనే పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా ఆదివారంపేట అంగన్‌వాడీ కేంద్రంలో నరసన్నపేట సెక్టార్ పరిధిలోగల అంగన్‌వాడీ కార్యకర్తలకు, బాలింతలకు, గర్భిణులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తాళాభక్తుల గోవిందరావు, జన్మభూమి కమిటీ సభ్యులు బోయన ఆనందరావు, పంగ మాదవి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎల్. తులసీబాయ్, ఆర్.నాగేశ్వరి, వెంకటలక్ష్మి, ఉషా, భవాని, రాజేశ్వరి, పట్ట భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.


గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

సంగమయ్యపేట(పోలాకి): తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని సంగమయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గ్రామాభివృద్ధి కమిటీ నాయకుడు సీహెచ్ చంద్రరావు అన్నారు. సంగమయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త ఏ.భానుమతి ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. నరసన్నపేట ప్రాజెక్టు పరిధిలో పిన్నింటిపేట సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యకర్తలు ప్రదర్శించిన పౌష్టికాహార వస్తు ప్రదర్శనను సూపర్‌వైజర్ పి.జయ తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఘనంగా శని త్రయోదశి పూజలు


దీర్ఘాశి శనీశ్వరాలయంలో పూజలు చేపడుతున్న భక్తులు

పోలాకి: శని త్రయోదశి పవిత్రదినాన్ని పురస్కరించుకుని శనీశ్వరాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో తైలాభిషేకాలు చేశారు. అర్చకులు జడా దాలయ్య, చిన్నవాడు ఆధ్వర్యంలో దీర్ఘాశి శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం నుంచే భక్తులు శనీశ్వరాలయాల వద్ద బారులు తీరారు. పోలాకి, పిన్నింటిపేట, ఈదులవలస, ప్రియాగ్రహారం, దీర్ఘాశి, గ్రామాల్లో శనీశ్వరాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు నవగ్రహాలకు నవధాన్యాలతో పూజలు చేశారు. అలాగే ఈశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సారవకోట: శని త్రయోదశిని పురస్కరించుకుని శనివారం శనీశ్వరాలయాలకు భక్తులు పోటెత్తారు. సారవకోట ఉమా త్రైలోకేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో, అలాగే కోనేరు గట్టుపై ఉన్న శనీశ్వరాలయంలో, అవలంగి, నౌతల, బద్రి గ్రామాల్లో కొలువైన ఈశ్వరాలయాల ప్రాంగణాల్లో ఉన్న శనీశ్వరాలయాలకు భక్తులు బారులు తీరి నవగ్రహాలకు పూజలు చేశారు. ముఖ్యంగా శనీశ్వరుని విగ్రహానికి నువ్వుల నూనె, నువ్వులు తదితర సామగ్రితో పూజలు చేపట్టారు.

ఎండుతున్న పొలాలు..

- వరుణుడి కరుణ కోసం రైతుల ఎదురు చూపు


దేవాది వద్ద ఎండిన పొలం

నరసన్నపేట: గత కొన్నాళ్లుగా వర్షాలు లేకపోవడంతో వరి పైర్లు ఎండకి నాశనమవుతున్నాయి. మండలంలో గోపాలపెంట, దేవాది, మడపాం, మాకివలస తదితర గ్రామాల్లో సుమారు 550ఎకరాల్లో పంటపొలాలు ఎండకు మాడుతున్నాయి. పారశెల్లి, సుందరాపురం, బాడాం, చిక్కావలవలస, తోటాడ, నడగాం, శివరాంపురం, జలుమూరు మండలంలో కూర్మనాథపురం, రెల్లివలస, గుండువలస, తాళ్లవలస తదితర గ్రామాల్లో రైతుల పంట పొలాలకు నీరు అందించేందుకు ఇంజన్ల సహాయంతో అవస్థలు పడుతున్నారు. చెరువుల్లో నీరు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతన్నలు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. భానుడు రోజురోజుగా తన ప్రతాపాన్ని చూపించడంతో కాస్త నీటి ఇంజన్లతో కట్టిన నీరుకుడా ఒక్కరోజులోనే ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్యాస్ సమాచారం

నరసన్నపేట: స్థానిక హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ఈనెల 3న బుక్‌చేసిన వారికి, ఈనెల 2న బుక్ చేసిన ఇండియన్ గ్యాస్ వినియోగదారులకు శనివారం గ్యాస్ పంపిణీ చేయనున్నారు.

నరసన్నపేటలో సినిమాలు

శ్రీదేవి -	నక్షత్రం
రాజేశ్వరి -	ఫిదా
శ్రీవెంకటేశ్వర -	గౌతమ్‌నంద



నిరుపేదలకు దుస్తుల పంపిణీ

పాలకొండ రూరల్: నిరుపేదలకు సేవ చేయడంమే జనసేన సేవాదళ్ లక్ష్యమని జనసేన పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి గర్భాన సత్తిబాబు అన్నారు. ఈమేరకు శనివారం స్థానిక సనారీవిశ్వేశ్వరస్వామి ఆలయం వీధిలో నివాసం ఉంటున్న 25 మంది నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొర్లి అభిరామ్‌దొర, గొర్లె మన్మథరావు, ఎం.శేఖర్, ఎన్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు చంద్రన్న బీమాతో అండ



బీమా చెక్కులను అందజేస్తున్న కొండలరావు

పాలకొండ రూరల్: నిరుపేదలకు చంద్రన్న బీమా పథకం అండగా నిలిచిందని నగరపంచాయతీ అభివృద్ధి కమిటీ సమన్వయకర్త పల్లా కొండలరావు అన్నారు. ఈమేరకు శనివారం నగరపంచాయతీ పరిధిలో 5, 13, 20 వార్డుల్లో లబ్ధిదారులకు చంద్రన్న బీమా చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఇటీవల మృతి చెందిన పైల జోగినాయుడు, తాతపూడి నర్సింహమూర్తి, కొమ్మాన ప్రసాద్‌లకు చెందిన కుటుంబసభ్యులు పైల రూప, తాతపూడి రమణమ్మ, కొమ్మాన పార్వతమ్మలకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ .25వేలు చొప్పున బీమా చెక్కులను అందజేశారు. అలాగే... లుంబూరులో ఇటీవల బోడసింగి సరోజిని మృతి చెందడంతో ఆమె భర్త పారయ్యకు రూ. 5వేలు చెక్కును ఏపీవో వై.నీలంనాయుడు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, చల్లా నాగరాజు, సుంకరి అనీల్‌దత్, కోలామూర్తి, టీపీవో వరప్రసాదరావు, సత్యవతి, వావిలపల్లి రమణమూర్తి, అల్లు జనార్దనరావు, వంగుపండు దుర్గారావు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు మౌనిక ఎంపిక



పాలకొండ రూరల్: స్థానిక శ్రీసత్యసాయి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని రత్నాల మౌనిక ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైంది. ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగంలో 983 మార్కులు సాధించినందుకు ఇన్‌స్పైర్ అవార్డు పొందింది. దీంతో మౌనికకు ఏడాదికి రూ.80వేలు చొప్పున ఐదేళ్ల ప్రభుత్వం నుంచి ఉపకార వేతనం అందుకోనుంది. మౌనిక ఎంపికపై ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ దూబ వెంకటరమణ, డైరెక్టర్స్ బి.లక్ష్మీనారాయణ, ఎస్.వాసుదేవరావు, ఆర్.కిశోర్, ఏవో బి.ప్రకాశరావు తదితరులు అభినందించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండండి

పాలకొండ టౌన్: అగ్నిప్రమాదాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి పి.బలరాం సూచించారు. ఈమేరకు శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అగ్నిప్రమాదాలపై అ వగాహన కల్పించారు. గ్యాస్, విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వి.సూర్యనారాయణ, ఎ.రాము, ఆర్.ఎల్‌నాయుడు, జి.జగదీశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

‘సమానపనికి సమాన వేతనం ఇవ్వండి’

పాలకొండ రూరల్: ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని భారతీయ మజ్దూర్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.అక్కలనాయుడు, ఎంబీజీనాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక ఆస్పత్రి సూపరింటిండెంట్ జె.భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న కార్మికులకు రూ.18వేలు జీతం అందించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో కోట్న అప్పన్న, జయరాజు, ఆదినారాయణ, రాజేశ్వరి, లక్ష్మి, రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

భామినిలో భారీ వర్షం

భామిని: మండల కేంద్రం భామినిలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం రైతులకు ఎంతో ఉపకరించనుంది. నారుమడులకు, ఉభాలకు పదును బాగుంటుందని రైతులు అంటున్నారు. అయితే... ఈ వర్షం తివ్వా కొండల వైపు లేకపోవడంతో ఊట గుంటల్లో నీరే అవకాశం లేద నేది వారి మాట. సాయంత్రం వర్షం కురవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు.



భామినిలో బస్సుల కోసం వర్షంలోనే విద్యార్థులు

తల్లిపాలలో పోషక విలువలు

సీతంపేట: తల్లిపాలలో ఎన్నో పోషక విలువలు ఉంటాయి. అవి బిడ్డల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సీతంపేట-1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిశువు జన్మించిన నాటినుంచి తొమ్మిది నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా వారిలో రోగ నిరోధకశక్తి పెంపొందుతుందన్నారు. తల్లీ,బిడ్డల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని.. వాటిని గర్భిణులు, చిన్నారులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ సవర లక్ష్మి, జడ్పీ కోప్షన్ సభ్యుడు సవరతోట మొఖలింగం, జడ్పీటీసీ పి.రాజబాబు, ఎంపీటీసీ సభ్యులు బిడ్డిక దమయంతినాయుడు, జయలక్ష్మి, మూరా మోహన్‌రావు, సీడీపీవో పి.నాగరాణి, సూపర్‌వైజర్లు ఎ.గౌరి, రామలక్ష్మి, ప్రసన్న పాల్గొన్నారు.





సామూహిక సీమంతాల్లో ఎమ్మెల్యే... తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో..

అడారు (వీరఘట్టం): పిల్లల ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో దోహదపడతాయని అడారు సర్పంచ్ నీలం జయమ్మ అన్నారు. మేరకు శనివారం అడారులో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గర్భిణులు బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మితోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

‘పచ్చదనం పెంపొందిద్దాం..’



ఎల్.ఎల్.పురం పాఠశాల ఆవరణలో..



మొక్కలు నాటుతున్న సర్పంచ్ రౌతు

ఎల్.ఎల్.పురం (పాలకొండ టౌన్): పచ్చదనం పెంపొందించేందుకు సమష్టిగా కృషి చేద్దాం అని రాష్ట్ర ఉపాధి హామీ డైరెక్టర్, ఎంపీపీ వారాడ లక్ష్మీసుమంత్‌నాయుడు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం ఎల్.ఎల్.పురం, పెదకోటిపల్లి గ్రామాల్లో నిర్వహించిన వనం-మనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనం-మనం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి దాన్ని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.తిరుపతిరావు, సర్పంచ్‌లు వారాడ మంగమ్మ, ఎం.వెంకటమ్మ, ఏపీవో ఆర్.సాగర్, ధర్మారావు, ఉపాధ్యాయులు బి.వి.రమణ, కృష్ణ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

కుంబిడి ఇచ్చాపురం (వీరఘట్టం): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా గుర్తించాలని కత్తుల కవిటి సర్పంచ్ రౌతు దామోదరరావు అన్నారు. ఈమేరకు శనివారం కుంబిడి ఇచ్చాపురంలో నిర్వహించిన వనం-మనం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మొక్కలు నాటిన అనంతరం వాటిని సంరక్షిం చే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఆర్ఎస్‌టీ కేంద్రాలకు సర్వే

సీతంపేట: ప్రాథమిక పాఠశాలలు లేని ప్రాంతాల్లో ఎన్ఆర్ఎస్‌టీసీ కేంద్రాలను నెలకొల్పేందుకు సర్వశిక్ష అభియాన్ అధికారులు శనివారం మండలంలో వివిధ గ్రామాల్లో సర్వే చేపట్టారు. పాఠశాలలు లేని ప్రాంతాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో ఉన్న చిన్నారులకు ఉచిత విద్యాబోధన చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు సర్వశిక్ష అభియాన్ అధికారులు ఎం.మురళీకృష్ణ, ఆర్.గోవిందరావు తెలిపారు. పుట్టిగాం, బంజారుగూడ, పెద్దగూడ, గొయ్యిగూడ గ్రామాల్లో ఈ కేంద్రాలను నెలకొల్పడానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కేంద్రాల్లో పనిచేయడానికి వలంటీర్లను నియమించి వారి జీతభత్యాలను సర్వశిక్ష అభియాన్ ద్వారా అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, సీఎంవో ఎ.సంజీవరావు, ఎస్.మోహన్, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



సర్వే చేపడుతున్న అధికారులు

‘సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి’

సీతంపేట: ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గురుకులాల కార్యదర్శి దేవర వాసు సూచించారు. వైటీసీ భవనంలో శనివారం నిర్వహించిన మల్లి ప్రతిభా జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందనీ.. వాటికి సరిపడే ప్రతిఫలాన్ని విద్యార్థులు అందించాల్సి ఉందన్నారు. విద్యాబోధనతో పాటు ఉద్యోగ పోటీ పరీక్షలకు అందజేస్తున్న శిక్షణ సద్వినిమోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఎన్ఐటీలో సీటు సాధించిన ఎస్.శ్రీకాంత్‌ను అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో ఆంధ్రావర్సిటీ ప్రొఫెసర్ వేణు, ప్రిన్సిపాల్స్ బి.రామారావు, గణేశ్వరరావు, కె.సురేష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గురుకులాల రాష్ట్ర కార్యదర్శి వాసు

సినిమాలు

పాలకొండ

శ్రీరామ కళామందిర్: గౌతమ్ నంద

వెంకటగౌరి: ఫిదా

వీరఘట్టం

బీఎంఆర్ థియేటర్: గౌతమ్ నంద

'ప్రతి ఇల్లు పరిశుభ్రంగా కనిపించాలి'

జలగలింగుపురం(మెళియాపుట్టి): ప్రతి ఇల్లు పరిశుభ్రంగా ఉండాలని ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు అన్నారు. శనివారం ఆయన జలగలింగుపురంలో పారిశుధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. వర్షం పడితే నీరు కాలువల ద్వారా వెళ్లేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనివలన దోమలు బెడద ఉండదని చెప్పారు. గ్రామాలను ఆదర్శంగా తీర్చి దిద్దుకోగలిగితే గ్రామస్థులకే మంచిపేరు వస్తుందన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ ప్రసాద్‌పండా, కార్యదర్శి ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

హిరమండలం: ఎంపీపీ గవర పద్మావతి అధ్యక్షతన శనివారం నిర్వ్హాంచిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. గ్రామాల్లో తిష్ఠవేసిన సమస్యలపై నిలదీసే వారు లేకపోవడంతో అధికారులు వేదిక మీదకు వచ్చి ఆయా శాఖల ద్వారా మంజూరవుతున్న పథకాల వివరాలు చదివి వినిపించి వెళ్లిపోయారు. కొంతమంది ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెంటనే వెళ్లిపోవడం విశేషం. సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యల్ని పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతుండడం వలనే సంతకాలు చేసి వెళ్లిపోతున్నామని పలువురు సభ్యులు వ్యాఖ్యానించారు. మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అధ్వాన్నంగా ఉందని, సూపర్‌వైజర్ వరహాలమ్మ పనితీరు బాగులేదని, ఆమెను మార్చాలని ఎంపీపీ పద్మావతి చెప్పారు. జూన్ నెలకు సంబంధించి కిరోసిన్ చాలామంది డీలర్లు పంపిణీ చేయకుండా చేతివాటం చూపించారని, దీనిపై ఎందుకు చర్యలు తీసుకోలదని వైస్ ఎంపీపీ నక్క వెంకటరావు ప్రశ్నించారు. దీనికి సమాధానం ఇవ్వకుండా తహసీల్దార్ కార్యాలయం సీనియర్ సహాయికుడు దాటవేశారు. ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల బిల్లులు చెల్లించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని పలువురు సభ్యులు ఏపీవో శ్రీదేవిని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు గవర చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

డీ పట్టాలు ఇప్పించరూ...



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

ఎల్.ఎన్.పేట: మండల పరిధి సరడాం రెవెన్యూ పరిధిలోని తమ భూములకు డీ పట్టాలు ఇవ్వాలని సీతంపేట మండలం కొండచొర్లంగి గ్రామానికి చెందిన గిరిజనులు సవర కనకారావు, జగ్గయ్య, రంగయ్య, తదితరులు శనివారం తహసీల్దార్ కె.అప్పారావుకు వినతిపత్రం ఇచ్చారు. కొన్నేళ్లుగా ఈ భూములు తమ స్వాధీనంలోనే ఉన్నాయని, పంటలు పండించుకుంటున్నామని వారు పేర్కొన్నారు. ఇంతవరకు ప్రభుత్వం ఈ భూములకు పట్టాలు ఇవ్వలేదని, ఇప్పుడు డీ పట్టాలు ఇచ్చి తమకు హక్కును కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

'మొక్కలను పిల్లల్లా పెంచుకుందాం'



నడసంద్ర పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

నడసంద్ర(మెళియాపుట్టి): మొక్కలను పిల్లల్లా పెంచగలిగితే మంచిదని ఈవోపీఆర్‌డీ ప్రసాద్‌పండా అన్నారు. నడసంద్రలో శనివారం వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. పాఠశాల ఆవరణలో మొక్కలుంటే పిల్లలకు ఆహ్లాదకరంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు ఒక మొక్క పెంచగలిగితే మంచిదన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నీటి నిల్వలను పెంచుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలను అంతా ఆచరించగలిగితే భవిష్యత్ తరాల వారికి ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్, కార్యదర్శి శివాజీ, ఏపీవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధన'



డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న సీఐ

కొత్తూరు: ఆధునిక పద్ధతుల్లో బోధించాలని కొత్తూరు సీఐ జె.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విజ్ఞానభారతి హైస్కూల్‌లో డిజిటల్ పాఠ్యాంశాలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ డిజిటల్ బోధన దోహదపడుతుందని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కె.త్రినాథరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎల్.తులసీవరప్రసాదరావు, ఎల్.లక్ష్మీనారాయణనాయుడు, మల్లా విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పాడలి వీఆర్వో బదిలీ

హిరమండలం: మండలంలోని పాడలి వీఆర్వో వి.వెంకటేశ్వరరావును ఇచ్ఛాపురం బదిలీ చేసినట్లు తహసీల్దార్ ఎం.కాళీప్రసాదరావు చెప్పారు. ఆయన స్థానంలో గులుమూరు వీఆర్వో భాస్కరరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించామని తెలిపారు.

ఇళ్లు త్వరగా నిర్మించుకోండి

● ఆర్డీవో గున్నయ్య

హిరమండలం: వంశధార నిర్వాసితులు తమకు కేటాయించిన పునరావాస కాలనీల్లో త్వరగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని పాలకొండ ఆర్డీవో రెడ్డి గున్నయ్య అన్నారు. శనివారం ఆయన పాడలి పంచాయతీ పరిధి సోలిపి గ్రామంలో నిర్వాసితులతో మాట్లాడారు.గ్రామంలో ఉన్న కుటుంబాలకు అన్ని రకాల నష్టపరిహారాలు చెల్లించినట్లు చెప్పారు. గ్రామాలు ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామస్థులు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ఇళ్లు కట్టుకునేందుకు ఇబ్బందులు ఉన్నాయని, కొంత సమయం కావాలని కోరారు. అందుకు అధికారులు అంగీకరించలేదు.మరికొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాని కోరారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ సీతారామారావు, తహసీల్దార్ కాళీప్రసాదరావు, ఆర్ఐ గౌరీశంకరరావు పాల్గొన్నారు.



సోలిపి నిర్వాసితులతో మాట్లాడుతున్న అధికారులు

'ప్రజా సమస్యలు పరిష్కరించండి'



గొయ్యిని పరిశీలిస్తున్న వైసీపీ నేతలు

పాతపట్నం: ప్రజా సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. శనివారం ఆమె స్థానిక ఆల్ ఆంధ్రా రోడ్డులోని గోతులమయమైన రోడ్డును పరిశీలించిన అనంతరం విలేఖర్లతో మాట్లాడారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో గోతులను దాటుకుని ప్రయాణించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయం టీడీపీ నేతలకు కనిపించదా అని ప్రశ్నించారు. సొంత నియోజకవర్గంలో తిష్ఠవేసిన సమస్యల్ని పరిష్కరించలేని స్థానిక ఎమ్మెల్యే నంద్యాలలో ఎన్నికల ప్రచారానికి వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. విలువలకు కట్టుబడే ఎమ్మెల్సీ చక్రపాణిరెడ్డి పదవికి రాజీనామా చేశారని, ఎమ్మెల్యే కలమట ఈ విషయాన్ని గుర్తెరగాలన్నారు. ఆమె వెంట రేగేటి షణ్ముఖరావు, రజిత్, టి.వి.వి.కుమార్, యడ్ల గోవిందరావు, మద్ది నారాయణరావు, రెడ్డిరాజు, జానకమ్మ, వరలక్ష్మి, గోవిందరావు తదితరులు ఉన్నారు.

'అర్హులందరికీ యూత్ ప్యాకేజీ'

ఇరపాడు(కొత్తూరు): నిర్వాసితుల్లో అర్హులందరికీ యూత్ ప్యాకేజీ అందించి ఆదుకుంటామని తహసీల్దార్ సావిత్రి చెప్పారు. శనివారం ఆమె ఇరపాడు గ్రామంలో యూత్ ప్యాకేజీ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామంలో 369 మందికి యూత్ ప్యాకేజీ అందించాల్సి ఉండగా ఇప్పటికే 329 మందికి ఇచ్చామని, మిగిలిన వారికి ఇప్పుడు అందజేశామన్నారు. గ్రామస్థులు పునరావాస కాలనీల్లో కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని గ్రామాలను ఖాళీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణారావు, వీఆర్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.



యూత్ ప్యాకేజీ చెక్కులను అందజేస్తున్న దృశ్యం

'అనుమతి లేకుండా పాఠశాలలు నడిపితే చర్యలు'

మెట్టూరు(కొత్తూరు): అనుమతులు లేకుండా నడుపుతున్న సాయిరాం పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఎంఈవో కె.త్రినాథరావు తెలిపారు. శనివారం ఆయన ఈ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తుండడంపై తీవ్రంగా మండిపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఇటువంటి పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించవద్దని సూచించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా పాఠశాలను నడుపుతున్న ఈ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాదరావుపై చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు.

'తల్లి పాలే పిల్లలకు ఉత్తమ పౌష్ఠికాహారం'

పాతపట్నం: పిల్లలకు తల్లిపాలే ఉత్తమ పౌష్ఠికాహారం అని ఎంపీటీసీ సభ్యుడు మిరియాబిల్లి బాబూరావు అన్నారు. మండలంలోని గంగువాడ, తెంబూరుల్లో శనివారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. అనంతరం సామూహిక సీమంతాలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ బమ్మిడి సింహాచలం, అంగనవాడీ కార్యకర్త ముద్దమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా అందజేత

జాడుపల్లి(మెళియాపుట్టి): గ్రామానికి చెందిన పొందర ఏకాంబరం మృతిచెందడంతో ఆయన కుటుంబానికి చంద్రన్న బీమా పథకం కింద తక్షణ సాయంగా మంజూరైన నగదును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ చంద్రన్న బీమాను రూ.30 వేలు నుంచి రూ.2 లక్షల వరకు పెంచడం అదృష్టంగానే భావించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకంలో సభ్యత్వం తీసుకుని బీమా ప్రయోజనాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కదంబాల పైడిరాజు, కోదండ, రాజాపు త్రినాథ్, బోరు లోకేసు, బీమా మిత్ర విమోచిని తదితరులు పాల్గొన్నారు.



బీమా నగదును అందజేస్తున్న నేతలు

పాతపట్నంలో సినిమాలు

ఉమామహల్: నక్షత్రం

హిరమండలంలో..

వరలక్ష్మి : నక్షత్రం

కొత్తూరులో..

గౌరీశంకర : ఫిదా

ఉమాశంకర: గౌతమ్‌నంద

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం అర్బన్: రాజాం ప్రభుత్వ ఐటీఐలో పలు కోర్సులలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.నర్సింహులు తెలిపారు. 2017 సంవత్సరానికి గాను ప్రవేశాలకు పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. రూ.10 చెల్లించి ఐటీఐ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చునని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఆగస్టు 15 సాయంత్రం ఐదు గంటల లోగా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. 17 న ఉదయం 10 గంటల నుంచి అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

అధికారుల పనితీరుపై సభ్యుల ధ్వజం

● వాడీవేడిగా రేగిడి మండల సమావేశం ● నామమాత్రంగా పలు శాఖలపై చర్చ



ఉపాధి ఏపీవోను నిలదీస్తున్న సభ్యుడు

రేగిడి: ఉపాధి, రెవెన్యూ, మడ్డువలస రిజర్వాయర్‌కు సంబంధించిన అధికారులపై సభ్యులు ధ్వజమెత్తారు. వారి పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వైస్ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం జరిగింది. తొలుత ఏపీవో అరుణకుమారి మరుగుదొడ్ల నిర్మాణాలపై మాట్లాడుతుండగా.. సభ్యులు అడ్డు తగిలారు. మరుగుదొడ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నప్పటికీ బిల్లుల చెల్లింపులో ఎందుకు తాత్సారం చేస్తున్నారని కోడిశ ఎంపీటీసీ సభ్యుడు నెల్లి పెంటన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లు లు చెల్లించకుండానే లక్ష్యాలకు చేరుకోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. మరుగుదొడ్ల బిల్లుల కోసం ఎన్నిరోజులు గడువు కావాలని ప్రశ్నించారు. అలాగే.. ఇంకుడు గుంతలకు బిల్లులు చెల్లింపులు చేయకపోవడంపై ఆక్షేపించారు. పౌరసరఫరాల శాఖ సమీక్షలో తహసీల్దారు సూరమ్మ మాట్లాడుతుండగా.. రెండు నెలల నుంచి పంచదార, కిరోసిన్ ఇవ్వడం లేదనీ.. దీంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని ఆడవరం సర్పంచ్ కర్నేన మహేశ్వరరావు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సాగు నీటికి సంబంధించిన సమీక్షలో మడ్డువలస రిజర్వాయిర్ ఏఈ నాగేంద్ర మాట్లాడుతూ.. ఖరీఫ్ వ్యవసాయానికి వర్షాలు అనుకూలిస్తే గానీ కాలువల ద్వారా సాగునీరు అందించలేమని అన్నారు. ఇందుకు స్పందించిన ఆడవరం సర్పంచ్, కోడిశ ఎంపీటీసీ సభ్యుడు కర్నేన మహేశ్వరరావు, నెల్లి పెంటన్నాయుడు మాట్లాడుతూ.. నీరు- చెట్టు పథకం ద్వారా కుడి ప్రధాన కాలువకు, 17ఎల్, 19 ఎల్ కాలువల మరమ్మతులు, పూడికతీతలకు ప్రతిపాదనలు పంపించకపోవడంపై సభ్యులు మండిపడ్డారు. 2017 మే 21న.. 22వ కెనా ల్ పనులకు 18 గ్రామాల పరిధి కాలువలకు ప్రతిపాదనలు కలెక్టర్ పంపించాలని విన్నవించినా ఎందుకు నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ సమీక్షలో ఏవో మధుసూదనరావు.. ఖరీఫ్‌కు సంబంధించి పలు సూచనలిచ్చారు. అనంతరం.. ఆరోగ్యం, పశువైద్యం, విద్య, ఇరిగేషన్, హౌసింగ్, ఎక్సైజ్, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖల చర్చ నామమాత్రంగానే జరిగింది. తోటపల్లి ఇరిగేషన్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశంలో సమావేశంలో ఎంపీడీవో బాసూరి శంకరరావు, జడ్పీటీసీ సభ్యురాలు మంతి న ఉషారాణితో పాటుఅధికారులు పాల్గొన్నారు.

‘మొక్కలు నాటండి.. వాటిని సంరక్షించండి’



మొక్కలు నాటుతున్న వైస్ ఎంపీపీ రామకృష్ణంనాయుడు

రేగిడి: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి.. వాటిని సంరక్షించాలని వైస్ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం వనం-మనం కార్యక్రమంలో భాగంగా చాటాయవలసలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ వాతావరణంలల సమతుల్యత మొక్కలు నాటడం వల్లే సాధ్యమని వివరించారు. ఎవెన్యూ ప్లాంటేషన్ ద్వారా రోడ్డుకిరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో చాటాయవలస సర్పంచ్ గిరడ సింహాచలం, ఏపీవో అరుణకుమారి, ఏపీఎం జి.గోవిందరావు, ఈసీ కార్తీక్, టెక్నికల్ అసిస్టెంట్లు భారతి, సత్యనారాయణలు తదితరులు ఉన్నారు.

టీడీపీ సంక్షేమ నిధి నుంచి రూ.2లక్షల సాయం



చెక్కు అందజేస్తున్న దృశ్యం

రేగిడి: తెలుగుదేశం ప్రభుత్వం కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ.. 2 లక్షల చెక్కును శనివారం కోడిశ నీలవేణికి జెడ్‌పీటీసీ సభ్యురాలు మంతిన ఉషారాణి, వైస్ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు, ఎంపీడీవో బాసూరి శంకరరావులు పంపిణీచేశారు. ఏప్రిల్ 14 న ఉనుకూరు గ్రామానికి చెందిన కోడిశ దుర్గారావు ఆటో ప్రమాదంలో తీవ్ర గాయాలై మృతిచెందిన ఆ కుటుంబానికి ఆదుకునేందుకు దేశం పార్టీ సంక్షేమ నిధి నుంచి రూ. 2 లక్షలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలు ప్రమాదవశాత్తు మృతిచెందితే వారి కుటుంబాలకు ఆదుకునేందుకు సంక్షేమ నిధి భరోసానిస్తుందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ తెంటు కృష్ణ, ఎంఈవో ఎంవీ ప్రసాదరావు, కర్నేన మహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రహదారి పనుల అడ్డగింత



అరసాడలో రహదారి నిర్మాణం

అరసాడ(వంగర): అరసాడలో జరుగుతున్న ప్రధాన రహదారి పనులను కొందరు గ్రామస్థులు శనివారం అడ్డగించారు. గ్రామానికి చెందిన జనార్దన తమ భూమిలో రోడ్డు వేస్తున్నారంటూ అభ్యంతరం తెలిపారు. దీంతో జేఈ నాగభూషణ్ అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రభుత్వ స్థలంలో వేస్తున్న రహదారికి ఎవరు అడ్డు తగిలినా ఉపేక్షించేది లేదనీ.. కేసు పెడతామని హెచ్చరించడంతో జనార్దన వెనక్కి తగ్గారు. దీంతో రహదారి పనులు యథావిధిగా మొదలయ్యాయి.

168వ రోజుకు చేరిన రిలే దీక్షలు

వాల్తేరు(సంతకవిటి): వాల్తేరు, ఇసుకలపేట గ్రామాల మధ్య నాగావళి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షలు శనివారం 168 వరోజుకు చేరుకున్నాయి. ఈమేరకు శనివారం నిర్వహించిన దీక్షలో జి.సరస్వతి రావు, ఎత్తిరాజులు, కనకరాజు, భాస్కరరావు, సింహాచలం, రామారావు, రామయ్య, లక్ష్మణరావు, రాజారావు, లలిత, నారాయణస్వామి, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

‘మొక్కలు పెంచుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం..’





రాజాం రూరల్: మొక్కలు నాటి నీరు పోస్తున్న ప్రతిభాభారతి... సంతకవిటి: కేఆర్‌పురంలో మొక్కలు నాటుతున్న ఏపీవో హరనాథ్

ఒమ్మి(రాజాం రూరల్): మొక్కలు నాటి.. తద్వారా పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కావలి ప్రతిభా భారతి పిలుపునిచ్చారు. ఒమ్మిలో శనివారం వనం మనం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ వంగా వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా, ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, అంగన్‌వాడీకేంద్రాలు, పాఠశాలల వద్ద విధిగా మొక్కలు నాటాలని సూచించారు. రాజాం నియోజకవర్గ పరిధిలోనే 20వేలు మొక్కలు నాటాలన్నది లక్ష్యంగా నిర్ణయించామన్నారు. అన్ని మండలాల నాయకుల సమన్వయంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు గురవాన నారాయణరావు, టంకాల కన్నంనాయుడు, రౌతు లక్ష్మం, చిగురకోట రంగారావు,నాగళ్ల అప్పలనాయుడు, మీసాల సత్యంనాయుడు, బూరాడ కృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు వంగా గోవిందరావు, వంగర పార్టీ అధ్యక్షుడు బెజ్జిపురపు త్రినాథ, బొత్స లక్ష్మం పాల్గొన్నారు.

కేఆర్‌పురం(సంతకవిటి): వనం-మనం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో పలుచోట్ల మొక్కలు చేపట్టారు. గుళ్లసీతారాంపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు కె.అప్పలనాయుడు, కేఆర్‌పురంలో సర్పంచ్ పండు వెంకటకృష్ణారావు, గోళ్లవలసలో ఏపీవో హరనాథ్, గోవిందపురంలో సర్పంచ్ అదపాక సూరీడమ్మల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో ఉపాధి హామీ సిబ్బందితో పాటు మహిళా స్వయంశక్తి సంఘాలతో పాటు ఆయా గ్రామాల రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

‘తల్లిపాలే పిల్లలకు శ్రేష్ఠం’



మాట్లాడుతున్న సెక్టార్ సూపర్‌వైజర్ జ్ఞానమ్మ

రేగిడి: తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠం. ముర్రిపాలు పిల్లలకు ఆరునెలలుగా పడితే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ జ్ఞానమ్మ వివరిం చారు. ఈమేరకు శనివారం చాటాయవలస, అక్కన్న అగ్రహారం తదితర గ్రామాల్లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తల్లిపాలు చిన్నారులకు పట్టడం వల్ల వారిలో రోగ నిరోధకశక్తి పెరగుతుందన్నారు. ఈ విషయంపై బాలింతలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త, ఆయాలు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

దోసరి సర్పంచ్‌కు పితృవియోగం

దోసరి(రాజాం అర్బన్): దోసరి సర్పంచ్ కరణం శివశంకర్ తండ్రి అచ్చెన్నాయుడు (87) శనివారం మృతి చెందాడు. రైతు కుటుంబానికి చెందిన అచ్చెన్నాయుడు మృతిపై టీడీపీ మండల నాయకులు సంతాపం ప్రకటించారు. శివశంకర్‌ను పరామర్శించారు.

ఘనంగా ఫ్రెండ్‌షిప్‌డే వేడుక

అంతకాపల్లి(రాజాంఅర్బన్): అంతకాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఫ్రెండ్‌షిప్‌డే పురస్కరించుకుని శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల మధ్య స్నేహపూరిత వాతావరణం ఉండాలని స్నేహానికి మించిన ఆస్తి లేదని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వివరించారు. కష్టసుఖాలలో స్నేహితుడు అన్ని విధాల అండగా ఉంటాడని అందుకే ప్రతి ఒక్కరూ కనీసం ఒక్కస్నేహితుడినైనా కలిగి ఉండాలని సూచించారు. ఎఫ్ ఆకారంలో విద్యార్థులు కూర్చొని ఆకట్టుకున్నారు.

తాగునీటికి రూ.60లక్షలతో
ప్రతిపాదనలు

జి.శ్రీచరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ. 60 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించామని.. త్వరలో పనులు జరిగే అవకాశం ఉందని పంపించి పనులు ప్రారంభించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గొర్లె శ్రీచరణ్ తెలిపారు. ఈమేరకు ఆయన తాగునీటి పథకాలు, నీటి సరఫరా తదితర అంశాలపై 'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖి అయ్యారు. ఆ వివరాలివే..

ప్రశ్న: ఏయే గ్రామాల్లో తాగునీటి కల్పనకు ప్రతిపాదనలు పంపించారు?

జవాబు: ఉణుకూరు, పోరాం, కాగితాపల్లి, ఒప్పంగి, కోడిశ, పెదకోడిశ, కొండవలస తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రతిపాదనలు పంపించాం.

ప్రశ్న: రేగిడి ప్రాజెక్టు ద్వారా ఎన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు?

జవాబు: రేగిడి పైలెట్ ప్రాజెక్టు నుంచి 12 గ్రామాలకు.. రాజాం ప్రాజెక్టు నుంచి 9 గ్రామాలకు నీరు అందిస్తున్నాం.

ప్రశ్న: బొడ్డవలస, జావాం పైలెట్ ప్రాజెక్టుల ద్వారా ఎన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు?

జవాబు: బొడ్డవలస పైలెట్ ప్రాజెక్టు ద్వారా నాగావళి నుంచి 34 గ్రామాలకు, జావాం ప్రాజెక్టు నుంచి ఎనిమిది గ్రామాలకు తాగునీరు అందిస్తున్నాం.

ప్రశ్న: తాగునీటి పథకాలు ఎన్ని ఉన్నాయి? బోర్లు ఎన్ని ఉన్నాయి? ఎన్ని పనిచేస్తున్నాయి?

జవాబు: మండలంలో 19మంచినీటి పథకాలు ఉండగా, ఎనిమిది ఎంపీడబ్ల్యూఎస్ స్కీంలో తాగునీరు అందిస్తున్నాం. 417 బోర్లు ఉండగా వీటిలో 20 వరకు మరమ్మతులకు గురయ్యాయి. మరమ్మతులు చేపడుతున్నాం.

-రేగిడి

గ్యాస్ సమాచారం

లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో ఉన్న వినియోగదారులు ఈనెల 5 వరకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి సోమవారం గ్యాస్ సరఫరా చేస్తామని నిర్వాహకుడు సాయి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఏవైనా గ్యాస్ సమస్యలుంటే 08941- 251016, 251160, 94905 96519 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

సినిమాలు

రాజాం

అప్సర (ఎ.సి)- ఫిదా
సీతారామా (ఎ.సి)- నక్షత్రం
సీతారామా (మినీ)- గౌతమ్‌నంద

14 నాటికి పశుగ్రాస క్షేత్రాల
లక్ష్యాన్ని పూర్తిచేయండి!

వెలుగు సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ కిశోర్ ఆదేశం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిశోర్

రాజాంరూరల్: మండలాల పరిధిలో ఇచ్చిన పశుగ్రాస క్షేత్రాలు ఏర్పాటు లక్ష్యాన్ని ఈనెల 14 నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ జీసీ కిశోర్ ఆదేశించారు. ఈమేరకు శనివారం వెలుగు సమావేశ మందిరంలో రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి, జిసిగడాం మండలాల ఏపీఎంలు, వెలుగు సీసీలు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు మండలాల పరిధిలో సుమారు 1620 ఎకరాలలో 800 మంది రైతులతో పశుగ్రాసం పెంచాలన్నది లక్ష్యంగా నిర్ణయించామని వివరించారు. అన్ని గ్రామాల్లోను విధిగా పర్యటించి పశుగ్రాసం పెంచడానికి ముందుకు వచ్చిన రైతులను చైతన్య10 నుంచి 15పంచాయతీలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు ఆ గ్రామాల్లోని స్వయంశక్తి సంఘాల ప్రతినిధులకు అప్పగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏసీ ఎస్.శ్రీరాములు, డీపీఎం ఇన్సురెన్స్ జి.సీతారామయ్య, బి.రవికుమార్, కల్యాణ్, ఏపీఎంలు ఎన్.అప్పలనాయుడు, భవానీ, దదికుమార్, గోవిందరావు, సీతారాంతో పాటు అధికసంఖ్యలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

బోరుకు ప్లాట్‌ఫారం ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పూర్తయిన బోరు ప్లాట్‌ఫారం పనులు

ఎంఆర్ అగ్రహారం(సంతకవిటి): గోళ్లవలస పంచాయతీ ఎంఆర్ అగ్రహారంలో యాదవ వీధిలో బోరుబావికి అధికారులు ప్లాట్‌ఫారం ఏర్పాటు చేశారు. బోరు చుట్టూ ఫ్లాట్‌ఫారం లేకపోవడంతో నీరు కలుషితమవుతున్న విషయమై గతనెల 4న 'ఆంధ్రజ్యోతి'తో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కథనానికి జిల్లాస్థాయి అధికారులు స్పందించి తక్షణమే బోరు వద ప్లాట్‌ఫారం ఏర్పాటు చేయించాలని ఎంపీడీవో వేణుగోపాలనాయుడుని ఆదేశించారు. దీంతో బోరు చుట్టూ ప్లాట్‌ఫారం నిర్మించారు. కలుషిత నీటి సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'శ్రీవరి సాగుతో రైతులకు మేలు'



మాట్లాడుతున్న ప్రమీల

హొంజరాం (సంతకవిటి): ఖరీఫ్ సీజన్‌లో శ్రీవరి విధానంలో సాగు చేస్తే.. రైతులకు మేలు జరుగుతుందని ఆత్మ ఏటీఎం బి.ప్రమీల వివరించారు. ఈమేరకు శనివారం హొంజరాంలో రైతు సిరిపురపు కుమారస్వామికు చెందిన 5.40 ఎకరాల భూమిలో శ్రీవరి సాగు చేసే విధానం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... శ్రీవరి సాగు వల్ల పంట దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉండటంతో పాటు తెగుళ్ల, దోమపోటు, ఇతర సమస్యల నుంచి పంటను కాపాడుకోవచ్చునన్నారు. ఈ తరహా విధానంపై రైతులు దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు కుమారస్వామి, ఏవో రంగారావు, ఎంపీఈవో సాగర్ తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ



బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ

వాల్తేరు(సంతకవిటి): వాల్తేరులోని అగ్నిప్రమాద బాధితులను శనివారం ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించి.. వారికి భరోసా కల్పించారు. వాల్తేరులో 1 న జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఐదు బాధిత కుటుంబాలకు బస్తా బియ్యం, రూ. 5వేలు చొప్పున నగదు ఎమ్మెల్యే వితరణగా అందజేశారు. ప్రభుత్వపరంగా అందించాల్సిన సాయాన్ని బాధితులకు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధితులకు ఐఏవై గృహాల మంజూరు కోసం కలెక్టర్‌కు సిఫారుసు చేస్తానన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు గురుగుబిల్లి స్వామినాయుడు, జి.నారాయణరావు స్వామి, జి.సరస్వతిరావు, వైసీపీ నాయకులు జగన్మోహనరావు తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల అసోసియేషన్ సాయం

వాల్తేరు అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు వాల్తేరు ఉద్యోగుల అసోసియేషన్ ఐదు బస్తాల బియ్యం, దుప్పట్లను పంపిణీచేశారు. శనివారం సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి గాదెం రామారావు, గౌరవ అధ్యక్షుడు పి వెంకటరాజుల చేతుల మీదుగా బాధితకుటుంబాలకు వీటిని అందజేశారు. ఈకార్యక్రమంలో సంఘ సభ్యులు కొండలరావు, భాస్కరరావు, రాజు, గోపాలరావు, బాబూరావు తదితరులు ఉన్నారు.

'పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం'



బహుమతుల ప్రదానంలో ప్రముఖులు

రాజాం అర్బన్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జీఎంఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్ వీఆర్ఎస్వీ ప్రసాద్ అన్నారు. జీఎంఆర్ రేడియో, జీఎంఆర్ఐటీ ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్‌టెక్నాలజీ కమ్యూనికేషన్ పర్యవేక్షణలో శనివారం జీఎంఆర్ఐటీ ఆడిటోరియంలో ఆహారం, ఆరోగ్యం, స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని 20 పాఠశాలలకు చెందిన 30 బృందాలు ఈ అంశంపై నాటికలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో జీఎంఆర్ఐటీకి చెందిన కుటుంబ చదరంగం అనే నాటికకు ప్రథమస్థానం, సెయింటాన్స్ స్కూల్ రాజాంకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన లగ్జరీ లైఫ్, హెల్దీ లైఫ్ అనే నాటకానికి ద్వి తీయ స్థానం, డీఏవీ పబ్లిక్ పాఠశాలకు చెందిన హెల్దీ ఫుడ్ ప్రదర్శన కు తృతీయ బహుమతి దక్కింది. వీరికి వరుసగా రూ. 3 వేలు, 2 వే లు, వెయ్యి నగదు బహుమతిని, ప్రశంసా పత్రాలను ప్రిన్సిపాల్ అం దజేశారు. అదే విధంగా డోలపేట రవీంద్రభారతి , కంచరాం సృజన విద్యాలయ, డోలపేట సుధా పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నాటికలకు కన్సోలేషన్ బహుమతులు దక్కించుకున్నాయి. ఈ ప్రాజెక్టు ముఖ్య పరిశోధకుడు డాక్టర్ జి.మన్మథరావు మహిళా మేలుకో ప్రాజెక్టు ఉద్దేశాన్ని వివరించారు. కళాక్రియేషన్స్ వ్యవస్థాపక కార్యదర్శి గోకవలస కృష్ణమూర్తి, నంది అవార్డు గ్రహీతలు మీగడ మల్లికార్జునస్వామి, తురంగి విశ్వనాథం, జీఎంఆర్ఐటీ గర్ల్స్ వసతిగృహ వార్డెన్ చింతల ల క్ష్మి... కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా నిర్వహించారు.కార్యక్రమంలో జీఎంఆర్ఐటీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజామురుగుదాస్, సహ పరిశోధకురాలు కామేశ్వరి, వివిధ శాఖాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డులు సిద్ధం చేయండి

భామిని: పంచాయతీల వారీగా ఈనెల 8వ తేదీలోగా ఉపాధి రికార్డులన్నీ సిద్ధం చేయాలని ఏపీడీ గార రమణమ్మ సిబ్బందిని ఆదేశించారు. ఈమేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 10న సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న నేపథ్యంలో సిబ్బందిఅప్రత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నిమ్మల మాస, ఏపీవో ఆర్.బాబూరావు సిబ్బంది పాల్గొన్నారు.

సింగిడిలో పూరిల్లు దగ్ధం

సింగిడి (భామిని): సింగిడిలో పొట్నూరు చిట్టయ్యకు చెందిన పూరిల్లు శనివారం ఉదయం అగ్నికి ఆహుతైంది. చిట్టయ్య భార్య శాంతమ్మ ఇంట్లో దేవుని వద్ద దీపం పెట్టి ఉడుపు పనులకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు దీపం అంటుకుని మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఇంటి సామగ్రి కాలి బూడిదైంది. కుమారుడు పొట్నూరు శివ ఎంటెక్ సర్టిఫికేట్‌లు దగ్ధం అయి ఉంటాయని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఆర్ఐ రాంబాబు, వీఆర్‌వో సంజీవ్ సంఘటనా స్థలానికి చేరుకుని నష్టం అంచనా వేశారు.

చంద్రన్న బీమా పేదలకు అండ

కలెక్టరేట్: పేదలకు చంద్రన్న బీమా ఆర్థికంగా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నగరంలో 31వ డివిజన్‌లో ఎంపికైన పలువురు లబ్ధిదారులకు శనివారం ధ్రువీకరణపత్రాలు అందించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీమా పథకంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పారు. చంద్రన్న బీమా ద్వారా రాష్ట్రంలో ఎంతో మందికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వం ముందుచూపుతో ప్రవేశపెట్టిన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.సూర్యనారాయణ, పెద్ది కవిత, క్రిష్ణ, బీమా మిత్ర సిబ్బంది పి. రజినీ, పి.లక్ష్మీ, కల్యాణి, రమా తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, కమిషనర్

హరిత శ్రీకాకుళమే ధ్యేయం

శ్రీకాకుళం సిటీ: మొక్కలు నాటడం ద్వారా హరిత శ్రీకాకుళం ఆవిష్కరించవచ్చునని శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ పీవీ శోభ పేర్కొన్నారు. శనివారం నగరంలోని మంగువారితోటలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం అక్కడ రోడ్లను పరిశీలించారు. అక్కడున్న డివైడర్‌ను తొలగించి డ్రైనేజీ ఏర్పాటుచేయాలని ఆదేశాలు జారీ చేశారు.



అధికారులకు సూచనలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రైతుబజార్ ధరలు

కూరగాయలు	ధర(కిలో) రూ...
టమోటా	రూ. 46
వంకాయలు	రూ. 33
బెండకాయలు	రూ. 32
పచ్చిమిర్చి	రూ. 55-62
బీరకాయలు	రూ. 26
కాలీఫ్లవర్	రూ. 35
క్యాబేజీ	రూ. 16
క్యారెట్	రూ. 26
దొండకాయలు	రూ. 30
పచ్చిఅరటి	రూ. 32
ఉల్లి	రూ. 20
బీన్స్	రూ. 45
గోరుచిక్కుడు	రూ. 34
బంగాళదుంప	రూ. 12
అరటికాయ(జత)	రూ. 18
చామదుంప	రావడం లేదు
ఎర్రదుంపలు	రూ. 25
నూల్‌కోల్ దుంప	రూ.20
బీట్‌రూట్	రూ. 29
కీర	రూ. 25
ఫ్రెంచ్‌బీన్స్	రూ. 40
కాకరకాయలు	రూ. 28
అల్లం	రూ. 50
గోల్కొండచిక్కుళ్లు	రూ. 34-42
స్వీట్‌పొటాటో	రూ. 16
వెల్లుల్లి	రూ. 55
క్యాప్సీకం	రూ. 50

హైవేపై ప్రమాద నియంత్రణ చర్యలు భేష్

ఎస్పీ త్రివిక్రమవర్మ అభినందన



పోలీస్ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎస్పీ త్రివిక్రమవర్మ



(శ్రీకాకుళం సిటీ)

జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణలో పోలీసుల పనితీరు బాగుందని ఎస్పీ త్రివిక్రమవర్మ కితాబిచ్చారు. కానీ ప్రజలు జాగ్రత్తలు తీసుకోని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైవే భద్రతపై జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సమీక్షలో ఎస్పీ మాట్లాడారు. హైవే పోలీసుల పనితీరు కారణంగా చాలా ప్రాణా లు నిలుస్తున్నాయని ప్రశంసించారు. రవా ణా మంత్రి అచ్చెన్నాయుడు, బీజేపీ సాంబశివరావు ప్రమాదాలు తగ్గడంపై ప్ర శంసించడాన్ని ఆయన గుర్తు చేశారు. హైవే లో మరో రెండు వాహనాలు సమకూర్చుతామని ఎస్పీ చెప్పారు. జాతీయ రహదారిలో పోలీసులు అప్రమత్తంగా, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల పోలీస్ అధికారులు, వాహన దారులు ఇక్కడి పోలీసుల శ్రమను గుర్తించి అభినందిస్తుంటే ఎంతో గర్వంగా ఉందని చెప్పారు. అనంత రం సిబ్బంది అవసరాలను, సలహాలను అ డిగి తెలుసున్నారు. ముఖ్యమైన కూడళ్లలో సాయంత్రం 4 గంటల నుంచి మొబైల్ వాహనాన్ని నిలిపి విజిబుల్ పోలీసింగ్ చేయాలని....ఫైన్ వేయకుండా అవగాహన కల్పించటం వల్ల మార్పు వస్తుందన్నారు. అన్ని జంక్షన్లలో ఈ విధానం కొనసాగించాలన్నారు. నందిగాం ఫ్లైఓవర్ వంతెన వద్ద ఫ్లడ్‌లైట్స్ అవసరమని .... లారీలు రాంగ్ పార్కింగ్ ఉండే అవకాశం ఉన్నందున ఏర్పాటు చేయాలన్నారు. బైరి, కరజాడ, చిలకపాలెం, కొత్తరోడ్డు ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా ఉండే పిచ్చిమొక్కలు తొలగించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో పిల్లలను తల్లిదండ్రులు బైక్‌లపై రాంగ్‌రూటులో తీసుకు పోతున్నారని... వీటిని అరికట్టాలన్నారు. అన్నిచోట్ల ఇప్పటికే గస్తీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ కృష్ణమూర్తి నాయుడు, సీఐ పైడయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

హుషారైన పాటలతో ఆకట్టుకున్న గాయకులు

బాపూజీ కళామందిర్(పాతశ్రీకాకుళం) : నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సుకుమార్ ఆర్కెస్ట్రా వ్యవస్థాపకులు బండారు చిట్టిబాబు ఆధ్వర్యంలో లలితా సినీ సంగీత లహరి కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య 214వ నెలవారి కార్యక్రమంలో సంగీత విభావరి నిర్వహించారు. గాయకులు సాయిప్రశాంతి, వెంకటలక్ష్మి, పూర్ణిమ, డాక్టర్ టి.మాలతి, కళ్యాణం రామ్మోహన్ శ్రావ్యంగా ఆలపించారు. విశాఖ జాయింట్ పోలీస్ కమిషనర్ ఎ.ఎస్ ఖాన్ పాటలు పాడి ఉత్సాహపరిచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, గౌరవ అతిథిగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ప్రముఖ ప్రసూతి వైద్యనిపుణులు పి.మాలతిలు హాజరై నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 30 మంది పేద కళాకారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం ప్రముఖులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో చిట్టి వెంకటరావు, గౌరవ అధ్యక్షులు ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, పొట్నూరు వెంకటరావు, కలగ గణేష్‌యాదవ్, కె.వంసతకుమార్, నిక్కు హరిసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పాటలు పడుతున్న ఏసీపీ ఖాన్



హాజరైన సంగీత ప్రియులు



మాట్లాడుతున్న న్యాయమూర్తి

సామాజిక బాధ్యతగా పనిచేయండి

శ్రీకాకుళం లీగల్: చట్టపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సహాయం అందించే దిశగా సామాజిక బాధ్యతతో ప్యానల్ న్యాయవాదులు మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలగీతాంబ సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో రెండు రోజులపాటు ప్యానల్ న్యాయవాదుల శిక్షణ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యా యమూర్తి నిర్మలగీతాంబ మాట్లాడుతూ సమాజంలో చట్టపరమైన సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్న వారు న్యాయసేవాధికార సంస్థకు సంప్రదించాలన్నారు. అన్నివర్గాల వారికి న్యాయం అందాలనే లక్ష్యంతో న్యాయసేవాధికార సంస్థ ఏర్పాటైందన్నారు. సమాజసేవ చేయాలన్న ఔత్సాహికులైన న్యాయవాదులను ప్యానల్ న్యాయవాదులుగా రాష్ట్రన్యాయసేవాధికార సంస్థ ఎంపిక చేస్తుందన్నారు. ప్యానల్ న్యాయవాదులకు చట్టాలపై అవగాహన ఉంటుందన్నారు. వారికి అన్ని అంశాల్లో అవగాహన కల్పించేందుకే శిక్షణ నిస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణను ప్యానల్ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒకటో అదనపు న్యాయమూర్తి జి.గౌతమ్‌ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థాన న్యాయమూర్తిగోపాలకృష్ణారావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యామలాదేవి, అదనపు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి వివేకానంద శ్రీనివాస్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి శాంతిశ్రీ, మొబైల్ మెజిస్ట్రేట్ దేవిరత్నకుమారి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపు సత్యనారాయణ, శిక్షకులు ఆర్.శ్రీనివాసరావు, టి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



వెంకయ్య గెలుపుతో బీజేపీ నేతల ఆనందం

ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఘనవిజయం సాధించడంతో శ్రీకాకుళంలో బీజేపీ శ్రేణులు శనివారం విజయోత్సవం జరుపుకున్నాయి. బాణసంచా కాల్చి నాయకులు మిఠాయిలు పంచుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి పైడి వేణుగోపాలం, కోటగిరి నారాయణరావు, చల్లా వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం సిటీ

నగరపాలక సంస్థ అధికారుల ఫోన్ నంబర్లు

పీవీ శోభ ఐఏఎస్ - కమిషనర్ -	9849905787
నూకేశ్వరరావు - సహాయ కమిషనర్ -	9849908099
డి.భాస్కరరావు - ప్రజారోగ్య అధికారి -	9849906972
జి.వెంకటేశ్వరరావు - ఇంజనీర్ -	9000902338
దేవకుమార్ - సహాయ సిటీ ప్లానర్ -	9949996081
కిశోర్‌కుమార్- ప్రణాళిక అధికారి -	8897626999
జగన్మోహనరావు-మెప్మా అధికారి -	9701385743
అప్పలస్వామి - పట్టణ సర్వేయర్ -	9849906967
డి.గణేష్- శానిటరీ ఇన్‌స్పెక్టర్ -	8919228847
ప్రకాష్- శానిటరీ ఇన్‌స్పెక్టర్ -	9849908966

ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడం తగదు

కలెక్టరేట్: ఎస్సీ కార్పొరేషన్‌ను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో విలీనం చేయడం వల్ల ఎస్సీలకు తీరని అన్యాయం జరుగుతోందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బోనెల అప్పారావు అన్నారు. శనివారం సంఘం కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ షెడ్యూల్ కులాల అభివృద్ధికిగాను ఏర్పాటుచేసిన కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడం తగదన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగవకాశాలు లేక ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందన్నారు. అరాయితీపై అందించే రుణాలతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందకుండా పోతాయని వాపోయారు. విలీన ప్రక్రియ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే జిల్లావ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.


కరపత్రాలు అందిస్తున్న దృశ్యం

నగరంలో బీజేపీ నేతల విస్తృత ప్రచారం

శ్రీకాకుళం సిటీ:బీజేపీ శ్రీకాకుళం నగర అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక హడ్కోకాలనీలో నగర బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను కరపత్రాలు ద్వారా ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ బీజేపీ అనగానే సాదరంగా ఆహ్వానించి పథకాల గురించి తెలుసుకుంటున్నారని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేలా కేంద్ర ప్రభుత్వం 106 పథకాలు ప్రవేశపెట్టిందని... రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపొందటం ఖాయమన్నారు.కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శులు అల్లు మల్లేశ్వరరావు, సంపతిరావు రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సంపతిరావు రమణమూర్తి, నగర ఉపాధ్యక్షుడు చింతపల్లి గాంధీ, దయాసాగర్, మహిళా మోర్చ నగర అధ్యక్షురాలు గంగు శ్రీదేవి, కార్యవర్గ సభ్యులు చల్లా శ్రీలత, కణితి రామారావు, ఎస్సీ మోర్చా నగర అధ్యక్షుడు రుప్పా రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

గూనపాలెం, (శ్రీకాకుళం లీగల్): తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగమ్మ అన్నారు. స్థానిక గూనపాలెం సెక్టార్ పరిధిలోని అంగనన్‌వాడీ కార్యకర్తలు శనివారం ర్యాలీ చేపట్టారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సూపర్‌వైజర్ మంగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. 6నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని..దీని ద్వారా అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. ఈ మేరకు బొమ్మల ద్వారా తల్లిపాల విలువను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అలాగే గుజరాతీపేట సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ యశోధ ఆధ్వర్యంలో శనివారం గర్భిణీలకు సామూహిక సీమంతాలు జరిపారు. 6 నెలలు క్రమం తప్పకుండా శిశువులకు తల్లిపాలు అందించిన వారికి బహుమతులు అందజేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నిరాదరణలో.. నాయుడు చెరువు

- అసౌకర్యానికి గురవుతున్న స్థానిక ప్రజలు
- కలగా పార్కు నిర్మాణం
- గత టీడీపీ హయాంలో పనులకు శంకుస్థాపన
- పట్టించుకోని యంత్రాంగం


జనావాసాల మధ్య ఉన్న నాయుడు చెరువు ఇదే..



గుజరాతీపేట(పాతశ్రీకాకుళం)

నగరంలో గుజరాతీపేట-పీఎన్‌కాలనీ ప్రాంతాలు విస్తరిస్తున్నాయి. కొత్తవంతెన పూర్తయిన తరువాత ఈ ప్రాంతాల్లో నివసించేందుకు ప్రజలు ఆసక్తికనబరుస్తున్నారు. కానీ ప్రభుత్వపరంగా ఆశించినస్థాయిలో అభివృద్ధి జరగకపోవడంతో ప్రజలు పెదవివిరుస్తున్నారు. ఆధ్యాత్మికంగా ఆలయాలున్నా...సెలవురోజు ఆహ్లాదంగా గడిపేందుకు సరైన వేదిక లేదు. స్థానికంగా ఉన్న నాయుడు చెరువును పార్కుగా మార్చాలన్నది దశాబ్దాల కల. కానీ ప్రభుత్వాలు వస్తున్నాయ్...పోతున్నాయి కానీ కార్యరూపం దాల్చడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నాయుడు చెరువును పార్కుగా మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఇందుకు సంబంధించి పనులు కూడా ప్రారంభమయ్యాయి. అప్పటి ఎంపీ కింజరాపు ఎర్రన్నాయుడు పనులకు సంబంధించి శంకుస్థాపన కూడా పూర్తిచేశారు. అయితే తరువాత మారిన పరిస్థితులు, ప్రభుత్వాలు మారడం తదితర కారణాల వల్ల పనులు మరుగున పడిపోయాయి. తరువాత దీని గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రస్తుతం ఈ చెరువు ఆక్రమణలబారిన పడి దయనీయస్థితిలో ఉంది. నిర్వహణ లేక దారుణంగా తయారైంది. చుట్టుపక్కల వారు చెత్త పారబోస్తుండడంతో మురుగునీరు పేరుకుపోతోంది. దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాకాలంలో చెరువు నీటితో హయాతీనగరం, గుజరాతీపేట, పీఎన్‌కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో చెరువు నీటిని సాగునీటి అవసరాలకు వినియోగించే వారు. కానీ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. నెలల తరబడి మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రానికే స్వైరవిహారం చేస్తుండడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు.


చుట్టూ ముళ్ల పొదలు

ప్రజా సహకారంతోనే సిక్కోలు శుభ్రత సాధ్యం

● **నగరపాలక సంస్థ కమిషనర్ శోభ**

శ్రీకాకుళం సిటీ: 'మీకు సామాజిక బాధ్యత లేదా' అంటూ నగర పాలక సంస్థ కమిషనర్ పీఏ శోభ ప్రజలపై మండిపడ్డారు. ప్రతి చిన్న విషయానికి అధికారులు, సిబ్బందిపై విరుచుకుపడడం అలవాటుగా మారిందని, మీ మైండ్‌సెట్ మార్చుకోండి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆమె నగర పాలక సంస్థ పరిధిలోని గొంటివీధి, వాంబే కాలనీల్లో పర్యటించారు. ఆమె పర్యటన సమయంలో రోడ్లపై చెత్త ఉండడాన్ని గమనించి ఆమె ప్రశ్నించారు. పారిశుధ్య సిబ్బందికి చెత్త అందించకుండా రోడ్లపై వేయడమేమిటని ప్రశ్నించారు. ఇకపై ఇలా జరిగితే తమ సిబ్బందితో ఇళ్లలో వేయిస్తామని హెచ్చరించారు. ఇకపై అలా చేయబోయని ప్రజలతో ప్రమాణం చేయించారు. అనంతరం అక్కడి మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. వీధి లైట్లు, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు పర్యావరణ డీఈఈ శంకరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గణేష్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


వాంబే కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

న్యాయవాదుల క్రికెట్‌పోటీలు ప్రారంభం

గూనపాలెం, (శ్రీకాకుళం లీగల్): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న న్యాయవాదులు క్రికెట్ పోటీలను శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలగీతాంబ ప్రారంభించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న ఈ పోటీల్లో కేవలం న్యాయవాదులే కాకుండా గుమస్తాలు, న్యాయశాఖ సిబ్బంది కూడా చురుగ్గా పాల్గొన్నారు. న్యాయవాది సి.రామ్మోహన్ జట్టుపై ప్రతాప్ చంద్ర జట్టు గెలుపు సాధించింది. బి.దామోదర్ జట్టుపై జి.అనిల్‌కుమార్ జట్టు గెలుపొందింది. కాగా బై టీమ్‌గా వచ్చిన న్యాయవాది కె.సుభాష్ జట్టుతో..ప్రతాప్‌చంద్ర జట్టు తలపడింది. జి.అనిల్‌కుమార్ జట్టు నేరుగా సెమీస్‌కు చేరుకొంది. నేడు ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులతోపాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి

వైసీపీ మైండ్ గేమ్‌ను సవాల్‌గా తీసుకుంటా..

శ్రీకాకుళం సిటీ: వైసీపీ శ్రేణులు తనపై దుష్ప్రచారం చేస్తున్నాయని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. కొందరు తనతో మైండ్‌గేమ్ అడేందుకు ప్రయత్నిస్తున్నారని... దానిని తాను సవాల్‌గా స్వీకరిస్తున్నానన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేశానని...ఎథిక్స్ కమిటీ సభ్యుడిగా, సింహాచలం హౌస్ కమిటీ, ట్రైబల్, నాన్‌ట్రైబల్ కమిటీలు, బీసీ కమిటీల సభ్యుడిగా పార్టీ తనను గౌరవించిందన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన తనను కొంతమంది వైసీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని.. దానిని మానుకోవాలని హితవు పలికారు. తన సతీమణి లక్ష్మీదేవి రాష్ట్రంలోనే నెంబర్-1 ఎమ్మెల్యేగా గుర్తింపు పొందినప్పటికీ... ఏ అధికార కార్యక్రమంలో కూడా తాను పాల్గొనలేదన్నారు. ఆమెకు పూర్తిస్థాయిలో స్వేచ్ఛను నివ్వడవల్లే ఆమె ఈ ఘనత సాధించిందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు బుర్రి మధు, కెల్ల కొండలరావు, కరగాన భాస్కరరావు, కరగాన రాము, మాదారపు వెంకటేష్, పిఎన్ బాబా, సింతు సుధాకర్, బస్వా రాజేష్ రెడ్డి, తోణంగి వెంకన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

ఉపరాష్ట్రపతిగా వెంకయ్య ఎన్నికపై హర్షం

గార : ఉపరాష్ట్రపతిగా ఎం.వెంకయ్యనాయుడు ఎన్నికపై బీజేపీ, టీడీపీ నాయకులు వేరువేరు ప్రకటనల్లో హర్షవ్యక్తం చేశారు. బీజేపీ కిషాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.యోగేశ్వరరావు, మండల నాయకులు ఎం.అప్పారావు, మల్లేసు, బాలయ్య, టీడీపీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటరమణమూర్తి, వెంకటప్పారావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు వెంకటరమణమూర్తి, టీడీపీ నేతలు గిరి, మైగాపు ప్రభాకరరావు, గోర సురేష్, కొరాడ వెంకటరావు, కొంక్యాన రమణమూర్తి, పెద్దబాబు, కృష్ణమూర్తి, వైకుంఠరావు, రాజీవ్, కొయ్యాన జగదీష్ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

● 3 వేలకు పైగా అభ్యర్థులు హాజరు
● 20 కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు
నైపుణ్యంతో ఉజ్వల భవిత: కలెక్టర్ ధనుంజయరెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్

ఎచ్చెర్ల: చిలకపాలెం జంక్షన్లోని శివానీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో శనివారం ఏపీ ఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 20 బహుళ జాతి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 3 వేలకు పైగా అభ్యర్థులు హాజరయ్యారు. డిగ్రీ, బీటెక్, ఎంబీఏ చదివిన వారులు ఉద్యోగాల కోసం క్యూకట్టారు. టెక్ మహేంద్ర, అపోలో హాస్పటల్స్, కార్వే, ఏవీ సాఫ్ట్‌వేర్, వీఆర్ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌జీఎస్, బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎడికో ఇంటిగ్రేటర్, ఏసీఎల్, ఎంఎస్ అగర్వాల్ గ్రూప్, జెన్‌పెక్ట్, మెడ్‌ప్లస్, ఎడెటా గ్లోబల్ సర్వీసెస్, ఎంఎంసీ హెల్త్‌కేర్, పుజులోనా, జీ 4 ఎస్ సెక్యూరిటీస్, స్టార్స్ 9 న్యూస్, సీఎంఎస్ సొల్యూషన్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు.

నైపుణ్యం అవసరం

నైపుణ్యంతోనే ఉజ్వల భవిత సాధ్యమని కలెక్టర్ ధనుంజయరెడ్డి అన్నారు. జాబ్‌మేళా ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగాలు వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి గతంలో ఉండేదన్నారు. నేడు బహుళ జాతి కంపెనీలే మన ముంగిటకు వస్తున్నాయన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవడం ద్వారా లక్ష్యానికి చేరుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో 7 మిషన్లను ఏర్పాటుచేశారని, ఇందులోస్కిల్స్ డెవలప్‌మెంటు మిషన్ ఒకటని చెప్పారు. ఈ మిషన్ ద్వారా ఉద్యోగ కల్పనకు జాబ్‌మేళాను నిర్వహించడమే కాకుండా ఇండస్ట్రియల్, ఎంటర్‌పెన్యూర్, ఎంప్లాయిబిలిటీ తదితర శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో 13 కళాశాలల్లో ఉద్యోగ నైపుణ్యకేంద్రాలను, 4 కేంద్రాల్లో యూత్ ట్రైనింగ్ సెంటర్లు ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నడుస్తున్నట్టు తెలిపారు. అంబేద్కర్ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.తులసీరావు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ జీసీ కిశోర్‌కుమార్, ఎంపీపీ బీవీ రమణారెడ్డి, ఎచ్చెర్ల సర్పంచ్ మెండ రాజారావు, ఓఎస్‌డీ కృష్ణంనాయుడు, వెంకటనాయుడు, శివానీ యాజమాన్య ప్రతినిధులు వీఎం సాయినాథరెడ్డి, దుప్పల వెంకటరావు, పి.దుర్గాప్రసాదరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, ఏపీఎస్ఎస్‌డీసీ మేనేజర్ గోవిందరావు, టీపీవో డాక్టర్ జి.రాజేంద్రకుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.


జాబ్‌మేళాకు హాజరైన యువతీయువకులు

ఆరుగురు కార్మికులపై కేసు నమోదు

రణస్థలం: శ్యామ్‌పిస్టన్‌లో ఎన్ఎంఆర్ కార్మికులుగా పనిచేస్తున్న ఆరుగురిపై జేఆర్‌పురం ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదుచేశారు. శనివారం పరిశ్రమకు సంబంధించిన సమావేశంలో తమపై దురుసుగా ప్రవర్తించారని ఎగ్జిక్యూటివ్ స్టాఫ్ సునీల్‌బాబు, అమర్‌నాథ్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిరణ్, రామారావు, శివకుమార్, మహేష్, మూర్తి,రాజులపై కేసునమోదుచేసినట్టు ఎస్ఐ సత్యనారాయణ పేర్కొన్నారు.

అపరిచిత వ్యక్తుల సమాచారాన్ని అందించండి

మొగదలపాడు(గార) : సముద్రతీర గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల కదలికలపై సమాచారం అందించాలని కె.మత్స్యలేశం(పోర్టు కళింగపట్నం) మెరైన్ సీఐ అంబేద్కర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మత్స్యకార గ్రామమైన మొగదలపాడులో స్థానిక మత్స్యకారులకు అవగాహన కల్పించారు. సముద్రతీరంలోనూ, గ్రామాల్లోనూ అపరచిత వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే ఆ సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. ముంబాయి దాడుల నేపథ్యంలో సముద్రతీర గ్రామాల్లో మెరైన్ పోలీసులు స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు సముద్రంలో చేపల వేటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని... పడవులు , బోట్లు సంచారంపై కూడా సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్సైలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం..పర్యావరణాన్ని రక్షిద్దాం

వత్సవలస(గార) : మొక్కలునాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని ఎంపీడీఓ పక్కి కాంతారావు పేర్కొన్నారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా శనివారం వత్సవలసలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనం-మనం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర ఖాళీస్థలాల వద్ద మొక్కలునాటి ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించేందుకు కృషిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ దాసరి కుమారి, పంచాయితీ కార్యదర్శి, ఇతర పెద్దలు పాల్గొన్నారు.

డైట్‌ను సందర్శించిన రాష్ట్రస్థాయి అధికారులు



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

డైట్ ప్రాంగణం(గార) : పాఠశాలల్లో ప్రారంభించనున్న ఆనందలహరి అభ్యసన కార్యక్రమం ఏర్పాటుకు సంబంధించి రిషీవాలీ డైరెక్టర్లు పద్మనాభరావు, రమాదేవి, కోఆర్డినేటర్ వేణు శనివారం వమరవెల్లి డైట్ ప్రాంగణంలో ఉన్న మాదిరి పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం డివిజన్‌లో డెమో పాఠశాలగా డైట్ మాదిరి పాఠశాలను ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. ఈ మోడల్ పాఠశాలలో పిల్లల అభ్యసన ప్రక్రియలు, తరగతి వాతావరణాన్ని పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు, ఎస్ఎస్ఏ రాష్ట్ర పరిశీలకులు ప్రసాద్, ఏఏఎంఓ జయకృష్ణ, ఎంఈఓ ఎం.భాస్కరరావు, మాస్టర్ కోచ్ బి.రాజేశ్వరరావు, మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు పి.భాగ్యలక్ష్మి, పూర్ణిమ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారుల గుర్తించేందుకు గ్రామసభ

నిజామాబాద్(గార) : గృహనిర్మాణానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు శనివారం నిజామాబాద్‌లో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పక్కి కాంతారావు, గృహనిర్మాణ శాఖ ఏఈ ఎ.శంకరరావు మాట్లాడుతూ సర్వేలో గుర్తించిన జాబితా ప్రకారం ఇప్పుడు అర్హులు, అనర్హులు ఎవరనేది గుర్తించి అర్హుల జాబితాలను ఈనెల 15వ తేదీ లోగా ఆన్‌లైన్ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి ఎచ్చెర్ల రాజు, గృహనిర్మాణశాఖ వర్క్ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

సరుబుజ్జిలి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2016-17 సంవత్సరంలో ఏప్రిల్ వరకు రూ.3కోట్లు 35లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం నిర్వహించారు. ఈ ప్రజా వేదిక ఎస్ఆర్పీలు జె.తిరుపతి, పి.రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపాధి హామీ పీడీ హెచ్.కూర్మారావు హాజరై పంచాయతీ వారీగా డీఆర్పీలు 14 మంది గ్రామాల్లో జరిపిన తనిఖీలపై ప్రజావేదిక నిర్వహించారు. మండల కేంద్రంలోగల కళా మందిర ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇసుకలపాలెం పంచాయతీ వివరాలను డీఆర్పీలు చదివి వివరించారు. అదే సమయంలో పెద్ద సవళాపురం గ్రా మానికి చెందిన పీసీసీ కార్యదర్శి బద్రి రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులు గ్రామ స్థాయిలో సక్రమంగా అమలు జరగడం లేదన్నారు. జరిగినా సకాలంలో బిల్లు అందడం లేదని ఆరోపించారు. ఉపాధి హామీ పీడీ మాట్లాడుతూ తొమ్మిది పంచాయతీలకు రికవరీ రూ.57,547, పెనాల్టీ రూ.2,984గా విధించినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ కె.లోకేష్, డీపీవో వెంకట రమణ, పెన్నస్స ఏపీవో మూర్తి, డీపీఎం శ్రీరామమూర్తి, ఎండీవోమేడిడి ఎం.పావని, ఉపాధి హామీ ఏపీవో ఎ.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం కమల కుమారి పొండ్యన్, ఈసీలు, జన్మభూమి కమిటీ సభ్యులు శివ్వాల సూర్యనారాయణ పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు హాజరయ్యారు.


మాట్లాడుతున్న పీడీ కూర్మారావు

శివారు ప్రాంతాలకు సాగునీరు అందిస్తాం

గూడెం(శ్రీకాకుళం రూరల్) : ప్రతి సెంటుకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. గూడెం సమీపంలో ఉన్న వంశధార పంట కాలువను ఆమె శనివారం పరిశీలించారు. వంశధార పిల్లకాలువ ద్వారా సాగునీరు అందడం లేదని రైతులు ఫిర్యాదు మేరకు ఆమె పరిశీలించారు. అధికారులతో మాట్లాడి తక్షణం సాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆమెతో పాటు గూడెం, పాత్రునివలస రైతులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

తల్లిపాలు శ్రేయస్కరం

కాజీపేట(శ్రీకాకుళం రూరల్) : తల్లిపాలు పిల్లలకు తప్పనిసరిగా అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ఉమ అన్నారు. శనివారం కాజీపేట పంచాయతీ ఆదిత్యానగర్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం తల్లిపాలు వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కంపెనీ సెక్రటరీ కోర్సుకు డిమాండ్

ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల: కంపెనీ సెక్రటరీ కోర్సుకు మంచి డిమాండ్ ఉందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ జగదీశ్వరరావు అన్నారు. అంబేద్కర్ యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంకాం, లా కోర్సు విద్యార్థులకు వర్క్‌షాపు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశంలో 2 లక్షల మంది కంపెనీ సెక్రటరీలు కావల్సి ఉండగా, 50 వేల మంది మాత్రమే అందుబాటులో ఉన్నారన్నారు. రూ. 5 కోట్లు దాటిన ప్రతి కంపెనీకి సెక్రటరీలు అవసరమని తెలిపారు. నోట్ల రద్దు, జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఈ పోస్టులకు ఆవశ్యకత పెరిగిందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.తులసీరావు మాట్లాడుతూ ఎంబీఏ, ఎంకాం, లా కోర్సులు చేసిన వారికి కంపెనీ సెక్రటరీ కోర్సు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ విశాఖపట్నం చాప్టర్ కార్యదర్శి భార్గవ్, స్టడీ సెంటర్ ప్రతినిధి పట్నాయక్, వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చిరంజీవులు, కామర్స్ అండ్ మేనేజ్‌మెంటు విభాగాధిపతి ప్రొఫెసర్ టి.కామరాజు, వర్సిటీ బోధనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వర్సిటీ రిజిస్ట్రార్ తులసీరావు

అర్థంలేని ప్రకటనలు మానుకో...

ఆమదాలవలస: పరివర్తన్ ట్రస్టు అధ్యక్షుడు చింతాడ రవికుమార్ అర్థంలేని ప్రకటనలు మానుకోవాలని టీడీపీ నాయకులు బోర గోవిందరావు, పొన్నాడ వరహనర్సింహులు, బి.లక్ష్మణరావు, బీవీరమణ, కె.శివ, జీడీ ప్రసాద్ అన్నారు. శనివారం ప్రతికా ప్రకటన విడుదల చేశారు. విప్ కూన రవికుమార్‌ను విమర్శించే అర్హత చింతాడ రవి కుమార్‌కు లేదని ప్రతి రోజు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రతికల్లో ప్రకటనలు గుప్పించడం అర్థ రహితమన్నారు.

'సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి'

పెద్దబమ్మిడి(కోటబొమ్మాళి): పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పెద్దబమ్మిడి సర్పంచ్ శిమ్మ నారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు శిమ్మ పాపారావు అన్నారు. శనివారం వారు తహసీల్దార్ వి.శివబ్రహ్మానంద్ ఆధ్వర్యంలో పెద్దబమ్మిడిలో మీ ఇంటికి మీ రేషన్ పంపిణీ చేసి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ డి.వి.వి.ఎస్.రాజు, వీఆర్వో రాజు తదితరులు పాల్గొన్నారు.

'సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి'



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

పందిగుంట(సంతబొమ్మాళి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని మండల విద్యాశాఖాధికారి జె.చిన్నవాడు అన్నారు. శనివారం ఆయన నర్సాపురం పంచాయతీ పరిధి పందిగుంట ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఈ పాఠశాలలో 12 మంది విద్యార్థులే ఉన్నారని, గ్రామంలోని విద్యార్థులందరూ ఈ పాఠశాలలో చేరేలా గ్రామస్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులకు వివిధ సబ్జెక్టులపై ప్రశ్నలు వేశారు.

వృక్షాలను కూల్చేశారు



కోటబొమ్మాళిలో కూల్చిన మర్రిచెట్టు

కోటబొమ్మాళి: దశాబ్దాలుగా ప్రజలకు నీడనిస్తున్న వటవృక్షాలను శనివారం అధికారులు నేలకూల్చారు. కొత్తపేట నుంచి సంతబొమ్మాళి పాలేశ్వరస్వామి ఆలయం వరకు రూ.12 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఈ వృక్షాల కూల్చివేత అనివార్యమైందని అధికారులు తెలిపారు. తమ తాతల కాలం నుంచి ఉన్న వృక్షాలు ఒక్కసారిగా నేలకూలడంతో స్థానికులు మనస్తాపానికి గురయ్యారు. ఈ చెట్లు కూల్చినప్పుడు గంటల తరబడి ట్రాఫిక్‌జాం అయ్యింది. దీంతో పలు వాహనదారులు మండుటెండలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

'అన్న వస్తున్నాడు'ను జయప్రదం చేయండి

డీజీపురం(సంతబొమ్మాళి): వైసీపీ నిర్వహించనున్న 'అన్న వస్తున్నాడు నవరత్నాలు తెస్తున్నాడు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేడాడ తిలక్ కోరారు. శనివారం ఆయన వైసీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జగన్ ప్రకటించిన నవరత్నాల కార్యక్రమాలకు విశేష స్పందన వస్తోందని గ్రామాల్లో దీనిపై అవగాహన కల్పించాలన్నారు. కాగా లింగూడు ఉప సర్పంచ్ పరపటి దానయ్య, తదితరులు వైసీపీలో చేరారు. ఈ సమావేశంలో పిలక రవికుమార్ రెడ్డి, పీరుపల్లి రాజశేఖర్, ప్రధాన రాజేంద్ర, పరపటి మేనకేతనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పోలీసుకు అరదండాలు

టెక్కలిటౌన్: ప్రత్యేక పోలీస్ అధికారినని, కార్యాలయంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాల నిర్వహణపై తనిఖీకి వచ్చానని చెప్పి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ పేరుతో వసూళ్ల పర్వానికి ప్రయత్నించిన నకిలీ పోలీస్‌ను శనివారం ఎస్ఐ జి.రాజేష్ అరెస్టు చేశారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు.

వైద్యసేవలు అందని పీహెచ్‌సీ ఎందుకు?

● మండల సమావేశంలో సభ్యుల ధ్వజం

సంతబొమ్మాళి: ప్రజలకు వైద్యసేవలు అందించని బోరుభద్ర పీహెచ్‌సీ సిబ్బందిపై మండల సమావేశంలో సభ్యులు మండిపడ్డారు. శనివారం ఎంపీపీ కర్రి కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఇక్కడ కనీస స్థాయిలోనూ వైద్యం అందడం లేదని, వైద్యాధికారి రూస్సీ రోగులను పట్టించుకోవడం లేదని, అటువంటి పీహెచ్‌సీ ఎందుకంటూ లక్కివలస సర్పంచ్ శ్రీరంగం రాజులు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరంగం వీరాస్వామి హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావును ప్రశ్నించారు. రెండురోజుల క్రితం స్కూల్ బస్సు ప్రమాదానికి గురైతే క్షతగాత్రులకు వైద్యం అందించడానికి సిబ్బంది లేరని, 24 గంటలు పనిచేయాల్సిన పీహెచ్‌సీలో పరిస్థితి ఇలాగే ఉంటుందా అని వైస్ ఎంపీపీ సూరాడ భీమారావు ప్రశ్నించారు. సిరంజ్‌లు, సెలైన్‌సెట్లు రోగులు కొనుక్కోవాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నారు. మండల సమావేశానికి నలుగురు పీహెచ్‌సీ వైద్యులు రాకపోవడం ఏమిటని కర్రి విష్ణుమూర్తి ప్రశ్నించారు. అధికారులు రానప్పుడు సమావేశం ఎందుకు నిర్వహించడమని వడ్డివాడ ఎంపీటీసీ సభ్యుడు పొన్నాన కామేశ్వరరావు అన్నారు. అధికారుల గైర్హాజరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని మూలపేట సర్పంచ్ జీరు భీమారావు అన్నారు. భవిష్యత్‌లో గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ప్రభావతి హామీ ఇచ్చారు. రూ.లక్షల వ్యయంతో నీరు-చెట్టు పథకం కింద చెరువుల మరమ్మతులు చేస్తున్నా ఆక్రమణలు ఎందుకు తొలగించడం లేదని ఎంపీటీసీ సభ్యుడు కామేశ్వరరావు ప్రశ్నించారు. చెరువుల్లో ఆక్రమణలు ఉంటే వీఆర్‌వోలతో జెండాలు పాతించి ఉ డుపులు జరగకుండా చూడాలని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.ఎల్.నాయుడు సూచించారు. అక్రమంగా ఏర్పాటు చేసిన రొయ్యల చెరువుల వలన వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని, రొయ్యల చెరువులను తొలగించాలని గోవిందపురం సర్పంచ్ రెడ్డి అప్పన్న, ఎల్.ఎల్.నాయుడు రెవెన్యూ అధికారులను కోరారు. అన్న అమృతహస్తం పథకం కింద గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న పౌష్టికాహారంలో నాణ్యత ఉండడం లేదని, దీంతో ఎవరూ భోజనం చేయడం లేదని తోటాడ, జగన్నాథపురం సర్పంచ్‌లు సూరిబాబు, శ్రీనివాసరావు అన్నారు. వేసవిలో నీటి ఎద్దడి ఉన్నా బోర్లు బాగు చేయించకుండా విధులకు దుమ్మాకొట్టిన బోరు మెకానిక్ ప్రసాద్‌ను తొలగిస్తూ సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు లమ్మత లక్ష్మి, తహసీల్దార్ రామారావు, అధికారులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందిని నిలదీస్తున్న వైస్ ఎంపీపీ భీమారావు

'బాలల సంరక్షణ అందరి బాధ్యత'

కొత్తపల్లి(కోటబొమ్మాళి): బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని, బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో టి.నారాయణరావు అన్నారు. శనివారం ఆయన కొత్తపల్లి గ్రామంలో బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో చైల్డ్‌లైన్ నిర్వహించిన ఓపెన్‌హౌస్‌లో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బాల్యవివాహాల నిర్మూలన, బాలల అక్రమ రవాణా, కుల, మత, లింగ వివక్షత, నిర్లక్ష్యం, దౌర్జన్యం, హింసాత్మక చర్యల నుంచి బాలలు, మహిళలను కాపాడే చట్టాల గురించి వక్తలు వివరించారు. ప్రభుత్వం అనాథ పిల్లలకు విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. పిల్లల్ని పనుల్లో పెట్టకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎక్కడైనా పిల్లలు బానిసత్వానికి గురైనా, బాల్యవివాహాలు చేస్తున్నా వెంటనే 1098కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని చైల్డ్‌లైన్ టీం మెంబర్లు ఎం.గన్నప్పుడు, యు.శ్రీలక్ష్మి, ఎం.వి.వెంకటరమణ కోరారు. కార్యక్రమంలో నోడల్ పీసీ చంద్రశేఖర్, కౌన్సిలర్ హేమలత, ఐసీపీఎస్ కో-ఆర్డినేటర్ ఐ.జనార్దన రావు, సర్పంచ్ శిమ్మ వరలక్ష్మి, సింహాచలం పాల్గొన్నారు.



ఓపెన్ హౌస్‌లో మాట్లాడుతున్న ఎంఈవో రామకృష్ణ

'చట్టాలపై అందరికీ అవగాహన అవశ్యం'

కోటబొమ్మాళి: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు సివిల్ జడ్జి షేక్‌మీరా ఖాసిం సాహెబ్ అన్నారు. శనివారం ఆయన వెలుగు సిబ్బంది, సీఎఫ్‌లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహిళలకు సంబంధించిన చట్టాలు, వరకట్న వేధింపులు, బాల్యవివాహాలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత కుమారులు తీసుకోకపోతే శిక్షార్హులవుతారని తెలిపారు. ప్రతి ఒక్కరు చట్టాలపై చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండ వెంకట్రావు, మాజీ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాది సంబాళ్ల జోగారావు, వెలుగు ఏపీఎం చలపాక హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ షేక్‌మీరా ఖాసిం సాహెబ్

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

టెక్కలిటౌన్: మేజర్ పంచాయతీ టెక్కలి సర్వమంగళ వీధిలో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ కృష్ణవేణి బెహరా శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెక్కలి పట్టణాన్ని అభివృద్ధి చేయడమే తన కర్తవ్యమని చెప్పారు. మంత్రి అచ్చెన్నాయుడు కూడా టెక్కలి పట్టణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాశీ బెహరా, దోని బుజ్జి, దల్లి ప్రసాద్ రెడ్డి, బర్ల తవిటయ్య, మామిడి నారాయణ రావు, గండి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రన్న బీమాతో ఆర్థిక భరోసా'

సంతబొమ్మాళి: చంద్రన్న బీమాతో ఆర్థికంగా భరోసా లభిస్తుందని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.ఎల్.నాయుడు అన్నారు. శనివారం ఆయన సంతబొమ్మాళిలో పలువురికి చంద్రన్న బీమా చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. దేశంలో ఇటువంటి పథకం ప్రారంభించడం ఇదే ప్రథమమని చెప్పారు. ఈ పథకంలో ఆర్థిక సహాయం పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మొత్తం 11 మందికి బీమా పరిహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు కర్రి కృష్ణవేణి, లమ్మత లక్ష్మి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు జీరు భీమారావు, కర్రి విష్ణుమూర్తి, రెడ్డి అప్పన్న, ఎంపీడీవో ఎం.ప్రభావతి, ఏపీఎం గోవింద పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులకు ఆటంకం కలిగించవద్దు

● ఎస్పీ త్రివిక్రమవర్మ

హిరమండలం: "రిజర్వాయర్ పనులకు ఆటంకం కలిగించవద్దు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారులతో చర్చించి సామరస్యంగా పరిష్కరించుకోవాలి.. అలా కాదంటే కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఎస్పీ త్రివిక్రమవర్మ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వంశధార నిర్వాసిత గ్రామాలకు చెందిన కొంత మంది ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ పనులు అడ్డుకోవద్దని సమస్యలు ఉంటే తమకు తెలియ జేయాలని వాటిని ప్రభుత్వం, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. పనులు అడ్డుకో వడానికి సిద్ధపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్వాసిత గ్రామాలు ఖాళీ చేయించమని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. నిర్వాసితులు మాట్లాడుతూ ముందస్తు సమాచారం లేకుండా ,సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా గ్రామాలు ఖాళీ చేయాలని పేర్కొనడం సరికాదని తెలిపారు. చాలా కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉందని చెప్పారు. కొన్ని కుటుంబాలకు పునరావాసం కింద నష్టపరిహారం చెల్లించి నెలరోజులు కూడా కాలేదని, ఇంతలో స్థలం కొనుగోలు చేసి ఇళ్లు ఎలా కడతారని ఎస్పీ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో రెండు వర్గాలుగా ఉన్నారని వారందరితో కూడా చర్చించి అభిప్రాయం చెబుతామని నిర్వాసితులు చెప్పారు. ఎస్పీ స్పందిస్తూ ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు చొప్పున సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు శ్రీకాకుళంలో తన కార్యాలయంలో సమావేశానికి రావాలని చెప్పారు.అక్కడ సమస్యలపై చర్చించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు.కార్యక్రమంలో డీఎస్పీ సుబ్రహ్మణ్యం, సీఐలు ప్రకాశరావు, శ్రీనివాసరావు,ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వంశధార నిర్వాసితుల సంఘ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్పీ త్రివిక్రమ వర్మ

టెక్కలిలో సినిమాలు

సుదర్శన్	: గౌతమ్‌నంద
భవాని	: ఫిదా

కోటబొమ్మాళిలో..

శివకృష్ణ	: నక్షత్రం
అనుపమ	: గౌతమ్‌నంద

'పాతమేఘవరం బడికి అదనపు భవనాలు మంజూరుచేయండి'

సంతబొమ్మాళి: మండల పరిధి పాతమేఘవరం ఉన్నత పాఠశాలకు అదనపు భవనాలు మంజూరుచేయాలని మాజీ సర్పంచ్ వంక సోమేశ్వరరావు, మత్స్యకార సంఘ నాయకుడు సూరాడ ధనరాజ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు విజ్ఞప్తి చేశారు. పాతమేఘవరం ఉన్నత పాఠశాలగా మారి ఎనిమిది సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు విద్యార్థులకు తగ్గట్టు తరగతి గదులు లేని విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నిసార్లు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా భవనాలు మంజూరు కావడం లేదన్నారు. దీనిపై స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు అధికారులతో మాట్లాడి భవనాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని మత్స్యకార నాయకులు తెలిపారు.

వారంలోగా నందిగాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల

● మంత్రి అచ్చెన్నాయుడు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

నందిగాం: మండల కేంద్రం నందిగాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వారం రోజుల్లో ఏర్పాటవుతుందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. శనివారం ఆయన నందిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో కొత్తగా నిర్మించిన అదనపు గదులను ప్రారంభించి మాట్లాడారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోడానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నానన్నారు. ఉదయం ఉన్నత పాఠశాల, మధ్యాహ్నం జూనియర్ కళాశాల తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను అప్పట్లో తక్కువ నిధులతో ప్రతిపాదించారని, సవరించిన అంచనాలకు ముఖ్యమంత్రి అనుమతి లభించిన వెంటనే పనులు వేగంపెంచి వచ్చే ఎన్నికల సమయానికి పూర్తిచేస్తామని ప్రకటించారు. నందిగాంను మోడల్ మండలంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఇప్పటికే పలు రహదారులను నియమించామని చెప్పారు. పెద్దతామరాపల్లి-తూముకొండ రహదారిని రూ.25 కోట్లతో ప్రతిపాదించామన్నారు. ఉపాధి హామీ పథకం కింద మండలంలో రూ.12 కోట్లతో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నామని, మరో రూ.12 కోట్లతో మరి కొన్ని రోడ్ల పనులు చేపడతామని తెలిపారు. ప్రధాన వీధులన్నీ సీసీ రోడ్లుగా ఉండాలన్నారు. పాఠశాల మైదానాన్ని తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి.రాంబాబు, ఏపీవో ధనుంజయరావును ఆదేశించారు. అనంతరం మంత్రి పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి సంరక్షణా బాధ్యతలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ఏ ఈఈ సుగుణాకరరావు, ఆర్ఎంఎస్ఏ డీఈఈ జి.వి.ఎన్.మూర్తి, పశుసంవర్థక డీడీ మంచు కరుణాకర్, ఏడీ రవికృష్ణ, వ్యవసాయ శాఖ ఏడీ ఆర్.రవిప్రకాష్, మండల అధికారులు ఎస్.వి.నాగేశ్వరరావు, కె.సురేష్, మనోరత్నం, ఐసీడీఎస్ పీవో రాజరాజేశ్వరి, నాయకులు వెలమల విజయలక్ష్మి, మళ్ల బాలకృష్ణ, పి.అజయ్‌కుమార్, బగాది శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం మంత్రి నందిగాం, పెంటూరు గ్రామాల్లో కలియతిరిగి సమస్యలపై ఆరా తీశారు. నందిగాం-పూండీ రహదారిని 50 అడుగులమేర విస్తరించడంపై స్థానికులతో చర్చించారు. వారు సమ్మతించడంతో ఆదివారం నుంచే రెడ్ మార్కింగ్ ఇవ్వాలని ఆర్అండ్‌బీ డీఈఈ రామినాయుడుకు సూచించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం



తల్లిపాల వారోత్సవాలకు చిన్నారులతో హాజరైన తల్లులు

టెక్కలి: బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠమని ఎంపీటీసీ సభ్యురాలు దుక్క కుమారిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక వెంకటేశ్వర కాలనీ పరిధిలో తల్లిపాల వారోత్సవాన్ని అంగన్‌వాడీ కార్యకర్త హనుమంతు వాణిశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారిరెడ్డి మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇస్తే వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. వెల్‌బేబీషో నిర్వహించి బహుమతులిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు తల్లులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో నేడు చెత్త సేకరణకు శ్రీకారం

టెక్కలి: స్వచ్ఛ టెక్కలి సాధనలో భాగంగా టెక్కలిలో ఆదివారం నుంచి ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణకు పంచాయతీ యంత్రాంగం శ్రీకారం చుట్టనుంది. వీధుల్లో ఎవరి ఇళ్ల ముందు చెత్త కనిపించినా రూ.2 వేల అపరాధ రుసుం వేస్తామని ఇప్పటికే పంచాయతీ యంత్రాంగం ప్రకటించింది. వార్డు సభ్యులు, వ్యాపార, వాణిజ్య సముదాయాల సంఘ నాయకులతో ఇప్పటికే పాలకవర్గం సమావేశం నిర్వహించి ఈ విషయాన్ని చెప్పింది. చెత్త సేకరణకు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నామని వర్తక, వాణిజ్య సంఘం అధ్యక్షుడు లాడి శ్రీనివాసరావు ప్రకటించారు. చెత్తబుట్టలు కొనుక్కోమని ఇప్పటికీ అందరికీ చెప్పామని, చెత్త సేకరణ వాహనం వచ్చి విజల్ వేసేటప్పుడు చెత్తను తీసుకువెళ్లి వాహనాల్లో వేసేందుకు వ్యాపార వర్గాల వారికి అవగాహన కల్పించామన్నారు.

'ఆస్తి అడిగితే కుటుంబం నుంచి బహిష్కరణ'

టెక్కలి: తండ్రి పరంగా సంక్రమించిన స్థలాన్ని ఇమ్మని అడిగితే కుటుంబం నుంచి బహిష్కరించారని టెక్కలి మండలం పెద్దరోకళ్లపల్లికి చెందిన రామపాత్రుని వీరన్న ఆర్డీవో ఎం.వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 107 కార్యక్రమం నిర్వహించారు. ఇంటికి వచ్చే బంధువులను కూడా దగ్గరకు రానివ్వడం లేదని, పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, తనకు న్యాయం చేయాలని వీరన్న విజ్ఞప్తి చేశారు. గ్రామానికి చెందిన కొందరు తన స్థలాన్ని ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు.

'కాలుష్య నివారణే ధ్యేయం కావాలి'

విశ్వనాథపురం(కోటబొమ్మాళి): కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ, ఏపీవో జి.హరిప్రసాద్ అన్నారు. శనివారం ఆయన విశ్వనాథపురం పంచాయతీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ అంతా తమ ఇంటి పరిసరాల్లోనూ, ప్రభుత్వ స్థలాల్లోనూ, చెరువుగట్లు, కాలువగట్లపైన మొక్కలు నాటాలని కోరారు. దీనివల్ల బావితరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించే వారమవుతామన్నారు. పంచాయతీలకు అవసరమైనన్ని మొక్కలను ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఏఏ గ్రామాలకు ఎన్ని కావాలో చెబితే అందజేస్తామని తెలిపారు. మొక్కలు పెరిగేవరకూ కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత నాటే వ్యక్తిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రావాడ లక్ష్మీనారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథపురంలో మొక్కలు నాటుతున్న అధికారులు, నేతలు

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

● డీఈఈ గిరీశ్వరరావు



టెక్కలి: వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ముందున్న కర్తవ్యమని విద్యుత్ శాఖ డీఈఈ ఇ.గిరీశ్వరరావు చెప్పారు. శనివారం ట్రాన్స్‌కో డీఈఈ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం కలిగితే 24 గంటలు పనిచేసే టోల్‌ఫ్రీ నెంబర్(1912)కు ఫోన్ చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో దీనదయాళ్ గ్రామీణ ఉపాధ్యాయ జ్యోతి యోజన కింద నాలుగు సబ్‌స్టేషన్ పనులు(నందిగాం మండలం కొత్తగ్రహారం, నరసన్నపేట మండలం దేవాది, సోంపేట మండలం బుసభద్ర, ఇచ్ఛాపురం మండలం ఈదుపురం) చురుకుగా సాగుతున్నాయని, 2018 మార్చి నాటికి పూర్తికానున్నాయన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ పవర్ డవలప్‌మెంట్ స్కీం కింద కాశీబుగ్గలో సబ్‌స్టేషన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏ, బీ స్విచ్‌ల కొరత రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరాన్ని బట్టి కండక్టర్లు మారుస్తున్నామని తెలిపారు. ఏడు శాతం ఉన్న లైన్‌లాస్‌ను తగ్గించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఇళ్లకు విద్యుత్ సరఫరాకు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి అభ్యంతరాలు లేకపోతే 24 గంటల్లో కనెక్షన్ అందజేస్తామన్నారు. ఆయన వెంట ఏఈ పైల నారాయణరావు ఉన్నారు.

'జగన్‌ను చూస్తే టీడీపీ నేతలకు వణుకు'



విలేఖరులతో మాట్లాడుతున్న మంజు

టెక్కలి: ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిని చూసి అధికార పార్టీ నేతలకు వణుకు పట్టుకుందని వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, ఎంపీటీసీ సభ్యురాలు సత్తారు ఉషారాణి అన్నారు. శనివారం వారు స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ మంత్రి అచ్చెన్నాయుడు మహిళా అధికారులని చూడకుండా అనేకమందిని దూషించి, బెదిరించేవారని, ఆ సంస్కృతి అధికార పార్టీ నాయకులు ఇప్పటికీ కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇటీవలే ఓ ఐఏఎస్ అధికారిని మంత్రి బెదిరిస్తే సీఎం వద్ద పంచాయితీ పెట్టిన విషయం తెలిసిందేనన్నారు. మంత్రి అచ్చెన్నాయుడుపై కూడా ఆరు కేసులు ఉన్నాయని చెప్పారు. ఎన్నిచేసినా నంద్యాల ఉప ఎన్నికలో వైసీపీ అభ్యర్థి విజయం ఖాయమన్నారు.

'వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి'



రైతులకు సూచనలిస్తున్న కరుణాకర్

కొత్తపల్లి(కోటబొమ్మాళి): ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, కొత్తనీటి ప్రభావంతో పశువులకు సోకే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక శాఖ డెప్యూటీ డైరెక్టర్(టెక్కలి) మంచు కరుణాకర్ అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో కొత్తపల్లి గ్రామంలో పశు వృద్ధి-పల్లె సమృద్ధి కార్యక్రమంలో భాగంగా 80 పశువులకు గర్భకోశవ్యాధి, 20 ఆవులకు చూడి పరీక్షలు నిర్వహించి దూడలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా మొదటి శనివారం దత్తత తీసుకున్న కొత్తపల్లి గ్రామంలో పాడి పశువులకు అవసరమైన చికిత్సలు చేస్తామని, మందులు తామే సరఫరా చేస్తామని చెప్పారు. పశువులకు వ్యాధులు సంక్రమించినా వాటిలో ఎటువంటి మార్పులు వచ్చినా వెంటనే అందుబాటులోని పశువైద్యశాలకు తీసుకువస్తే మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి ప్రజ్ఞచైతన్య, మండల పశువైద్యాధికారి ఎ.రాంకుమార్, ఏవీవో ఆర్.శ్రీరామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

'ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టండి'



సదస్సులో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ శ్రీనివాస్

నందిగాం: ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలని టెక్కలి మున్సిఫ్ మెజిస్ట్రేట్ పి.శ్రీనివాస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన నందిగాం ఆదిత్య కళాశాల, బాలికల సాంఘిక సంక్షేమ గురుకులాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి మాట్లాడారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ నేర ప్రవృత్తితో కూడుకున్నవని, వీటి జోలికి పోకుండా బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. సత్ప్రవర్తనతో మెలిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. బాల్యవివాహాపై గ్రామాల్లో ప్రజల్ని చైతన్యవంతం చేయాలన్నారు. వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెండి గౌరీపతి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఉపాధ్యక్షుడు పి.సాయిరాజు, న్యాయవాదులు ఖజాన వెంకట్రావు, బాబూరావు, ఆనందరావు, వైకుంఠరావు, ఎస్ఐ వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

68 పశువులకు చికిత్స

తాళ్లవలస(సంతబొమ్మాళి): సంచార పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంతబొమ్మాళి పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం చిన్నతుంగాం, నర్సాపురం, ఆకాశలక్కవరంలో పశు సంచార వైద్యసేవలు నిర్వహించారు. 68 పశువులకు చికిత్స చేసినట్లు కిరణ్‌కుమార్ తెలిపారు. తాళ్లవలసలో 21 పశువులకు, 24 లేగదూడలకు నట్టలు నివారణ మందుతో పాటు 17 ఆడ దూడలకు బ్రూసెల్లా టీకాలు వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తాళ్లవలస సర్పంచ్ గున్న సుకన్య, తదితరులు పాల్గొన్నారు.